SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 01
June - 2025, Price Rs.20/-.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

జూన్ 2025
వెల రూ. 20/-
పుటలు - 56



తిరుపతి
శ్రీదేవి భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం
(02-06-2025 నుండి 10-06-2025 వరకు)

## ఒంటిమిట్ట శ్రీసీతారామచంద్రుల బ్రహ్మోత్సవ దృశ్యమాలిక

11-04-2025న ఒంటిమిట్టలో జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సతీసమేతంగా సమర్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారాచంద్రబాబు నాయుడుగారు.

















# గీతాశ్లోకార్థసారం

**శ్లో : ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-29వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కశ్చిత్= ఎవరో ఒకమహాపురుషుడు; ఏనమ్= దీనిని (ఈ ఆత్మను); ఆశ్చర్యవత్= ఆశ్చర్యమైనదానినిగా; పశ్యతి= చూచును; చ= మఱియు; తథా, ఏవ= అట్లే; అన్యః= మఱియొక మహాపురుషుడు; ఆశ్చర్యవత్= (దీని తత్త్వమును) ఆశ్చర్యకరముగా; వదతి= చెప్పును (వర్ణించును); చ= అట్లే; అన్యః= మఱియొకడు (యోగ్యుడైనవాడే); ఏనమ్= దీనిని (ఈ ఆత్మను); ఆశ్చర్యవత్= ఆశ్చర్యముగా; శృణోతి= వినును; చ= మఱియు; కశ్చిత్= ఒక్కొక్కడు; శ్రుత్వా, అపి= విన్నప్పటికిని; ఏనమ్= దీనిని; న, ఏవ, వేద= తెలిసికొనజాలడు.

**భావం:** ఎవరో ఒక మహాపురుషుడు మాత్రమే దీనిని (ఈ ఆత్మను) ఆశ్చర్యకరమైన దానినిగా చూచును. మరియొక మహాత్ముడు దీని తత్త్వమును ఆశ్చర్యకరముగా వర్ణించును. వేఱొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైన దానినిగా వినును. ఆ విన్నవారిలో కూడ కొందరు దీనిని గూర్చి ఏమియు ఎఱుగరు.



## ఆదిపురుష నీదాస్యమే చాలును

ఏదియుఁగానఁడు (గాననందు?) నేది గాదందు
ఆదిపురుష నీదాస్యమే చాలనాకు

గరిమఁ గొందరికి సాకారమై నిలిచితి
గురునిరాకారమై కొందరికి
సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు
ధర నిర్గుణమవట తగిలి కొందరికి

వొకటఁ గళాపూర్తి నొనరియుందువట
వొకట నిష్కళుఁడవై వుడివోవట
వొకచో జీవుల (కు) నీకొరయ భేదమట
వొకచో నె (న?) భేదమట వున్నారట నీకు

అదన నిందరిలోన నంతరాత్ముఁడవట
యెదుట శ్రీవేంకటేశుఁడవట
యిదియది యననేల యింతయును నీ మహిమ
కదిసి నీ పాదాలే కనుఁగొంటగాక

ఆధ్యాత్మిక సంకీర్తన 4-329



కొందరు నిన్ను ఆకారముతో, గుణాలతో, కళలతో కూడినవానిగా దర్శిస్తారు. మఱి కొందరు ఆకారం, గుణాలు, కళలు లేనివాడని తలుస్తారు. ఇంక పలువురు జీవులకూ పరమాత్మవైన నీకూ భేదమును భావిస్తారు. మరి కొందరు జీవులకూ నీకూ అభేదాన్ని భావన చేస్తారు. ప్రాణుల హృదయాలలో అంతరాత్మగా ఉంటూ శేషాద్రిమీద వేంకటేశ్వరుడుగా వెలుగొందుతుంటావు. చూడగా ఇది యంతయు నీ మహిమేకదా! మఱి నాకైతే ఎప్పుడూ నీసేవయే చాలు.

*-వ్యాఖ్యాత: కీ.శే.విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు*





తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

## 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ.240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ.2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ.1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన "చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి" పేర డి.డి. తీసి పోస్టు ద్వారా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి-517 507" ఈ చిరునామాకు పంపవచ్చు.

## 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందా నెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి'పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ-మెయిల్ (chiefeditortpt@gmail.com) ఐడిని సంప్రదించాలి.

04) ఈ-మెయిల్ సౌకర్యంలేని వారు 0877-2264543, 0877-2264359 నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ భవనం, తిరుపతి-517 507" చిరునామాలో సంప్రదించవచ్చు.



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥


గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,
పి.జి.డిప్లమో ఇన్ ఎపిగ్రఫీ, డిప్లమో ఇన్ యోగా

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ.(తెలుగు & సంస్కృతం), ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయ కుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 జూన్, 2025 సంచిక : 01


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| కమనీయం జన్మసాఫల్యం శ్రీకల్యాణవేంకటేశ్వరుని సాక్షాత్కారం | ఆచార్య వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు | 07 |
| సందేహాలు-సమాధానాలు | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 10 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| శ్రీవారి జ్యేష్ఠాభిషేకం | శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు | 12 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 16 |
| జగన్నాథ రథయాత్ర | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 17 |
| తేజోమూర్తి 'నమ్మాళ్వారు' | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 21 |
| 'శ్రీరామ' నామ జప ప్రభావము | శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి | 23 |
| తిరుక్కోవలూర్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| పరమయోగిని శ్రీతరిగొండ వెంగమాంబ అష్టాంగయోగం | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 27 |
| శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అప్పలాయగుంట | శ్రీమతి కె.విజయలక్ష్మి | 31 |
| శిష్యుడు కానివానికి ఇవ్వరాదు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 34 |
| ఉత్తమ పాలకుడు | డా॥ అయాచితం నటేశ్వరశర్మ | 35 |
| సాగుయాగం... వైభవప్రాభవం | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 36 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 38 |
| మహాభాగ్యం-యోగాభ్యాసం | శ్రీమతి గంగవరం శ్రీదేవి | 40 |
| కల్యాణ వేంకటేశ్వరుని ఆజ్ఞ | శ్రీ బి.భాస్కర రావు | 42 |
| విశ్వాసం గొప్పదనం | శ్రీ సురేష్ కుమార్ రెడ్డి | 43 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన-కీ.శే.మహామహోపాధ్యాయ కాశీకృష్ణాచార్య<br>నిర్వహణ-ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 44 |
| పెరియాళ్వార్ వైభవం | శ్రీమతి కె.లావణ్య | 46 |
| బాలగోపాల లీల(చిత్రకథ) | కథ: శ్రీమతి జె.పద్మినీ ప్రియదర్శిని<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| వేమన శతకం | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 50 |
| భాస్కర శతకం | డా॥ తిరుమల శ్రీనివాసాచార్య | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీదేవి భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారు, తిరుపతి
వెనుకచిత్రం: శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారు, అప్పలాయగుంట



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# "యోగ" ఆరోగ్యమార్గం

మన పురాతన సంస్కృతిలో జన్మించిన గొప్పసంపదలో **"యోగ"** ఒకటి. భారతీయుల ఋషుల తపోఫలమైన **'యోగశాస్త్రం'**–సమస్త విశ్వానికి శాంతి, ఆరోగ్యం, ఆత్మశుద్ధిని అందించడానికి మార్గదర్శకంగా నిలుస్తోంది అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. 'యోగ' అనేది కేవలం శారీరిక వ్యాయామం కాదు. అది మనస్సు, శరీరం, ఆత్మల సమన్వయమార్గం.

'యోగ' అనే పదం సంస్కృతభాషలో "యుజ్" అనే ధాతువునుండి జనించింది. దీని అర్థం– "ఏకత్వం సాధించుట". 'యుజ్యతే అనేన ఇతి యోగః', 'యుజ్యతే ఏతదితి యోగః' అనే వ్యుత్పత్తులను గమనిస్తే– 'ఇంద్రియాలను వశం చేసుకొని, మనస్సును భగవంతుడు లేదా పరమాత్మపై కేంద్రీకరించడమే!'

ఆదిశేషాంశసంభూతుడు–**'పతంజలి'** మహర్షి యోగశాస్త్ర ద్రష్ట. తన యోగశాస్త్రంలో 'యోగః చిత్తవృత్తినిరోధః'– మనస్సు చంచలత్వాన్ని నియంత్రించడం యోగానికి ప్రధాన లక్షణంగా పేర్కొన్నాడు.

**'యోగ'** ఒక సమగ్రజీవన విధానం. ఆధునిక మానవజీవితానికి దివ్యౌషధం. నేటి కాల గమనంలో వేగవంతమైన జీవనశైలి, మానసిక ఉద్వేగాలు, శారీరిక అసంపూర్ణతలు పెరిగిన నేపథ్యంలో యోగాప్రాముఖ్యత మరింత పెరిగింది. ప్రాణాయామం, ధ్యానం వంటివి మనస్సుకు సమతుల్యతను, స్థిరత్వాన్ని అందిస్తాయి.

'యోగ' శాస్త్రాన్ని పుస్తకరూపంలో అందించే దిశలో తిరుమల తిరుపతి దేవస్థానములు తమ వంతుగా– **'యోగసర్వస్వము'**, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విరచిత **'అష్టాంగ యోగసారము'**– అనే గ్రంథాలను భక్తపాఠకలోకానికి అందించింది. యోగాపై ఆసక్తిని, అనురక్తిని పెంచింది.

'యోగ' అనే అద్భుతమైన ధార్మిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నంలో భాగంగా 2015 సంవత్సరంలో మొదటిసారి జూన్ 21 న **'అంతర్జాతీయ యోగాదినోత్సవం'**గా జరుపుకోవడం ప్రారంభించింది. తద్వారా యోగా యొక్క విలువలను గుర్తించి ప్రపంచమంతటా ఆరోగ్యానికి, మానసిక సంస్కృతిని పెంపొందించాలనే సంకల్పం వ్యక్తమవుతోంది.

'యోగ' అనేది ఒక సత్యానికి పయనం. జీవన విలువలకు మార్గదర్శనం. 'లోకాః సమస్తాః సుఖినో భవన్తు' అనే ఆధ్యాత్మిక సంకల్పానికి 'యోగా' మౌలికమంత్రం. ఈ యోగాదినోత్సవం సందర్భంగా ప్రతి ఒకరూ తమ దినచర్యలో భాగంగా కనీసం కొంత సమయాన్ని కేటాయించి– 'ఆత్మశుద్ధిని– ఆరోగ్యవృద్ధి'ని సాధించాలి.

ఇక అఖిలాండకోటి బ్రహ్మాండనాయకునికి ప్రతిఏటా జరిగే జ్యేష్ఠాభిషేకం ఈ మాసం జ్యేష్ఠ శుక్లత్రయోదశి నుండి, పూర్ణిమవరకు వైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా జరుపబడుతుంది. ఈ అభిషేకం తిలకించి శ్రీనివాసుని దివ్యాశీస్సులు పొందుదాం.

ఈ జ్యేష్ఠమాసంలోనే వైష్ణవభక్తాగ్రేసరులు, పన్నిద్దరాళ్వార్లలో పేరొందిన 'నమ్మాళ్వార్ల' శాత్తుమొఱ, 'పెరియాళ్వార్ల' ఉత్సవం రావడం విశేషం. వారిని సంస్మరించుకోవడం మన ధర్మం.

ఇదే మాసంలో పురీక్షేత్రంలో జగన్నాథునికి రథయాత్ర కనులపండువగా జరుగుతుంది. 'సమైక్యత– సమగ్రతలకు' ప్రతీకగా నిలుస్తుంది పురీక్షేత్రం. అందుకే 'సర్వం జగన్నాథమయం' అనుకుంటూ ఆ స్వామిని స్మరించుదాం. మోక్షాన్ని పొందుదాం.

**'ఓమ్ తత్సత్'**




జూన్ 30,
జూలై 1, 2 తేదీల్లో
శ్రీనివాసమంగాపురం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి
సాక్షాత్కార వైభవోత్సవాల
సందర్భంగా...

# కమనీయం జన్మసాఫల్యం
# శ్రీకల్యాణవేంకటేశ్వరుని సాక్షాత్కారం

- ఆచార్య వేదాంతం శ్రీ విష్ణుభట్టాచార్యులు, 94907 41414

*మంగాపుర నివాసాయ।*
*శ్రీనివాసాయ తే నమః॥*

శ్రీనివాసమంగాపురంలో 'శ్రీకల్యాణ వేంకటేశ్వరుడి'గా ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీనివాసస్వామి అత్యంత రమణీయంగా ఎత్తైన ఎనిమిది అడుగుల సౌందర్యరూపం గర్భగుడిలో ప్రకాశిస్తూ ఉంది. ఆలయం రెండెకరాల సువిశాల ప్రాంగణంలో తూర్పు ముఖంగా గాలిగోపురం, పచనాలయం, కల్యాణమంటపం, యాగమంటపం, ధ్వజస్తంభం, గరుత్మంతుని ఆలయం మహామంటపం, ద్వారపాలకులు, ఆస్థాన మంటపం, శయనమంటపం, అర్ధమంటపం, గర్భగృహం, 25 అడుగుల ఎత్తైన విమాన శిఖరం శిల్పశోభాయమానంగా నిర్మించబడి ఉన్నాయి.

ఈ ఆలయనిర్మాణం స్పష్టంగా ఏనాటిదో అని చరిత్రకారులు నిర్ధారించలేక పోయినా, తాళ్లపాకవంశస్థుల కైంకర్యాలు, శాసనాల ద్వారా సుమారు 600 సంవత్సరాలకు పూర్వమే నిర్మించబడినదని చెప్పక తప్పదు. కొంతకాలం ఈ ఆలయం భక్త జనసంచారం లేకుండా ఎటువంటి పూజాదికాలు జరుగకుండా ఉన్న సమయంలో స్వామి, అర్చకస్వామికి స్వప్నంలో సాక్షాత్కారించిన తరువాత దినదినాభివృద్ధి చెందినదనుట నిస్సంశయము.

1967వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకొని అనేక సేవలు, భక్తులకు వసతి, ఆర్జితసేవలు క్రమబద్ధీకరించి ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నదనుట యదార్థం.





ఈ క్షేత్రం నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో అలరారుతూ ఉంది. వివాహం కావలసినవారు, ఇక్కడ జరిగే నిత్యకల్యాణంలో పాల్గొని శ్రీస్వామివారి కల్యాణకంకణాన్ని ధరిస్తే, తప్పక త్వరలో వివాహం అవుతుందని ప్రసిద్ధి ఉంది.

శ్రీమన్నారాయణుడు అర్చామూర్తిగా ఈ కలియుగంలో ఉండటానికి గాను నారాయణవనంలో శ్రీపద్మావతీదేవిని వివాహం చేసుకొని తిరుమలకు పయనమవుతూ అగస్త్య మునీంద్రుని ఆశ్రమానికి వచ్చి వారి ఆదేశంతో ఆరునెలలు నివాసమున్నాడని, అందుచేత ఆ స్వామి 'శ్రీకల్యాణవేంకటేశ్వరుడి'గా ప్రసిద్ధి చెంది ఆ క్షేత్రం శ్రీనివాసమంగాపురంగా గణుతికెక్కినట్లు- *'షణ్మాసావధి లక్ష్మీశో దీక్షితోఽహం మహామతే'* అని వేంకటాచలమాహాత్మ్యం పేర్కొంటోంది.

## సృష్టి స్థితి లయలకు ప్రతీక ఈ ఆలయం

శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారి గర్భగృహంలో ఉన్న రూపం **'స్థానకమూర్తి'**, అంటే నిలబడిన మూర్తి. అర్ధమంటపం ఉత్తరంవైపున శ్రీరంగనాథస్వామి **'శయనమూర్తి'**. దక్షిణం వైపున శ్రీలక్ష్మీనారాయణమూర్తి 'ఆసనమూర్తి'. ఈ ముగ్గురు మూర్తులు **'స్థానక- ఆసన- శయనము'**లు. సృష్టి- స్థితి- లయాలకు ప్రతీకలుగా వైఖానసఆగమం ఉపదేశిస్తుంది. ఇది ఈ ఆలయం యొక్క విశిష్టత.

## సాక్షాత్కారం

చరిత్రకందని నిర్మాణరీతులు అద్భుతంగా ఉన్నప్పటికీ, ఈ ఆలయం శత్రువుల దండయాత్రకులోనై కొంతకాలం శిథిలరూపం దాల్చెనని ప్రతీతి. పూజాదికములు లేని దుస్థితి. ఈ ఆలయం పాముపుట్టలకు నెలవు. గోపురమునందు పక్షుల రొదలు. ఆలయం చిమ్మచీకటి. పశువులకు స్థలమై, వృక్షములు దట్టంగా పెరిగి భయానక వాతావరణంలో ఉండేదట.

స్వామి తన స్థావరాన్ని పునర్నిర్మించుకొనదలచి కాంచీపుర నివాసియగు శ్రీసుందరరాజస్వామికి కలలో అగుపించి, తగు సూచనలిచ్చి అంతర్ధానమయ్యాడట. అతడు వెంటనే ఇక్కడకు వచ్చి పురప్రముఖులను, భక్తాదులను రప్పించి ఆలయమును శుభ్రం చేయించి, లఘు సంప్రోక్షణ గావించి, ఆ స్వామిమూర్తికి అభిషేకం జరిపించి, శ్వేతవస్త్రం-ఊర్ధ్వ పుండ్రములు తీర్చిదిద్ది, పుష్పమాలలతో అలంకరించి ఆపై ఆగమోక్తంగా సహస్రనామార్చన జరిపించెను.



ఆ శుభదినం 11-07-1940 విక్రమనామ సంవత్సర ఆషాఢశుద్ధ సప్తమీ పర్వదినం ఉత్తరఫల్గుణీ నక్షత్రం. ఆ తరువాత స్వామివారికి దినదినాభివృద్ధిగ అర్చనోత్సవాలు వైభవంగా జరగడం ప్రారంభమయ్యింది.

ఈ వైభవోత్సవం, సంప్రదాయం ప్రకారం 1980వ సంవత్సరం ముందు వరకు ఒకరోజు మాత్రమే జరిగేది. అటు తరువాత మూడురోజులపాటు కమనీయంగా 'సాక్షాత్కార వైభవోత్సవం' పేరుతో స్నపనతిరుమంజనం, విశేష నివేదనలు, అలంకారములు, ఊంజల్ సేవ, వేదపారాయణం, భజనసేవాది కార్యక్రమములు; మొదటిరోజు '**తిరుచ్చి ఉత్సవం**', రెండవ రోజు సాయంత్రం '**హనుమంత వాహనం**', మూడవరోజు సాయంత్రం '**గరుడవాహనం**' ఆనందోత్సాహాలతో నిర్వహించ బడుతోంది.



15వ శతాబ్దం రాయలకాలంలో ఈ శ్రీనివాసమంగాపురం వేదవిద్వాంసులకు నిలయంగా, యజ్ఞయాగాదులకు పవిత్రవేదికగా ఉండేదని శాసనాల ద్వారా తెలుస్తోంది.

తిరుమలకు పాదయాత్రగా వెళ్ళే భక్తులకు శ్రీనివాస మంగాపురం సమీపంలో ఉన్న శ్రీవారిమెట్టు మార్గం రెండవ



సోపానమార్గంగా ప్రసిద్ధి చెందింది. యాత్రీకులు శ్రీనివాస మంగాపురంలోగల శ్రీకల్యాణవేంకటేశ్వరుని దర్శించి, ఈ సోపానమార్గంద్వారా తిరుమలకు నడిచివెళ్ళడం ఒక ఆచారం.

శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి దివ్యసన్నిధిలో దగద్ధగాయమానంగా విరాజిల్లుతున్న ధ్వజస్తంభం, బలిపీఠంలు తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే 2000 సంవత్సరంలో స్వర్ణకవచాలతో ఆచ్ఛాదితంచేయబడి లఘుసంప్రోక్షణ గావించబడింది.

వైఖానసాగామోక్తంగా జరిగే ఈ '**సాక్షాత్కార వైభవోత్సవం**' భక్తజనుల హృదయాలలో స్వామి సాక్షాత్కారింపబడి సర్వులను అనుగ్రహిస్తున్నారనుట నిత్యసత్యం.

ఈ సంవత్సరం **జూన్ 30 నుండి జూలై 2 వరకు** జరిగే శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి సాక్షాత్కరవైభవోత్సవం సందర్శించి, కమనీయ హృద్యమనోహర జన్మధన్యతను గావించుకొని, భగవదనుగ్రహానికి ప్రీతిపాత్రులవుదాం.

*'శ్రీ శ్రీనివాసాయ మంగళం'*



# సందేహాలు సమాధానాలు

– డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

**ప్ర) అన్నదానం కంటె విద్యాదానం గొప్పదా? ఎందువలన?**

– వి.శ్రీమన్నారాయణ, ఆకివీడు.

**జ)** అన్నదానం మన సంప్రదాయంలో విశిష్టం. అన్నసూక్త మంత్రాలున్నాయి.

అన్నదానం మహాదానం
విద్యాదానమ్ అతః పరమ్।
అన్నేన క్షణికాతృప్తిః
యావజ్జీవం తు విద్యయా॥

అనే శ్లోకాన్నిబట్టి అన్నదానం మహాదానమే. కాని, విద్యాదానం దీనిని మించినది. అన్నం క్షణికమైన తృప్తినివ్వగా విద్యాదానం జీవితపర్యంతం లాభిస్తుంది. అయితే, అన్నార్తుడైన వ్యక్తికి అన్నదానాన్ని మించిన దానం లేదు. విద్యను దొంగలు హరించరు.

ఇలా అన్నదానం, విద్యాదానాల గొప్పదనాన్ని గూర్చి ఎంతైనా చెప్పవచ్చు. అన్నం పరబ్రహ్మస్వరూపం.

**ప్ర) ఆజ్యం, దవనం, గుగ్గిలం- వీటిని గురించి తెలియజేయండి?**

– శ్రీమతి సత్యలత, హనుమాన్ జంక్షన్.

**జ)** 'ఆజ్యం' అనగా నేయి. 'దవనం'– సుగంధ భరితం. 'గుగ్గిలం'– ధూపం.

ఈ మూడింటికీ పొంతన లేదు. విడిగా అర్థాలు తెలుసుకోవచ్చు. "అగ్నికి ఆజ్యంతోడైనట్లు" అని సామెత. తృప్తిగా భోజనంచేసేవారికి, యజ్ఞయాగాదులకు నేయి ప్రధానం. పంచామృతాలలో నేయి వాడతారు. ఆజ్యధారలతో అగ్నిని సంతృప్తి పరుస్తారు. హోమద్రవ్యాలను ఆజ్యంతో వెలిగిస్తారు.

'దవనం' సుగంధాన్ని ఇచ్చే ఆకు. పూలమాలలో దవనం వాడతారు. సౌందర్య సాధనాలలో, ఔషధతయారీలో వాడతారు. ఇది శక్తివర్ధకము, ధాతువర్ధకము.

'గుగ్గిలం'– ఒకరకమైన ఔషధమొక్క. గుగ్గిలధూపాన్ని ఇంట్లో వేస్తారు. అగ్గిమీదగుగ్గిలం– అనే పదప్రయోగం వాడుకలో ఉంది. గుగ్గిలధూపం హృద్రోగ సంబంధ వ్యాధులు నివారిస్తుంది. చిన్నపిల్లలకు గుగ్గిలధూపం వేయడం పాత రోజుల్లో అలవాటు.

**ప్ర) 'దేహమే దేవాలయం' అంటారు. ఎందువల్ల?**

– శ్రీమతి సత్యవతి, చెన్నై.

**జ)** దేహో దేవాలయః ప్రోక్తో
జీవః ప్రోక్త స్సనాతనః।
త్యజేదజ్ఞాననైర్మాల్యం
సోహంభావేన పూజయేత్॥

దేహమే దేవాలయం. జీవుడు ఈశ్వరస్వరూపం. అజ్ఞాన మనే నైర్మల్యాన్ని తీసివేసి "నీవే–నేను" అనే భావంతో పూజించాలి. ఆత్మకు దేహం ఆలయమైనట్లే, ఊరికి దేవాలయం అటువంటిది. యోగులు సాకార భగవంతుని సూర్యమండలం లోనూ, హృదయగుహలోను, కంటిపాపలోనూ దర్శిస్తారు.

అందుకే దేవాలయం మానవశరీరంతో పోల్చారు. మహా ద్వారం పాదపీఠం. స్తంభాలు చేతులు. శిఖరం శిరస్సు. హృదయం భగవంతుడు. ఆత్మ దీపం. శరీరమే దేవాలయం అనే భావనతో పరమాత్మను ఉపాసించి జీవబ్రహ్మైక్యం పొందాలి.

**ప్ర) 'తత్త్వమసి' అంటే ఏమిటి?** – శ్రీనివాస్, తిరుపతి.

**జ)** "నువ్వే అది" అని అర్థం. అది నీవై ఉన్నావు. 'అది' అంద, బ్రహ్మ– లేదా అంతిమసత్యం. 'నువ్వు' అంటే ఆత్మ– లేదా వ్యక్తి. ఈవాక్యం మన దైవికసారాన్ని తెలియజేస్తూ స్వీయ సాక్షాత్కారానికి పిలుపునిస్తుంది.

సామవేదంలో ఛాందోగ్యోపనిషత్‌లోని మహావాక్యమే 'తత్త్వమసి– 'నమస్కారం' అనే సంకేతం ద్వారా ఇది సూచింపబడింది.

నమస్కరించే ముందు ఎందుకు, ఎవరికి నమస్కరిస్తున్నామో తెలుసుకుని నమస్కరించాలని దాని భావం. తత్+ త్వం+అసి అని మూడు పదాల కలయిక– తత్త్వమసి.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



**గతసంచిక తరువాయి..**

"శేషా! నేను ఓడిపోయాను కదా! అని బాధపడకు. నీవు వేంకటగిరిని వీడవద్దు. వేంకటగిరే సర్వస్వమని భావించు. నీ మీది ప్రీతితో చక్రపాణి వేంకటాద్రిలో కలికాలందాకా వెలుగనున్నాడు" అని భవిష్యత్ కథనం చేశారు. అపుడా శేషుడు "దేవతామూర్తులారా! నేను వాయుదేవునితో పంతం పెట్టుకోవడం సరికాదు. అదే నా తొలి తప్పు. పందానికి ఒప్పుకోవడం రెండవ తప్పు. అలాంటి హరి కరుణిస్తాడని ఎలా నమ్మను? నా గర్వమే ఈ అవమానానికి దారి తీసింద"ని బాధపడసాగాడు. అపుడా బ్రహ్మ "నీకా చింత యేల? ఆ వనజదళాక్షుడే ఈ గిరి మీద నివసించేలా నా ప్రయత్నం నేను కొనసాగిస్తా. అందాక ఈ గిరినే సర్వరక్షగా భావించు. హరిని ఇక్కడికి రప్పించడం నా పూచీ" అని శేషుని శిరస్సును మెల్లగా స్పృశించి అభయమిచ్చి తన లోకానికి వెళ్లిపోయాడు. ఇంద్రాదులు కూడా అక్కడి నుండి నిష్క్రమించారు. శేషుడు వైకుంఠపతికి సాష్టాంగదండప్రణామం చేసి పర్వతాకారుడయ్యాడు.

శేషాద్రి తలభాగాన వేంకటాద్రి. తోక చివరిది అహోబిలం. ఈ పర్వతమంతా తీర్థమయం. ఈ పవిత్రప్రదేశంలో దేవతలు తరురూపంలో, ఋషులు మృగరూపంలో, పితృగణం పక్షులరూపంలో, కిన్నరాదులు పాషాణరూపంలో ఉంటారు, అని వరమిచ్చి, దేవతలు కూడా నిష్క్రమించారు.

స్వామిపుష్కరిణి సర్వపాపహారి. గంగాది నదులు ఈ పుష్కరిణిలోనే ఉంటాయి. పుష్కరిణీస్నానం చేసినవారు మోక్షార్హులు అవుతారు. పుష్కరిణీ తీర్థ ప్రదేశంలో శ్రాద్ధకర్మలు ఆచరిస్తే పితృదేవతలు అమృతపానం చేసినంతగా ఆనందిస్తారు. అంతేకాదు నారాయణుడనే బ్రాహ్మణుడు స్వామిపుష్కరిణీ తీర్థస్నానం చేసి హరిదివ్యధామం చేరుకున్నాడు.

ఇప్పటిదాకా నేను శేషాద్రివైభవాన్ని మీకు చెప్పాను. ఇంక వేంకటాద్రి వైభవాన్ని చెబుతాను. ఈ సందర్భంలో మాధవుడనే బ్రాహ్మణునికథ కూడా చెబుతాను వినండి.

శ్రీకాళహస్తిలో పురందర సోమయాజి ప్రసిద్ధుడైన ఒక బ్రాహ్మణుడు. అతని కుమారుడే మాధవుడు. అతని భార్య చంద్రరేఖ. ఇద్దరూ మంచివారే. కానీ, కర్మవశాన మాధవుడు ఒకరోజు పట్టపగటి వేళ కామాతురుడై చంద్రరేఖను రతిక్రీడార్థం బలవంతం చేశాడు. కానీ, ఇది తగదన్నది చంద్రరేఖ. అంతేగాక ధర్మవిరుద్ధమంది. ఇంట పెద్దవారుండగా ఈ ఆలోచన సరికాదు కదా! మరి దేవతార్చన, అగ్నిహోత్రాదులు వేదోక్తంగా మన ఇంట సాగుతున్న వేళ ఏమిటీ పెడబుద్ధి అని మాధవునికి గుర్తు చేసింది. చివరగా నియమనిబద్ధాలకు కట్టుబడిన ఆచారస్త్రీని అని స్పష్టం చేసింది. మాధవుడు అప్పటికే చంద్రరేఖరూపలావణ్యాలకు మతిపోగొట్టుకున్నాడు. ఈ విపరీత ఆలోచన వద్దని భార్యగా భర్తను బతిమాలింది. అయినా కామాసక్తితో చంద్రరేఖను శతవిధాలా బలవంతం చేయసాగాడు. చివరకు చంద్రరేఖ "స్వామీ ఇంట ఈ ఆలోచన తగదు. దయతో మీరు దర్భలు, పూలకోసం నదీతీరానికి రండి. నేను నదీజలార్థం కలశంతో ఆ ప్రదేశం చేరుకుంటాను. అక్కడ మీ సంకల్పం పూర్తికావచ్చని" చెప్పక చెప్పింది. మాధవుడు తన కోరిక తీరే అవకాశం వచ్చిందని ఉబ్బితబ్బిబ్బయ్యాడు. సరేనంటూ పూలకోసం వచ్చినట్లుగా సువర్ణముఖరీతీరంలో తచ్చాడసాగాడు. సరిగ్గా, అదే సమయంలో నదీతీరంలో పద్మినీజాతి చండాలస్త్రీని చూశాడు. ఆమె రూపరేఖా వయోవిలాసాలకు ఆకర్షితుడయ్యాడు. అదే సమయంలో భార్య చంద్రరేఖ రానే వచ్చింది. భార్య పొందుగోరిన మాధవుడు క్షణంలో అన్యస్త్రీ అయిన చండాలస్త్రీపై కోరికలు పెంచుకున్నాడు. చక్కనిచుక్క అయిన ఆమె పొందుకోసం తహతహలాడిపోయాడు. చివరకు కలశంతో వచ్చిన చంద్రరేఖతో "నిన్ను పరీక్షించాలని నేను మన ఇంట తగనికోరిక కోరాను. నాకు తెలుసు దివా సంభోగం తగదని. అయినా, భార్యగా నీవు నిర్దేశించిన స్థలానికి వచ్చాను. నాకిప్పుడా కోరిక లేదు. నీవు జలకలశంతో ఇంటికి వెళ్ళు. నేను నెమ్మదిగా వస్తానులే" అని చంద్రరేఖను పంపించేశాడు. అప్పుడా చంద్రరేఖ తన భర్తలో మార్పు వచ్చిందని సంతోషించింది. ధర్మభంగం కాలేదనే తృప్తితో ఇంటికేసి అడుగులు వేసింది. *(ఇంకా ఉంది)*



# శ్రీవారి జ్యేష్ఠాభిషేకం

- శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు

శ్రీవేంకటాచలాధీశం శ్రియాధ్యాసిత వక్షసం।
శ్రితచేతన మందారం శ్రీనివాసమహం భజే ॥

శ్రీనివాసప్రభువు సమస్త చరాచర సృష్టికి జగత్ప్రభువు, సర్వాధారుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజనవత్సలుడు, లక్ష్మీదేవిని వక్షఃస్థలమందు ధరించినవాడు. పాపపంకిలమైన ఈ కలి యుగంలో, భక్తజనులందరికీ మార్గనిర్దేశం చేస్తూ, పూజలందు కుంటున్నాడు. అందుకే నిత్యం శ్రీవారిఆలయంలో పఠింపబడే దివ్యమైన శ్రీవేంకటేశసుప్రభాతం- "సంసారసాగర సముత్తరణైక సేతో"- అన్నట్లుగా 'శ్రీవేంకటేశ! నీవు లక్ష్మీదేవికి నివాసమైన వాడవు. సద్గుణ సముద్రుడవు. సంసారసాగరాన్ని తరించుటకు అనువైన వారధివి. వేదాంతవేద్యుడవు. భక్తులకు స్వాధీనుడవు! అని హృద్యంగా కీర్తిస్తుంది. నిజమే! దేవదేవుడైన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసప్రభువు భక్తులకు స్వాధీనుడు. అందుకు వరాహావతారంలో చరమశ్లోకంలో స్వామి భక్తులను అనుగ్రహిస్తూ-

తతస్తం మ్రియమాణం తు కాష్ఠ పాషాణ సన్నిభమ్।
అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్॥

అని వాగ్దానం చేస్తాడు. ఎవరైతే తమ ప్రాణాలను వదిలే సమయంలో నన్ను స్మరిస్తారో వారు నన్నే చేరుకుంటారని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ కూడా పేర్కొన్నాడు.

అదే విధంగా శ్వేతవరాహకల్పంలో శ్రీఆదివరాహస్వామిగా అవతరించిన శ్రీమన్నారాయణుడు కల్పాంతం వరకు సమస్త ప్రాణికోటిని తరింపజేయటానికి శ్రీవేంకటాచలపర్వతంపై అర్చావ తారరూపంలో కొలువై ఉండి, ఇలా అనుగ్రహించాడు.

ఏ మానవులైతే శరీరం చక్కగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే, మనస్సు స్వాధీనంలో ఉన్నప్పుడే విశ్వరూపుడైన నన్ను స్మరిస్తారో వారినే నేను సదా రక్షిస్తాను. వారు దేహత్యాగాన్ని చేయబోయే సమయంలో, స్పృహలేకుండా కట్టెవలె, రాయివలె నిశ్చేష్టులై ఉన్నా కూడా, నేనే వారి చివరి దశను తెలుసుకుంటాను. నేను స్వయంగా వచ్చి, వారిని నా దివ్యధామానికి చేర్చుకుంటాను అని తన అపార కరుణాకటాక్షాలతో అనుగ్రహించాడు. అందుకే వేంకటాచలక్షేత్రం పరమపావనమైనది, మహత్తు కలిగినది, సదా దర్శనీయమైనదిగా విరాజిల్లుతున్నది.

శ్రీవైకుంఠంలో భాగమైన శ్రీవేంకటాచలక్రీడాపర్వతంపై, 'శ్రీవైకుంఠవిరక్తాయ స్వామిపుష్కరిణీతటే' అని అన్నట్లు, శ్రీమన్నారా యణుడు స్వయంభువుడు. సాలగ్రామదివ్య అర్చావతార రూపంలో కొలువై, కోరిన వరాలందించే కోనేటిరాయడుగా భక్తులను కటా క్షిస్తున్నాడు. శ్రీవారికి అత్యంత ప్రాచీనకాలం నుండి కూడా భగవాన్ విఖనసమహర్షి ప్రవచించిన శ్రీవైఖానసభగవచ్ఛాస్త్రవిధిగా సమస్త ఆరాధనలు జరుపబడుతున్నాయి. తిరుమలలో శ్రీవారికి ప్రీతికర



జూన్ నెల 9, 10, 11 తేదీలలో
తిరుమలలో జ్యేష్ఠాభిషేకం సందర్భంగా....

మైన సంప్రదాయంలో జరిగే కైంకర్యాల యొక్క తాత్త్వికతనే 'శ్రీలక్ష్మీ విశిష్టాద్వైత' విధానంగా, 10వ శతాబ్దానికి చెందిన వైఖానస అర్చకులు, శ్రీమాన్ శ్రీనివాసదీక్షితులవారు శ్రీవారినిగూర్చి పేర్కొన్నారు.

**లక్ష్మీవిశిష్టః యత్రమతే తత్ లక్ష్మీవిశిష్టాద్వైతమ్॥**

లక్ష్మితో కూడి విగ్రహరూపంలో ఉన్న శ్రీమన్నారాయణుని అర్చించడమే, మోక్షప్రాప్తికి రాజమార్గమని లక్ష్మీవిశిష్టాద్వైత సిద్ధాంతం. ప్రారంభంలో శ్రీవారి దివ్యఅర్చావతారరూపంతో పూజలు జరుపబడి, తిరుమల క్షేత్రం **'ఏకబేరఆలయం'**గా ప్రశస్తి చెందినది.

**సాలంబం సగుణం శ్రేష్ఠం సకలం కౌతుకార్చనం।**
**సకామానాం సముచితం సంసారా శ్రమీణాం సదా॥**

అని భృగుప్రోక్త క్రియాధికారం పేర్కొంటోంది. కోరికలు గల గృహస్థులకు ఎల్లప్పుడు సాలంబం, సగుణం అయిన కౌతుకమును అర్చించడమే శ్రేష్ఠం.

శ్రీవారి మూలవిరాట్‌రూపంలో దివ్యమైన సాన్నిధ్యశక్తిని, కౌతుకరూపంలో ఉన్న విగ్రహమునందు నిత్యం ఆవాహన చేసి, విధిపూర్వకంగా ఆరాధన చేయాలి. ఇది 'ఐహిక ఆముష్మిక' ఫలప్రదంగా చెప్పబడింది. అంటే ఎటువంటి భౌతికమైన కోరికలు లేక మోక్షాన్ని కోరి స్వామిని సేవించేవారు, అలాగే తమ ఇష్ట కామ్యార్థ సిద్ధికోసం స్వామిని దర్శించేవారు, ఇరువర్గాలవారి కొరకు తప్పనిసరిగా కౌతుకమూర్తి ఆరాధన జరపాలని వైఖానస ఆగమం పేర్కొన్నందువలన, తిరుమలలో 614వ సంవత్సరంలో, పల్లవరాణి 'సామవై పేరుందేవి' ద్వార, వెండి విగ్రహమైన శ్రీభోగశ్రీనివాసమూర్తి బహూకరించబడి, ఇది **కౌతుకబేరం**గా ప్రతిష్ఠగావించబడింది. క్రమేపి ఆలయంలో ఉత్సవాలను జనరంజకంగా నిర్వహించటానికి 1339 సంవత్సరంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారి పంచలోహవిగ్రహాలు ప్రతిష్ఠించబడినాయి.

**'స్నపనబేరం'**గా ఉభయదేవేరుల సమేతంగా శ్రీఉగ్రశ్రీనివాసమూర్తివారు, **'బలిబేరం'**గా శ్రీకొలువుశ్రీనివాసమూర్తివారికి నిత్య పూజలు జరుపబడుతున్నాయి.

శ్రీవారి ఆలయంలో 'నిత్యకల్యాణం-పచ్చతోరణం' అన్న చందంగా, ఏటా 365 రోజులకు గానూ, సుమారు 470 ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా, నేత్రపర్వంగా నిర్వహింపబడుతున్నాయి. వైఖానసాగమోక్తంగా జరుపబడే ఈ ఉత్సవాలలో భాగంగా, శ్రీమలయప్పస్వామివారికి అభిషేకాలు, స్నపనతిరుమంజనాలు చేయబడుతాయి.

అయితే, ఈ విధంగా అభిషేకాలు జరుపడం వల్ల బింబముల మూలస్వరూపంలో మార్పులు, అరుగుదల సంభవించే అవకాశం ఉంది. దీని పరిష్కారం కొరకు 90వ దశకంలో శ్రీవారి ఆలయంలో సంవత్సర ఉత్సవంగా **'జ్యేష్ఠాభిషేకం'** అనే ఉత్సవం ప్రవేశపెట్టబడి శాస్త్రోక్తంగా నిర్వహింపబడుతున్నది.

**జ్యేష్ఠే మాసితు సంప్రాప్తే జ్యేష్ఠానక్షత్రసంయుతే।**
**విష్ణోరేవ విశేషస్యాత్సుగంధం తైలమాహరేత్॥**

**-భగవాన్ భృగుః (ప్రకీర్ణాధికారః)**

జ్యేష్ఠమాసంలో, చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంతో కలిసి ఉన్న పూర్ణిమనాడు, దేవదేవుడైన విష్ణువు యొక్క విగ్రహమునకు విశేషమైన సుగంధతైలమును సమర్పించాలని భృగువు ప్రకీర్ణాధికారంలో పేర్కొన్నాడు. దీనినే 'సుగంధతైల సమర్పణ ఉత్సవం'గా క్రియాధికారంలో చెప్పబడినది. ఈ ఉత్సవాన్ని వైఖానసాగమోక్తంగా నిర్వహించటంవల్ల విష్ణువు యొక్క దివ్య అర్చావతారం అమితమైన తేజస్సుతో వెలుగొందుతుందని **'క్రియాధికారం'** తెలియజేస్తున్నది. తిరుమలలో జ్యేష్ఠాభిషేకాన్ని జ్యేష్ఠశుక్లత్రయోదశినాడు ఆరంభించి, జ్యేష్ఠశుక్లచతుర్దశి మరియు జ్యేష్ఠపూర్ణిమనాడు అంతమయ్యే విధంగా మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించబడుతున్నది. జ్యేష్ఠాభిషేకమహోత్సవానికి 15 రోజులు ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి గత సంవత్సరం సమర్పించబడిన స్వర్ణకవచములు సడలింపు చేస్తారు.

**'పరిలిఖిత'మితి మంత్రేణ కవచం పరిశోధయేత్।**
**జీర్ణే ఛిన్నే చ కవచే శిల్పినైవ సుసన్నయేత్॥**

**- భగవాన్ భృగుః - ప్రకీర్ణాధికారం**



ఈ ఉత్సవ నిర్వహణకు ప్రత్యేకంగా 'కంకణభట్టర్' అని పిలువబడే వైఖానస అర్చకునికి ప్రధానాచార్యునిగా బాధ్యతలు ఇవ్వబడుతవి. ప్రకీర్ణాధికారంలో చెప్పబడిన విధంగా ఆచార్యస్వామి ఉత్సవమూర్తుల మీదున్న స్వర్ణకవచమును **'పరిలిఖిత...'** అను మంత్రంతో చక్కగా పరిశోధన చేయవలెను. అటుపై ఆ స్వర్ణకవచ ములలో ఏవైనా లోపములుంటే, వాటిని సడలింపు చేసి, సుశిక్షితు డైన శిల్పిచే వాటిని సరిచేసి సిద్ధంగా ఉంచుకోవాలని శాస్త్రవచనం.

జ్యేష్ఠాభిషేకం **మొదటిరోజు**, శ్రీవారికి మాధ్యాహ్నిక ఆరాధన అయిన తర్వాత, శ్రీమలయప్పస్వామి వారిని, ఉభయదేవేరి సమే తంగా విమానప్రాకారప్రదక్షిణగా, సంపంగి ప్రాకారంలోని కల్యాణ మండపంలోని యాగశాలకు వేంచేపు చేస్తారు. యాగశాలలో **'అష్టోత్తర శతకలశ స్నపనతిరుమంజనం'** అనే వైదికక్రియను 108 కలశాలతో నిర్వహిస్తారు. వైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా దేవతా ప్రార్థన, విష్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం, అంకు రార్పణం, రక్షాబంధనం, అగ్నిప్రణయనం మొదలైన క్రియలను శాస్త్రోక్తంగా, వేదమంత్ర పురస్సరంగా నిర్వహిస్తారు. తదుపరి, ఈ ఉత్సవానికి సర్కార్ (తి.తి.దేవస్థానం) వారి తరపున కార్యనిర్వ హణాధికారి దంపతులకు సంకల్పం చెప్పబడుతుంది. యాగశాలలో 108 కలశములను, 9 కలశములను ఒక అమరికగా-4 వరుస లలో ఉంచుతారు. ఇలాంటి వరుసలు మూడుంటాయి. మధ్యలో ఉన్న ప్రధానకలశంలో వరుణదేవతను ఆవాహనచేసి, ఉపచార సమర్పణ చేస్తారు. ప్రధానహోమం, ప్రాయశ్చిత్తహోమం, అంత హోమాలను పూర్ణాహుతి నిర్వహించి, అగ్ని ఉపస్థానం చేయడంతో హోమకైంకర్యం సమాప్తి అవుతుంది. అనంతరం శ్రీవారి ఉత్సవ మూర్తులకు 12 రకాల ద్రవ్యాలతో మరియు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాదులతో విశేష స్నపనతిరు మంజనం జరుగుతుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమలయప్పస్వామివారిని, అతివిలువైన, ముగ్ధమనోహరమైన **వజ్రకవచం**తో అలంకరించి, నాలుగు తిరుమాడావీథులలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇలాగే మిగతా రెండురోజులు ఉదయం పూట అష్టోత్తర కలశస్నపనం మరియు 2వ రోజు సాయంత్రం **ముత్యపుకవచం**, 3వ రోజు సాయంత్రం **స్వర్ణకవచం**తో తిరువీథి ఉత్సవం జరుగుతుంది. మూడవ రోజు ఉదయం స్నపనం తర్వాత కవచప్రతిష్ఠ జరుగుతుంది.

**ప్రక్షాల్య పంచగవ్యేన జలేన పరిశోధయేత్।**
**కృత్వాపి వాస్తుశుద్ధిం చ యథోక్తా నిష్కృతిం చరేత్॥ (ప్రకీర్ణాధికారం)**

మూడవ రోజు ఉదయం అష్టోత్తర కలశస్నపనంలో భాగంగా హోమాదివైదికక్రియలు పూర్తైన పిదప, పంచగవ్యమునకు (గోక్షీరం, గోదధి, గోఘృతం, గోమూత్రం, గోమయం)అధిదేవతను ఆవాహన చేసి ఉపచారసమర్పణ గావించి, అనంతరం కవచము నకు వాస్తుహోమం చేస్తారు. పంచగవ్యంతో కవచములకు ప్రోక్షణచేసి, వాస్తుశుద్ధి జరిపి స్వర్ణకవచములను శ్రీవారి ఉత్సవ మూర్తులకు సమర్పించుటకు యోగ్యతను కలుగజేస్తారు (పవిత్రీ కరిస్తారు). పంచదశ సూక్తములతో అభిమర్శనక్రియను కవచములకు నిర్వహించి, తదుపరి **'విష్ణోర్నుకం....'** అను మంత్రంతో స్వర్ణ కవచములను, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, దృఢంగా, స్థిరంగా పూర్వం ఉన్నట్లుగానే సమర్పించబడుతుంది.

సంవత్సరం పూర్తిగా శ్రీవారి ఉత్సవమూర్తుల దివ్యతిరు మేను స్వర్ణకవచములతో శోభిల్లుతూ ఉంటుంది. కాని, జ్యేష్ఠాభిషేక ఉత్సవసమయంలో మాత్రమే స్వామివారి యొక్క నిజమైన అర్చా రూపదర్శనం భక్తులకు కలుగుతుంది. అలాగే సాధారణంగా అభిషేకద్రవ్యాలైన పాలు, పెరుగు మొదలైనవి స్వామివారి యొక్క పాదాలకు అభిషేకం చేస్తారు. ఎందుకంటే ఉత్సవమూర్తులు స్వర్ణకవచాలతో ఉంటారు కాబట్టి, అభిషేకం శిరసాదిగా చేయ బడదు. కానీ, ఈ జ్యేష్ఠాభిషేకసమయంలో మాత్రమే శ్రీమలయప్ప స్వామివారికి శిరసాది పాదపర్యంతం అన్ని ద్రవ్యాలతో అభిషేకం జరుపుతారు.

ఆయా మూర్తుల రూపమునకు తగినట్లు, చక్కగా సరిపోవునట్లుగా కవచములను సర్వప్రయత్నంతో సమకూర్చుకుని, బింబములను రక్షించుకోవలెనని, ఇదియే **'జ్యేష్ఠాభిషేకం'** అనే ఉత్సవం యొక్క పరమార్థంగా 'భృగువు' **ప్రకీర్ణాధికారం**లో చెప్పారు.







## వజ్రాలు పొదిగిన కవచ వృత్తాంతం, ఆధునిక కాలంలో ఒక అద్భుతం!

కలికాలంలో అందునా ఈనాటి వైజ్ఞానిక రోజుల్లో అద్భుతమైన ఆధ్యాత్మికమైన వృత్తాంతములు కనుమరుగవుతాయి. కాని నిజానికి వాటి తాలూకు ఆధ్యాత్మిక కదలికలు ఎవరికైతే దైవంపై అధిక విశ్వాసం ఉందో వారు తరచు అనుభవం చెందుతూ ఉండడం ఒక యాదృచ్ఛిక ఘటనగా అనుకోవాలి. అటువంటి సంఘటనే చరిత్రలో ఈ మధ్యలోనే పొందుపరచడం జరిగింది.



అదే కొల్లెగాల వీరన్న గాథ. ఇతను కర్ణాటకలోని మైసూరు దగ్గర నివసించే ఒక వ్యాపారవేత్త. ఇతడు పరమ విష్ణు భక్తుడు. ఇతనికి ఒకసారి శ్రీమన్నారాయణుడు కనిపించి నాకు వజ్రాలు పొదిగిన కవచాన్ని ఇవ్వమని ఆదేశించాడు.

ఆ వ్యాపారి అదేవిధంగా వజ్రాలు పొదిగిన కవచాన్ని తయారు చేసి మేల్‌కోట్‌లో ఉన్న శ్రీచెలువ నారాయణస్వామికి సమర్పించాడు. కాని, ఆ కవచం ఆ విగ్రహానికి సరిపోలేదు. అచట అర్చకులు వీరన్నను కవచాన్ని తీసుకొని, శ్రీరంగానికి వెళ్లమన్నారు. వీరన్న అదేవిధంగా కవచాన్ని శ్రీరంగంపెరుమాళ్ అయిన ఉత్సవమూర్తులకు అర్పించాడు. అయినను ఆ కవచం, స్వామివారికి సరిపోకపోతే, వారు వీరన్నను తమిళనాడులోని కంచి వరదరాజస్వామికి సమర్పించమని సలహా ఇచ్చారు. అచటి అర్చకులు వరదరాజస్వామికి అలంకరింపజేయడానికి ప్రయత్నించగా అది సరిపోలేదు. వీరన్న దుఃఖితుడై ఏమిటీ పరీక్ష! అని స్వామిని తలచాడు. అప్పుడు అచ్చటి అర్చకులు బాగా ఆలోచించి వీరన్నను ఆ కవచాన్ని వేంకటాచలమునకు తీసుకువెళ్లమని చెప్పి, కలియుగంలో ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరుడే అని తెలియచెప్పారు. వీరన్న తన యాత్రను దక్షిణాపథంలో జరిపి మలయప్పస్వామికి ఆ కవచాన్ని సమర్పణ చేశాడు. అద్భుతాలలో అద్భుతంగా ఆ కవచం సరిగ్గా సరిపోయింది. అది మలయప్పస్వామి కోసమే చెసినట్లుగా అనిపించింది. వీరన్న మరియు అర్చకులు తమ కళ్ళ ఎదుటే జరిగిన ఈ ఆశ్చర్య సంఘటన జరిగిన కథ దశదిశల వ్యాపించింది. ఇందుకు ఈ జరిగిన ఘటనకు సాక్ష్యంగా వజ్రఖచిత కవచపు పాదముల మీద కన్నడలిపిలో కొల్లేగాల వీరన్న శెట్టి సేవ అనే పదము అగుపిస్తుంది.

స్వామివారి యొక్క మహిమలు వర్ణనాతీతం. మరియు భక్తుడు స్వామి కృపలేనిది ఏమి చేయజాలడు. మనయొక్క జన్మ స్వామికృపే కదా! ఎవరైతే తిరుమలలో స్వామిదర్శనాన్ని కోరుకుంటారో అది కేవలం మన నెరవేరికే కాదు. అది స్వామివారి కృప మాత్రమే. స్వామి కనుక మనలను కటాక్షిస్తే మనం అందరం వారి అనుగ్రహానికి పాత్రులమవుతాము.

అలాగే మూడవ దినం స్వర్ణకవచసమర్పణకు ముందు, శ్రీవారి మూర్తులకు సుగంధ తైలమును సమర్పించి, నిజతిరుమేనుపై చందనం, ఆపై పల్చటి శ్వేతవస్త్రం ధరింపజేసి, కవచధారణ చేస్తారు. ఇటువంటి మహత్తరమైన జ్యేష్ఠాభిషేకమహోత్సవం, తిరుమలలో అంగరంగవైభవంగా, నేత్రపర్వంగా మూడురోజుల పాటు నిర్వహించిన కంకణభట్టర్ ఆచార్యులకు, చివరిరోజు సాయంత్రం 'అర్చక బహుమానం' అనే దేవస్థానమర్యాదలను చేయటంతో క్రతువు పూర్తి అవుతుంది.

ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ, శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యాశీస్సులతో, అన్ని కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయి. వారికి ఉన్న దీర్ఘకాల రుగ్మతలు, వ్యాధులు తొలగిపోతాయి. సమస్త మనోవాంఛలు సిద్ధిస్తాయి. దేహావసానమున, శాశ్వతమైన విష్ణుసాయుజ్యం లభిస్తుందని, క్రియాధికారంలో భృగుమహర్షి పేర్కొన్నాడు.

తిరుమలలో జ్యేష్ఠాభిషేకం ఈ సంవత్సరం 2025 జూన్ నెల 9, 10, 11 తేదీలలో నిర్వహిస్తారు.







ధారావాహిక




*(గత సంచిక తరువాయి భాగం...)*

పిమ్మట శ్రీకృష్ణుడై నిలిచి దర్శనభాగ్యము కల్పించి "ఓయి పెరుమాళ్లూ! ఓ అప్పన్ ప్రబంధగాయకా! ఓ తిరుప్పణి పిళ్ళై! అయ్యా! మేము మున్ను ద్వాపరయుగమున లోకరక్షణార్థముగా వసుదేవునకు కుమారుడవై పుట్టిన యవతారదినమగు జయంతివైభవమును మన రామానుజసంప్రదాయస్థులందరును పరిపాలనము చేయునట్లుగా మాకు అభిమతమగు శ్రీవైఖానస పరమఋషిప్రోక్తమై మేమాదరించునట్టి జయంత్యుత్సవమును ఈ సన్నిధియందు శ్రీరామానుజానుయాయులందరును పరిపాలన చేయుటలేదు. కావున మాకును వారికిని సంబంధమే లేకపోయినను, మన రామానుజులకు పూర్వమిచ్చిన యనుగ్రహాతిశయమున వారిని విడిచిపెట్టలేనందున ఈ సంవత్సరమారంభించి ప్రతి సంవత్సరము వచ్చెడి జయంత్యుత్సవమును మనతోడనే ఆచరించునట్లు మన రామానుజానుయాయులతోడ చెప్పి మాకు సంతోషము కలిగింపుడు" అని యానతిచ్చిరి.

అంతట వారు మేల్కొని తాము గాంచిన స్వప్నమును పరస్పరము చెప్పుకొని సంతుష్టులై యుండిరి. అప్పటిలో ఆ స్థలమున స్వామికి తిరుమల తిరునాళ్లు జరుగగా, ఆ తిరునాళ్లలో రథోత్సవము మున్నగు అన్నిటిని స్వీకరించి, శ్రీపుష్పయాగప్రతినిధిగా కలశాభిషేకమును స్వీకరించి, ఆరాధన స్వీకరించి, పుష్పయాగము స్వీకరించియుండగా, అర్చకులగు పెరియ పెరుమాళ్లు శ్రీశఠకోపమును శ్రీహస్తములందు ధరించి, శ్రీరామానుజసంబంధులగు జియ్యరులు, శ్రీవైష్ణవులు, ఆచార్య పురుషులు ఎల్లరును మంగళాశాసనము చేయుచుండగ ఆ పేరొలగమునందు రామానుజసంబంధులందరిని చూచి శ్రీవేంకటాచలపతి తమకు ప్రసాదించిన స్వప్నవృత్తాంతము నందరు వినునట్లుగ ఉచ్చైస్స్వరమున ఆనతిచ్చి శ్రీవేంకటేశ్వరుని శ్రీపాదసంబంధము, వారికి ప్రాణభూతులయిన భగవద్రామానుజుల సంబంధము కోరెడువారెల్లరును, శ్రీవైఖానసశాస్త్రసిద్ధమై శ్రీనివాసభగవానుడు స్వీకరించిన జయంత్యుత్సవమును మీరుకూడ అనుష్ఠింపుడని అందరి శిరస్సులపైనను శఠకోపమును పెట్టి యనుగ్రహించిన తరువాత, ఎల్లరును సంతోషముతోడ అంగీకరించి-

"గురూంశ్చ స్వప్నదృష్టాంశ్చ పూజాంతే చార్చకాననాత్,
గిరిపో హిత మాచష్టే మనుష్యాణాం కలౌ హరిః"

(గిరిప్రభువు శ్రీహరి ఈ కలికాలమున కలలో చూచిన గురువుల తోడను, పూజావసానమందు అర్చకముఖమునను మనుష్యులకు హితము చెప్పును.)

అనెడు ప్రమాణము చొప్పున మనకు (మనోవాక్కాయమూలమైన) త్రివిధానుగ్రహము నిర్హేతుకముగ కలిగినదని సంతోషించినవారై, భగవత్కటాక్షపాత్రులైన ఋషుల స్మృతీతిహాసపురాణముఖమున ప్రసాదించిన వాక్యములు మనకు ఉపాదేయములగునప్పుడు సర్వశేషియై, సమస్త చేతనోజ్జీవనాభిలాషియైన భగవంతుడు తానే అర్చకరూపుడై, అర్చకముఖమున అనుగ్రహించిన హితవచనములు విశేషించి ఆదరణీయములు, ఆచరణీయములు, అనువర్తనీయములు-అని సెలవిచ్చి, ఆ సంవత్సరము మొదలుకొని ప్రతివత్సరము భగవంతునకు అభిమతమైన శ్రీజయంతిని అనుష్ఠించుచున్నారు. *(ఇంకా ఉంది)*



# జగన్నాథ రథయాత్ర

జూన్ 27న
పురీ జగన్నాథ
రథయాత్ర
సందర్భంగా...

– డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు,
94919 46070

అర్జునుడికి రథసారథిగా ముక్తిసాధనమైన గీతామృతాన్ని ఉపదేశించి, కర్తవ్యోన్ముఖుణ్ణి చేసిన జగద్గురువు శ్రీ శ్రీకృష్ణభగవానుడు– 'శ్రీజగన్నాథస్వామి' పేరుతో కొలువుదీరి సంవత్సరానికి ఒకసారి రథం అధిరోహించి ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తూ ఉన్న క్షేత్రం–పురీ. ఈ క్షేత్రంలో జరిగే రథోత్సవం ఎన్నో ప్రత్యేకతలను స్వంతం చేసుకుని విరాజిల్లుతూ ఉంది.

పురీక్షేత్రంలో ప్రతి సంవత్సరం ఆషాఢమాసం శుక్ల పక్ష విదియనాడు రథోత్సవం జరుగుతుంది. ఈ రథోత్సవానికి 'మహావేది మహోత్సవం' అని పేరు. సాధారణంగా దాదాపు అన్ని క్షేత్రాలలో బ్రహ్మోత్సవాలలో రథోత్సవంలో ఒకే రథం ఉంటుంది. అందులో ఉత్సవమూర్తులు రథం అధిరోహించి ఊరేగుతారు. అయితే అందుకు భిన్నంగా పురీలో మూలమూర్తులైన ముగ్గురు దేవతామూర్తులు వేరువేరు రథాలలో అంటే మూడు రథాలలో ఊరేగుతారు.

## ప్రతి సంవత్సరం నూతన రథాలు

రథోత్సవం కోసం ప్రతి సంవత్సరం నూతన రథాలను ఉపయోగిస్తారు. రథాల తయారీ కోసం గుర్తించిన వృక్షాలకు ముందుగా పూజలు చేసి, చెట్లను నరికి 1,072 చెట్ల కాండలను పురీకి చేరుస్తారు. రథోత్సవానికి రెండునెలల ముందు అక్షయతృతీయనాడు రథాలను తయారుచేసే పనిని ప్రారంభిస్తారు. తయారీలో 120 మంది పాల్గొంటారు. సంప్రదాయ పనిముట్లతోనే రథాలను తయారుచేస్తారు. రథాల తయారీలో ఎటువంటి యంత్రాలను ఉపయోగించరు. 1072దుంగలను 2188ముక్కలుగా చేస్తారు. అందులో 832చెక్కముక్కలను ఉపయోగించి 16చక్రాలతో 45అడుగుల ఎత్తున్న 'జగన్నాథ స్వామి' రథాన్ని చేస్తారు. ఈ రథానికి 'ఘోష', 'గరుడధ్వజ' అని పేర్లు. 763చెక్కముక్కలతో 14చక్రాలు ఉన్న 44 అడుగుల ఎత్తున్న 'తాళధ్వజ' అనే బలభద్రుడి రథాన్ని చేస్తారు. 593చెక్క ముక్కలతో 12చక్రాలతో 43అడుగుల ఎత్తున్న సుభద్ర రథాన్ని తయారుచేస్తారు. ఈ రథానికి 'దర్పదళన', 'పద్మధ్వజ' అని పేర్లు. ఈ రథాలను లాగేందుకు 250 అడుగుల పొడవైన తాళ్ళను కడతారు.

## స్వామివారలకు 15 రోజుల అనారోగ్యం....

రథోత్సవానికి 15 రోజుల ముందు జ్యేష్ఠమాసంలో శుక్లపక్ష పూర్ణిమరోజు దేవతామూర్తులకు 108బిందెల నీటితో స్నానం చేయిస్తారు. అందువల్ల స్వామివారు అనారోగ్యం పాలవుతారు. అందువల్ల 15రోజులపాటు ఆలయంలో దర్శనాలను నిలిపివేస్తారు. ప్రతిరోజూ 56 రకాల నైవేద్యాలను సమర్పించే స్వామివారికి ఈ రోజులలో పథ్యం. కనుక

కందమూలాలు, పండ్లను మాత్రమే నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాత ఆషాఢశుక్లపక్షపాడ్యమినాడు స్వామివారికి నేత్రోత్సవం జరిపి దర్శనాలకు అనుమతిస్తారు.

## పహండీ ఉత్సవం

రథోత్సవం నాడు అంటే ఆషాఢశుక్లపక్ష విదియనాడు రథాలను ఆలయసింహద్వారానికి ఎదురుగా తీసుకువస్తారు. అర్చకులు ఉదయకాల పూజల అనంతరం 'మనిమా' అంటే 'జగన్నాథా' అంటూ నినాదాలు చేస్తూ గర్భాలయం నుంచి దేవతామూర్తులను తీసుకునివచ్చి రథాలలోని రత్నపీఠంపై కొలువుదీరుస్తారు. ఈ ఉత్సవాన్ని 'పహండీ' అని పిలుస్తారు. ఈవిధంగా దేవతామూర్తులు కొలువుదీరిన తర్వాత పురీరాజు పల్లకీలో రథాలవద్దకు చేరుకొని బంగారుచీపురుతో రథాల లోపలి భాగాలను ఊడుస్తారు. అనంతరం రథయాత్ర ప్రారంభ మవుతుంది.

## 'గుండీచా' మందిరానికి ఘోషరథయాత్ర

రథయాత్రలో మూడురథాలు ఒకే వరుసలో పక్కపక్కనే ఉన్నట్లు ఉన్నా ముందుగా బలభద్రుడిరథం, దానికి కొంత వెనుక సుభద్రరథం, దానికి కొంత వెనుక జగన్నాథుడిరథం ముందుకు కదులుతాయి. 'బడోదండో' అని పిలువబడే ప్రధాన రహదారిలో రథయాత్ర సాగుతుంది.

మూడుకిలోమీటర్ల దూరం ప్రయాణించి 'గుండీచా' మందిరానికి రథయాత్ర చేరుతుంది. ఈ యాత్ర సుమారు 12గంటలు సాగుతుంది. ఈ యాత్రకు 'ఘోషరథయాత్ర' అని పేరు. గుండీచా అమ్మవారు జగన్నాథుడి పెంపుడుతల్లి అని చెబుతారు.

అక్కడ తొమ్మిదిరోజులు గడిపి, తిరిగి తొమ్మిదవ రోజు రథయాత్ర తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది.

## బహుదాయాత్ర

తొమ్మిదవరోజు తిరుగు ప్రయాణం. ఈ రథయాత్రకు 'బహుదాయాత్ర' అని పేరు. మార్గమధ్యంలో 'మౌసీమ' ఆలయంవద్ద స్వామివారు ఆగి 'అర్ధాసనీదేవి' సమర్పించే నివేదన స్వీకరించి మధ్యాహ్నానికి ఆలయం చేరుకోవడంతో రథయాత్ర ముగుస్తుంది. అర్ధాసనీదేవి స్వామివారి పినతల్లి అని చెబుతారు.



## ఎన్నో విశేషాల ఆలయం

**వాడుకలో పూరిక్షేత్రంగా పిలిచే పురీక్షేత్రంలోని ఆలయం ఎన్నో విశేషాలను స్వంతం చేసుకున్నది.**

- సాధారణంగా ఏ ఆలయంలోనైనా, ఏ దేవుడైనా, ఒక్కరుగానో లేదంటే తన దేవేరితోనో కొలువుదీరి దర్శనమిస్తారు. అయితే అందుకు భిన్నంగా పురీక్షేత్రం జగన్నాటక సూత్రధారి అయిన శ్రీకృష్ణుడు శ్రీజగన్నాథస్వామి పేరుతో సోదరుడు బలరాముడు, సోదరి సుభద్రలతో కొలువుదీరిన దివ్యక్షేత్రం.
- ఆదిశంకరాచార్యులు స్థాపించిన నాలుగు పీఠాలలో ఒకటైన పూర్వామ్నాయగోవర్ధనపీఠం ఉన్న పుణ్యస్థలం.
- ఆదిశంకరాచార్యులు ప్రతిపాదించిన నాలుగు ధామాలలో ఒకటైన పుణ్య ధామం.
- ఆలయంలో ప్రవేశించేందుకు నాలుగువైపులా ద్వారాలు ఉన్నాయి. ప్రధాన తూర్పుద్వారానికి 'సింహద్వారం' అని పేరు. పడమర, ఉత్తరం, దక్షిణం వైపు ద్వారాలకు వ్యాఘ్రద్వారం, హాథీద్వారం, అశ్వద్వారం అని పేర్లు.
- ప్రధానద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి, ప్రధాన ఆలయంలోకి ప్రవేశించే ముందు 24 మెట్లతో ఉన్న సోపానమార్గం ఉంది. ఈ సోపానమార్గానికి 'బాయిసిపవచ' అని పేరు.

### నారదమహర్షి కోరిక - సృష్టికర్త ప్రతిష్ఠ

పూర్వం ఒకసారి శ్రీకృష్ణుడి దేవేరులు రుక్మిణి సత్యభామ మొదలైనవారు రాధారాణి వద్దకు వచ్చి బృందావనంలో బాలకృష్ణుడి లీలలను వివరించమని కోరారు. రాధారాణి వారికి వివరిస్తూ ఉన్న సమయంలో అటుగా వెళ్తున్న శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్రలు తలుపువద్ద నిలబడి వినసాగారు. ఈ సమయంలో అక్కడకు చేరిన నారదమహర్షి మీరు అలాగే ఉండండి అని కోరాడు. నారదుడి కోరికమేరకు వారు ఈ క్షేత్రంలో కొలువుదీరినట్లు చెబుతారు. అంతేకాకుండా ఇక్కడ దేవతామూర్తులను సృష్టికర్త బ్రహ్మదేవుడు ప్రతిష్ఠించినట్లు పురాణాలు వెల్లడిస్తూ ఉన్నాయి.

### దారుమూర్తులు

పూర్వం ఈ ప్రాంతానికి 'ఉత్కళ'రాజ్యం అని పేరు. ఈ రాజ్యపాలకుడు ఇంద్రద్యుమ్నుడు. దైవభక్తిపరాయణుడు అయిన ఇంద్రద్యుమ్నుడికి ఒక కోరిక ఉండేది. ఒక ఆలయాన్ని నిర్మించి అందులో గంధపు చెక్కతో తయారుచేసిన విగ్రహాలను ప్రతిష్ఠించాలనేది కోరిక. ఆలయాన్ని నిర్మింపచేసి అందులో ప్రతిష్ఠించేందుకు దేవతామూర్తులను తయారుచేసే శిల్పులను అన్వేషిస్తూ ఉండేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకనాటి రాత్రి ఇంద్రద్యుమ్నుడికి శ్రీజగన్నాథస్వామి స్వప్నంలో సాక్షాత్కరించి...

“సముద్రతీరంలో ఒక పెద్దకొయ్య ఉంది. ఆ కొయ్యను తీసుకుని వచ్చి.. దానితో నాతోపాటు నా సోదరీ సోదరుల విగ్రహాలను చేయించి, వాటికి ఆలయం నిర్మించి ప్రతిష్ఠించు” అని పలికాడు.

మరుసటి రోజే సేవకులతో కలిసి సముద్రతీరానికి చేరుకుని వెతికారు. స్వామివారు కలలోచెప్పినట్లు కొయ్య కనిపించింది. దానిని తీసుకువచ్చి, దానితో విగ్రహాలు తయారు చేయించాలని శిల్పులకోసం అనేక ప్రాంతాలలో అన్వేషింప జేశాడు. అయితే సరైన శిల్పులు లభించక నిరాశతో ఉండేవాడు. ఇలాంటి స్థితిలో ఒకనాడు ఆ రాజుకు శ్రీమహావిష్ణువు స్వప్నంలో దర్శనమిచ్చి– “నీ కొలువుకు ఇద్దరు శిల్పులు వస్తారు. వారిని నియమించు. వారు విగ్రహాలను తయారుచేస్తారు” అని పలికాడు.

- ❖ గర్భాలయంలో శ్రీజగన్నాథుడు, శ్రీబలభద్రుడు, శ్రీసుభద్రలు విచిత్రమైన రూపురేఖా విన్యాసాలతో దర్శనమిస్తారు. ఒక స్తంభానికి తల అతికించినట్లుగా వీరి విగ్రహాలు ఉంటాయి.
- ❖ శ్రీజగన్నాథుడి ముఖం నల్లగా ఉంటుంది. పెద్ద పెద్ద కళ్ళు, ఆ చివరనుంచి ఈ చివర వరకూ విస్తరించిన నోరుతో స్వామి వారు దర్శనమిస్తారు. శ్రీబలభద్రుడు, శ్రీసుభద్రల ముఖాలు కూడా దాదాపు ఇలానే ఉన్నా కొంత చిన్నవిగా కనిపిస్తాయి. తెలుపు, పసుపురంగుల్లో ఉంటాయి. జగన్నాథస్వామి, బలభద్ర స్వామిలకు స్తంభాలమాదిరి చేతులు ఉంటాయి. కానీ, సుభద్రకు చేతులు ఉండవు. ఇద్దరికీ మధ్యలో సుభద్ర కొలువుదీరి ఉంటుంది.
- ❖ గర్భాలయం పై ఉన్న గోపురం 'శంఖాకారం'లో ఉంటుంది.
- ❖ గోపురంపై సుదర్శనచక్రం ప్రతిష్ఠింపబడింది. ఈ సుదర్శన చక్రం ఆలయానికి కొద్దిదూరం నుంచి ఎటువైపునుంచి చూసినా మనవైపే చూస్తున్నట్లు కనిపిస్తుంది.
- ❖ గోపురంపై ప్రతిరోజు సాయంత్రం నూతన పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ పతాకం గాలి వ్యతిరేకదిశలో ఎగురుతూ ఉండడం విశేషం.
- ❖ పురీ ఆలయంపై పక్షులు ఎగరవు.
- ❖ విశాలమైన ఆలయప్రాంగణంలో 120 ఆలయాలు ఉన్నాయి.
- ❖ పురీక్షేత్రంలో జగన్నాథ స్వామివారికి రోజూ 56 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిని ఆలయంలో ఉన్న వంటశాలలో సంప్రదాయంగా వండుతారు. కట్టెల పొయ్యిపైన ఒకదానిపై ఒకటిగా ఏడుకుండలను ఉంచి వండుతారు. ముందుగా అన్నింటికంటే పై కుండలోని పదార్థం తయారు కావడం విశేషం.
- ❖ స్వామివారికి సమర్పించిన నైవేద్యాన్ని ఆలయప్రాంగణంలో ఉన్న ఆనందబజారులో భక్తులకు అందజేస్తారు. వివిధ రకాలకూరలు, అన్నం, పాయసం వంటివిగా ఈ ప్రసాదాలు ఉండడం విశేషం.

ఎన్నో విశేషాలను, ప్రత్యేకతలకు నిలయమైన పురీ జగన్నాథ రథోత్సవం సందర్భంగా పురీక్షేత్రాన్ని, స్వామివారిని స్మరించడం దర్శించడం అత్యంత పుణ్యప్రదం.



మరునాడు ఇంద్రద్యుమ్నుడు రాజదర్బారులో కొలువుదీరి ఉండగా పనిముట్లు చేతపట్టుకుని ఇద్దరు శిల్పులు వచ్చి కొయ్యతో విగ్రహాలను తయారుచేస్తామని పలికారు. రాజు కొయ్యను చూపించి- శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలను తయారు చేయమని కోరాడు.

అందుకు "మహారాజా! మేము శిల్పాలను ఇరవై ఒక్క రోజుల్లో పూర్తిచేస్తాము. ఆలయంలోపల ఉండి తలుపులు మూసుకుని విగ్రహాలను తయారుచేస్తాము. మేము పని చేసుకుని బయటకు వచ్చేవరకూ మా పనికి అంతరాయం కలిగించవద్దు"అని శిల్పులు షరతు విధించారు.

అందుకు రాజు అంగీకరించడంతో శిల్పులు ఆలయంలోకి వెళ్ళి తలుపులు మూసుకుని పనిని ప్రారంభించారు. అలా పదిహేనురోజులు గడిచిపోయాయి. పదిహేనవనాడు ఆలయంవద్దకు వచ్చిన రాణికి ఎటువంటి శబ్దాలు లోపలి నుంచి వినిపించకపోవడంతో సందేహం కలిగింది. ఈ విషయాన్నే రాణి రాజుకు తెలుపగా, రాజు కూడా ఆలయం వద్దకు వచ్చి పరిశీలించాడు. ఎటువంటి శబ్దమూ వినపడకపోవడంతో అనుమానం అధికమైన రాజు ఆలయం తలుపులు తెరిపించాడు. రాజు ఆలయంలోకి ప్రవేశించగానే పనిచేస్తూ ఉన్న శిల్పులు హఠాత్తుగా అదృశ్యమయ్యారు. ప్రక్కనే అసంపూర్ణంగా చెక్కబడిఉన్న విగ్రహాలు కనిపించాయి. విగహాలు పూర్తికానందులకు చింతిస్తూనే రాజు చేసేదేమీ లేక తాను నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను జరిపించడం ప్రారంభించాడు. ఆ విగ్రహాలే శ్రీజగన్నాథుడు, బలభద్రుడు మరియు సుభద్రలవి. ఈ విధంగా శ్రీజగన్నాథస్వామి పురీక్షేత్రంలో వెలసినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తోంది.

## అధికఆషాఢంలో...
## నూతన మూలమూర్తుల ప్రతిష్ఠ

సాధారణంగా ఆలయంలో ఒకసారి దేవతామూర్తులను ప్రతిష్ఠిస్తే ఇక కదిలించరు. ఒకవేళ మూర్తులలో ఏవైనా లోపాలు తలెత్తితే తప్పు మార్చరు. అయితే, పురీక్షేత్రంలో సాధారణంగా పన్నెండునుంచి పందొమ్మిది సంవత్సరాలకు ఒకసారి అధికఆషాఢమాసం వచ్చిన సమయంలో పాతవిగ్రహాల స్థానంలో నూతనమూర్తులను ప్రతిష్ఠిస్తారు. అధిక ఆషాఢమాసం వచ్చిన సంవత్సరం పురీలోని వృద్ధపండితుడు కాకట్‌పూర్ అనే గ్రామానికి చేరుకుంటాడు. ఆ గ్రామంలో రాత్రి నిద్రిస్తున్న సమయంలో స్వప్నంలో ఆ గ్రామదేవత స్వామివారి మూర్తుల తయారీకి పనికివచ్చే వృక్షాలు ఎక్కడ లభిస్తాయో చెబుతుంది. ఆ చెట్లు **వేపచెట్లు**. వివిధ స్థలాల్లో ఉండే ఆ వృక్షాలపై సహజసిద్ధంగా ఏర్పడిన **శంఖు, చక్ర, పద్మం** గుర్తులు ఉండడం విశేషం. ఆ వృక్షాల దగ్గరకు చేరుకొని ముందుగా పూజలు చేసి, వాటిని కొట్టి, ఆ చెట్లకొయ్యలను బండ్లపై ఉంచి, ఆ బండ్లను మనుషులే లాగుతూ పురీకి తీసుకువస్తారు. ఆలయం వెనుక వైపున ఉన్న తోటలో వాటిని ఉంచి, విగ్రహాలను తయారుచేసి రంగులను అద్దుతారు.

తర్వాత పాతమూర్తులలోని జీవశక్తిని నూతనమూర్తులలో నింపి ప్రతిష్ఠిస్తారు. పాతవిగ్రహాలను తోటలోని ఒక నిర్దేశిత ప్రాంతంలో సింహాసనం పై ఉంచి, పూడ్చిపెడతారు. మళ్ళీ అధికఆషాఢమాసం సమయంలో త్రవ్వే సమయంలో భూమిలో సింహాసనం ఉంటుంది కానీ పాతవిగ్రహాలు కనిపించవు. ఇది ఈ క్షేత్రంలో మాత్రమే జరిగే గొప్పఅద్భుతం.

*॥ జై జగన్నాథ ॥*

జూన్ 09న
నమ్మాళ్వారు
శాత్తుమొఱ
సందర్భంగా...



# తేజోమూర్తి 'నమ్మాళ్వారు'

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు

**ఆదౌ కలేర్ద్వి కురుకాపురి పాండ్యదేశే**
**వైశాఖమాసి మఘువానలఖేఽంశజాతమ్।**
**సేనాపతేః పదజకారిగృహేఽవతీర్ణం**
**శ్రీశాస్పదం శఠరిపుం శరణం ప్రపద్యే॥**

**భావం-** పాండ్యదేశాన ఉన్న కురుకాపట్టణంలో కలియుగారంభాన వైశాఖ విశాఖానక్షత్రాన, విష్వక్సేనుల అంశతో కారి గృహంలో జన్మించినవాడు అయిన భగవంతునికి అభీష్ట స్థానమైన శఠకోపసూరిని శరణుజొచ్చెద.

శ్రీహరి సర్వసైన్యాధ్యక్షులయిన విష్వక్సేనాంశాన నమ్మాళ్వారు అవతరించారు. పాండ్య మండలంలో తామ్రపర్ణీ నదీతీరాన ఉన్న ఆళ్వార్ తిరునగరి/ కురుకాపురి/ తిరుక్కురుగూర్/ కురంగనగరం/ శ్రీపురి వీరి జన్మస్థలం. అక్కడ వెలసిన ఆదినాథప్పెరుమాళ్ కృపతో శఠకోపయోగి (నమ్మాళ్వారు) జన్మించారు. వీరిది వ్యాఖ్యానముద్ర. ప్రమాధి నామసంవత్సర వైశాఖమాస శుక్లపక్షచతుర్దశి విశాఖానక్షత్రం కటకలగ్నం శుక్రవారంనాడు శఠకోపులవారు జన్మించారు. వీరు రచించిన దివ్యప్రబంధాలు - **1)తిరువిరుత్తం** (100 పాశురాలు), **2)పెరియతిరువన్దాది** (7 పాశురాలు), **3)తిరువాయిమొళి** (1102 పాశురాలు).

నమ్మాళ్వారు తండ్రి **'కారి'**. ఇతని తల్లి **'నాథనాయిక'**.

నమ్మాళ్వారుకు అష్టోత్తరశతనామావళి ఉంది. వాటిలో బాగా ప్రచారంలో ఉన్న నామాలు **కారిమారులు, కారిసూనులు, మారన్, శఠకోపులు, పరాంకుశులు, కురుకేశ, కురుకాధిప, కురుక్కైపిరాన్, తిరుక్కురుగూరనంబి, ఆరుళ్మారన్, వకుళాభరణులు.**

నమ్మాళ్వారు జన్మించడానికి ముందే ముందుచూపుతో వీరిని రక్షించడానికి ఆదిశేషులవారు తిరునగరిలో చింతచెట్టు రూపంలో ఉండడం విశేషం.

కారి-నాథనాయికలకు నమ్మాళ్వారు శిశువుగ పుట్టినపుడు ఏడవలేదు, కన్నులు తెరువలేదు, చనుబాలు తాగలేదు, కేవలం పడుకొని ఉండినాడు. అయినా కూడ పరాంకుశులవారి ముఖం వాడిపోలేదు, చిక్కిపోలేదు. మీదు మిక్కిలి విష్ణువిన్యస్తభరుడై శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధిని పొందుతూ ఉన్నాడు. ఇలా పద్దెనిమిది రోజులు గడిచాయి. తల్లిదండ్రులు నమ్మాళ్వారును ఆదినాథపెరుమాళ్ ఆజ్ఞతో అక్కడ ఉండే చింతచెట్టు మూలప్రదేశాన తొట్టి (ఊయల) ఏర్పాటుచేసి అందులో శిశువును పడుకోబెట్టి పుత్రప్రేమను వదులుకొని వెళ్లిపోయారు. ఇలా ఏడాదికాలం జరిగింది. అప్పుడు కారి, నాథనాయికలు నమ్మాళ్వారును చూడడానికి అక్కడకు రాగా, వారి రాకను గమనించిన ఆ శిశువు ఊయల నుండి దిగి ఆడుకుంటూ అక్కడి చింతచెట్టు తొర్రలోనికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత పదునాలుగు సంవత్సరాలు గడిచిపోయింది.

**మధురకవి** పన్నిద్దరు ఆళ్వారులలో ఒకరు. వీరు నమ్మాళ్వారు సమకాలీనులు. మధురకవివారు ఉత్తర భారత దేశంలోని దివ్యతిరుపతుల యాత్రలను చేస్తూ, బదరీ క్షేత్రాన్ని సేవించుకొని, అయోధ్యకు చేరుకుంటారు. వారు అయోధ్యలో ఉన్నపుడు ఒక రాత్రివారికి దక్షిణదిశలో సూర్య

మండలం కనిపిస్తుంది. వరుసగా నాలుగు రాత్రులు అలాగే కనిపిస్తుంది. ఆ విచిత్ర విశేషాలను తెలుసుకుంటారు మధుర కవులు. ఆ కాంతి నమ్మాళ్వారులదిగా అక్కడివారు చెప్పారు. వెంటనే మధురకవి దక్షిణదేశానికి తన ప్రయాణాన్ని సాగిస్తాడు. అలా ప్రయాణం సాగిస్తూ మధురకవి శ్రీరంగం చేరుకుని, అక్కడినుంచి శ్రీపురి (కురుకానగరికి) చేరుకుంటాడు. స్థానికులను కలుసుకొని అక్కడివిశేషాలు తెలుసుకుంటాడు. నమ్మాళ్వారును గురించి తెలుస్తుంది. వారిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో **'తింత్రిణీ వృక్షం'** (చింతచెట్టు) దగ్గరకు వెళ్తాడు. ఆ చెట్టుతొర్రలో పద్మాసనస్థుడై, వ్యాఖ్యానముద్రలో ఉన్న వకుళ భూషణసూరిని (నమ్మాళ్వారును) దర్శిస్తాడు.

నమ్మాళ్వారును మేల్కొల్పడానికి మధురకవులు కరతాళ ధ్వని చేస్తారు. మధురకవిని కటాక్షించాలని నమ్మాళ్వారు కనులు తెరుస్తాడు. మధురకవి మహానందభరితుడవుతాడు. తనను కనికరించవలసిందని మధురకవి నమ్మాళ్వారులకు సాష్టాంగ దండప్రణామాలు చేస్తాడు. మధురకవికి కలిగిన సంశయాలను నమ్మాళ్వారులు తీరుస్తాడు.

భగవన్నామంకంటే తన గురువైన నమ్మాళ్వారు నామమే గొప్పదనే భావంతో 'కణ్ణినున్ శిరుత్తాంబు' అనే స్వీయ రచిత దివ్యప్రబంధాన్ని గానంచేస్తాడు. నమ్మాళ్వారు మధురకవికి పంచసంస్కారాలను చేసి తత్త్వోపదేశం కూడా చేస్తాడు.

శ్రీమన్నారాయణుడు లక్ష్మీసమేతంగా గరుడారూఢుడై నమ్మాళ్వారువారికి సాక్షాత్కరిస్తాడు. పరాంకుశ మునులు (నమ్మాళ్వారు) భగవద్గుణాను భావజనితమైన వాక్ప్రవాహంతో నాలుగు దివ్యప్రబంధాలను ఆనతిస్తారు. వాటిలో **"తిరువిరుత్తం"** ఋగ్వేద సార భూతమైంది, **"శిరువాశిరియం"** యజుర్వేద సారం, **"పెరియతిరువన్దాది"** అథర్వణవేద సారం, ఇక ద్రావిడవేదం అనబడే **"తిరువాయిమొళి"** చరమప్రబంధం సామవేద సారమైనది. నమ్మాళ్వారు వీటిని మధురకవికి అర్థానుభవపూర్వకంగా ఉపదేశిస్తాడు.



తిరునగరిలో పుష్పమంటపం, త్యాగమంటపం, భోగ మంటపాలలోగల భగవన్మూర్తులు, సకలదివ్యదేశాలలోని అర్చామూర్తులు పరాంకుశుల కవితాసంపదకు ఆకర్షితులై మంగళాశాసనం చేస్తారు. వారందరూ శఠకోపసూరికి **'నమ్మాళ్వారు'** అనే సార్థకనామాన్ని అనుగ్రహిస్తారు. 'నమ్–ఆళ్వారు' అంటే మా– ఆళ్వారు' అని అర్థం. నమ్మాళ్వారు ప్రపన్నజనకూటస్థులై పరమభక్తిభావ సంపన్నులవుతారు. వీరు తన ముప్పదిఅయిదవ ఏట అర్చారూపం ధరిస్తానని తన ప్రియశిష్యులయిన మధుర కవులకు తెలుపుతారు. మధురకవులు చాలా సంతోషించి తింత్రిణీవృక్షసమీపాన అర్చారూపంగా వకుళాభరణులవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు.

ఆళ్వారులందరూ **'శరీరం'** కాగా నమ్మాళ్వారు **'శరీరి'**. ఆళ్వార్ల దివ్యప్రబంధాలన్నీ **'అవయవాలు'** కాగా వీరి **"తిరువాయిమొళి" 'అవయవి'**. తిరువాయిమొళిని అనుసంధించిన వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుంది.

నమ్మాళ్వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు –

1)తిరుమాలిరుంజోలై మలై, 2)తిరువేంగడం, 3)తిరుక్కురుగూర్, 4)తిరుక్కురుంగుడి, 5)శ్రీవరమంగై, 6)తిరుక్కుడందై, 7)తిరువల్లవాళ్, 8)తిరువణ్వణ్ణూర్, 9)తిరువిణ్ణగర్, 10)తొలైవిల్లి మంగలం, 11)తిరుక్కోవళూర్, 12)తిరువరంగం, 13)తెన్ తిరుప్పేరై, 14)తిరువారన్ విళై, 15)తిరుచ్చెంగునూర్, 16)తిరుక్కడిత్తానం, 17)తిరుప్పులియూర్, 18)తిరుప్పుళింగుడి, 19)తిరుక్కాట్కరై, 20)తిరుమూళిక్కళం, 21)తిరునావాయ్, 22)తిరుక్కణ్ణపురం, 23)తిరుమోగూర్, 24)తిరువనంతపురం, 25)తిరువాట్టారు, 26)తిరుప్పేరనగర్, 27)శ్రీవైకుంఠం, 28) వరగుణ మంగై, 29)తిరువణ్పరిశారం, 30)తిరుక్కుడందై, 31)తిరుపాడగం, 32)తిరుఊరగం, 33)తిరువెక్కా/యథోక్తకారిసన్నిధి, 34)తిరువయోధ్యై, 35)ద్వారకై, 36)వడమధురై, 37)తిరుప్పార్కడల్, 38)పరమపదం.

*నమ్మాళ్వార్ దివ్యతిరువడిగళే శరణం*

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।**
**సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే॥**

# 'శ్రీరామ' నామ జప ప్రభావము

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి,
94401 74797

శివుడు ఎప్పుడూ జపం చేస్తూనే ఉండేవాడు. పార్వతీ దేవికి అర్థం కాలేదు. "ఎప్పుడూ ఏదో మంత్రాన్ని ఉచ్చరిస్తూనే ఉంటారు. ఎంతో ఆహ్లాదంగానూ, ఉల్లాసంగానూ ఉంటారు. అదేమిటో తెలుసుకొని అటువంటి మంత్రాన్ని నాకు కూడా ఒకటి ఉపదేశించమని అడగాలి!" అని మనస్సులో నిర్ణయించుకుంది.

ఒక రోజు పరమేశ్వరుడిని సమీపించి "పరమేశ్వరా! కోరికల్ని తీర్చేది, పాపాల్ని నశింపచేసేది, తరగని జ్ఞానానందాన్ని పంచేది, పరమాత్మ దర్శనం చేయించ గలిగే ఒక గొప్ప మంత్రాన్ని నాకు ఉపదేశిస్తారా?" అని భక్తితో అడిగింది.

ఆమె అడిగినది విని సంతోషంతో పరమేశ్వరుడు "పార్వతీ! నువ్వు సర్వజగత్తుకు తల్లివి. ఏదయినా కావాలి అని అడిగావంటే అది లోకంలో అందరికీ ఉపయోగించాలనే అడుగుతావని నేను అర్థం చేసుకోగలను.




లోకంలో ఉన్న నీ బిడ్డలందరి కోసమే కదా నువ్వు పడే తాపత్రయం. కనుక, వాళ్ల కష్టాలు తీరేలా అందరూ తేలికగా చేసుకోగలిగే ఒక మహామంత్రాన్ని నీకు ఉపదేశిస్తాను!" అని చెప్పి, తను జపిస్తున్న మంత్రం గురించి పార్వతీదేవికి వివరించాడు.

"దేవీ! నేను 'శ్రీరామ రామ రామ' అనే మంత్రాన్ని జపిస్తూ... దాంట్లో ఉన్న ఆనందాన్ని అనుభవిస్తుంటాను. విష్ణు సహస్రనామం ఒక్కసారి జపిస్తే కలిగే ఫలితం ఎంత ఉంటుందో, 'రామ' అనే పేరు ఒక్కసారి జపిస్తే కలిగే ఫలితం కూడా అంతే ఉంటుంది. నువ్వు కూడా పవిత్రమైన రామనామ జపం మానకుండా పారాయణ చేసుకో!" అన్నాడు పరమేశ్వరుడు.

పరమేశ్వరుడు చెప్తుంటే వింటోంది పార్వతీదేవి. శివుడు పార్వతివైపు చూస్తూ మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు. "దేవీ! పవిత్రమైన 'శ్రీరామ' నామ మంత్రాన్ని జపం చెయ్యడం వల్ల ప్రపంచానికి మూలమైన పరమాత్మ గురించి తెలుస్తుంది.

ధర్మార్థకామమోక్షాలకే, చతుర్విధ పురుషార్థాల్ని కలుగచేసి, పాపాల్ని నాశనంచేసే అతి పవిత్రమైన, గొప్పదైన మరొక మంత్రం పద్నాలుగు లోకాలు వెతికినా కనిపించదు!"

రోగాలతో శరీరం స్వాధీనంలో లేనప్పుడు, ముసలి తనం ఆవహించినప్పుడు 'శ్రీరామ రామ రామ' అంటూ రామ నామాన్ని జపిస్తే సింహాన్ని చూసిన లేళ్లు పారిపోయినట్టు... శరీరాన్ని ఆవహించిన రోగాలు, ముసలితనం కూడా పారి పోతాయి.

దేవీ! 'రామ' అనే పదం పలకడం చాలా తేలిక. కనుక, చదువు లేని వాళ్లు కూడా ఈ మంత్రాన్ని జపించగలరు. ఈ మంత్రాన్ని జపించడం వల్ల చాలా ఉపయోగం ఉంది.

శరీరంలో గొప్పశక్తి ఉత్పన్నమవుతుంది. మనస్సుకి అమితమైన ఆనందం కలుగుతుంది. దుఃఖం, భయం, నరకం వంటి బాధల్లోంచి విముక్తి కలుగు తుంది. తేలికగా పలకడానికి అనువైనది. పవిత్రమైనది రామనామజపం.



ఇన్ని విధాలుగా కాపాడే ఈ రామనామ జపం చేసుకుంటే సామాన్య మానవుడు కూడా చక్కటి ఫలితాన్ని పొందుతాడు.

రామనామం కోరికల్ని ఎలా తీరుస్తుందో చెప్తాను విను. కామధేనువు, కల్పవృక్షం, చింతామణి కూడా ఈ నామ జపం ముందు తక్కువే! ఈ చరాచర జగత్తులో కోరిన కోరికలు తీర్చేది, సకల సంపదలు ఇచ్చేది, పాపాలు పోగొట్టేది రామ నామమే!

శ్రీరామనామ జపం జరిగే ప్రదేశాల్లో నీళ్ల కొరత ఉండదు. పవిత్రమైన పుణ్యతీర్థాలు ఎండి పోకుండా ఎల్లప్పుడూ ప్రవహిస్తూనే ఉంటాయి.

దేవీ! యోగులకి, యతులకి, వేదాంతులకి, పిల్లలకి, స్త్రీ పురుషులకి, అన్ని జాతుల వాళ్లకి కూడా ఈ 'శ్రీరామ నామ' జపం రక్షాకవచం వంటిది.

నీకు ఇప్పుడు వివరంగా అర్థమైందని అను కుంటున్నాను. ఇంతకంటే తేలికగా మోక్షాన్ని పొంద గలిగే సాధనం లేనేలేదు. దీన్ని 'తారకమంత్రం' అంటారు!" అని లోకమాత పరమేశ్వరికి వివరిం చాడు సర్వేశ్వరుడు.

మనం కూడా రామనామం పలుకుదాం-"తేలికగా పలక గలిగిన రామ నామ జపం చేయడం వల్ల ఇంత మంచి ఫలితం ఉన్నప్పుడు మనం మాత్రం ఎందుకు చెయ్యకూడదు..? వాల్మీకి, త్యాగయ్య, రామదాసు, తులసీదాసు వంటి భక్తులెందరో శ్రీరామ నామ జపంతో శాశ్వతకీర్తిని పొందారు.

మనం కూడా ఈ తారకమంత్రాన్ని జపిస్తూనే మన పనులు మనం చేసుకుంటూ పోదాం. మన పనులూ ఆగవు, జపమూ నడుస్తుంది. శ్రీరాముడిదయ మనమీద ఉన్నప్పుడు ఆయనే మన మంచి చెడ్డలు చూసుకుంటాడు.

'జై శ్రీరామ్'

108 దివ్యదేశాలు

# తిరుక్కోవలూర్

## (మధ్యదివ్యదేశం-2)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

“భక్తోపమర్దరసికః” అని వేదాంతదేశికులవారు స్తుతించినటువంటిస్వామి ‘తిరుక్కోవలూర్’ అనే దివ్యదేశంలో త్రివిక్రముడిగా భక్తులని అనుగ్రహిస్తూ ఉన్నాడు. ఈ దివ్యదేశం దక్షిణఆర్కాట్ జిల్లాలో, తిరువణ్ణామలైకి సమీపంలో వెలసి ఉన్నది. పంచకృష్ణారణ్యక్షేత్రంగా చెప్పబడే ఐదుక్షేత్రాలలో ఈ దివ్యదేశం కూడా ఒకటి. ముగ్గురు ఆళ్వారులను పొయ్‌గై ఆళ్వార్, పూదత్తాళ్వార్, పేయాళ్వార్‌లను కాంచీపురం, మహాబలిపురం, మైలాపూర్ నుండి ఈ దివ్యదేశానికి రప్పించినటువంటి ఘనత ఈ స్వామిది.

ఒకనాడు వీరు మృకండుమహర్షి యొక్క దేహళీ (గడప)లో ఒక్కొక్కొరుగా రావడం జరిగినది. మంచి కుంభవృష్టి. చిమ్మచీకటిలో ఆ చిన్నప్రదేశంలో ఒకరికొకరు తెలుసుకోకుండా పొయ్‌గై ఆళ్వార్లు, పూదత్తాళ్వార్లు, పేయాళ్వార్లు ఇచ్చటికి వచ్చారు. ఆ ఇంటిలో వసారాలో- ఒక్కరు పడుకోవచ్చు, ఇద్దరు కూర్చోవచ్చు, ముగ్గురు నిల్చుకోవచ్చు అనేటటువంటి ఆ స్థితిలో ఉన్నప్పుడు ఈ స్వామి తిరుక్కోవలూర్ దేహళీశస్వామి భక్తుల సంశ్లేషణను కోరినవాడై వాళ్లమధ్యలో వచ్చి నిలువగా, ఆ ముగ్గురికి ఇరుకుగా ఒక భావన కలిగిన వెంటనే ఒక్కొక్కరు ఒక్కొక్క దీపాన్ని వెలిగించగా మూడవ ఆళ్వార్ పేయాళ్వార్లు మన మధ్య ఉన్నవాడు ‘శ్రియఃపతి’ అని తెలియజేశారు. అంచేత భగవంతుడు “భక్తోపమర్దరసికః” భక్తులసంశ్లేషణతో సంతోషించువాడు అనేటటువంటి పేరును పొందాడు.

### విశేషాంశాలు

| | | |
|---|---|---|
| స్వామివారి పేరు | : | ఆయనార్ గోపాలన్, కోవలన్ |
| అమ్మవారి పేరు | : | పుష్పవల్లి, పూంకోవల్‌నాచ్చియార్ |
| తీర్థం | : | పెణ్ణైనది, కృష్ణతీర్థం, చక్రతీర్థం |
| విమానం | : | శ్రీకరవిమానం |
| ప్రత్యక్షం | : | మహాబలి, మృకండుమహర్షి, బ్రహ్మ, ఇంద్రుడు, శౌనకుడు, కాశ్యపుడు, కావలర్, కుశధ్వజుడు |
| క్షేత్రరక్షకురాలు | : | యోగమాయ దుర్గ |
| ఆగమం | : | వైఖానసం |
| మంగళాశాసనం చేసిన ఆళ్వారులు | : | పొయ్‌గై ఆళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారు మరియు తిరుమంగైయాళ్వారు |

అష్టాక్షరం, ద్వయం, చరమశ్లోక ప్రతిపాదకములైన మూడు ప్రబంధాలని ముగ్గురుఆళ్వారులు రచించడం జరిగినది. ఆనాటి నుండి ఈ స్వామికి దేహళీశః అనే పేరు సార్థకమైనది. ‘దేహళీ’ అంటే ‘గడప’. అందులో దర్శనమిచ్చాడని అర్థం.

ఈ దివ్యదేశవైభవం పాద్మపురాణంలో విశేషంగా చెప్పబడినది. మూలమూర్తి త్రివిక్రమస్వామి, ఆ స్వరూపం ఒక దివ్యపాదాన్ని భూమిపైన, మరొక దివ్యపాదాన్ని ఆకాశంవైపు ఎత్తి, భూమిని పాదంతో కొలిచే విధంగా నిలుచున్న భంగిమలో ఇంకెక్కడా కూడా కనిపించనటువంటి స్థితిలో స్వామివారియొక్క కుడి భుజంలో ‘శంఖము’, ఎడమభుజంలో ‘చక్రాన్ని’ ధరించిన భక్తులని అనుగ్రహిస్తూ ఉన్నాడు. దీనికి కారణం ఏమిటి అని చూస్తే బలిచక్రవర్తియొక్క అహంకారాన్ని అణచి, త్రివిక్రముడిగా శంఖాన్ని తనయొక్క కుడిభుజంతో అంటే కుడిచేతిలో మార్చుకొని గట్టిగా శంఖపూరణం చేశాడు. అలాగే, ఈ తిరుక్కోవలూర్ దివ్యదేశానికి వేంచేశాడట. అంచేత, స్వామివారి కుడిభుజంలో ‘పాంచజన్య’మనే శంఖం, ఎడమభుజంలో ‘సుదర్శనచక్రం’ ఇక్కడ మనకు కనిపిస్తుంది. అంటే ఆయుధాలు మారి ఉంటాయి. అలాగే, మూలమూర్తి యొక్క దక్షిణపాదం పక్కన బలిచక్రవర్తి, ఎడమపక్కన శుక్రాచార్యుడు, మార్కండేయ మహర్షి, వారి భార్య మరియు ముగ్గురు ఆళ్వారులు వేంచేసి ఉంటారు. స్వామివారికి మూలవర్ల యొక్క సన్నిధివెనుక వామనమూర్తి వేంచేసి ఉంటాడు. ఆయనార్ గోపాలన్, కోవలన్ అను పేర్లు ఉన్నాయి. అమ్మవారు పుష్పవల్లి. వీరికి పూంకోవల్ నాచ్చియార్ అని పేరు. తీర్థం-పెణ్ణైనది, కృష్ణతీర్థం, చక్రతీర్థం. విమానం-శ్రీకరవిమానం.ప్రత్యక్షం-మహాబలి, మృకండుమహర్షి, బ్రహ్మ, ఇంద్రుడు, శౌనకుడు, కాశ్యపుడు, కావలర్, కుశధ్వజుడు

అనే మహారాజుకు. మంగళాశాసనం- ముగ్గురు ఆళ్వారులు మరియు తిరుమంగై ఆళ్వారులు, ఆగమం-వైఖానసం.

ఈ దివ్యదేశంలో కృష్ణావతారానికి ముందు ఆ యశోదమ్మకు పుట్టినటువంటి యోగమాయ అనేటటువంటి **దుర్గ** ఇక్కడ ఒకసన్నిధిలో కాపలాకాస్తూ, అర్ధమండపంలో వేంచేసి ఉంటుంది. ప్రతిరోజూ కూడా దేహళీశస్వామికి, అమ్మ వారికి నైవేద్యం అయిన తర్వాత దుర్గాదేవికి కూడా ఇక్కడ నైవేద్యం చేయబడుతుంది.

**స్థలపురాణం-**

**1)** మార్కండేయమహర్షి యొక్క కుమారుడైనటువంటి మృకండుమహర్షి దేవదేవుని యొక్క త్రివిక్రమ అవతారాన్ని దర్శించి నమస్కరించాలి అని భావించి, తన ధర్మపత్నితో అనేక దివ్యదేశాలను దర్శిస్తూ వస్తున్న సందర్భంలో నారదమహర్షి యొక్క ఆదేశంతో **కృష్ణభద్ర** అనే పేరుగల కృష్ణారణ్యక్షేత్రం, **కృష్ణపురి** అనేటటువంటి ఈ **తిరుక్కోవలూర్** దివ్యదేశంలో ఆ గోపాలుణ్ణి చూసి మృకండుమహర్షి దంపతులు తపస్సుచేయగా అర్ధరాత్రి కుమార్తెతోపాటు భగవంతుడు ఒక వృద్ధుడిగా వాళ్ళముందు వచ్చి భిక్షను అడగడం జరిగినది. ఋషిపత్ని కూడా తన యొక్క పతివ్రతాసంకల్పంతో మహాలక్ష్మిని స్తోత్రం చేసి, తద్వారా భోజనాన్ని సంపాదించి, వారికి పెట్టడం జరిగినది. మృకండుమహర్షి దంపతుల భక్తికిమెచ్చి, సంతోషించి భగవంతుడు భూమిని మరియు ఆకాశాన్ని కొలిచే రీతిలో త్రివిక్రముడిగా వారికి దర్శనభాగ్యాన్ని కలిగించాడు. ఋషి దంపతుల కోరికమేరకు ఆ శ్రియఃపతి యొక్క త్రివిక్రమావతార స్వరూపాన్ని కనులారా దర్శించి తరించారు. అలాగే, ఈ దివ్యదేశంలోనే తమరు వేంచేసియుండాలి అని ప్రార్థింపగా, భగవంతుడు కూడా ఆనాటి నుండి అలాగే వేంచేసి, ఇక్కడ అందరికీ దర్శనభాగ్యాన్ని కలిగిస్తూ ఉన్నాడు.

**2)** కాలవుడు అనేటటువంటి ఒక మహర్షి మరియు అనేక మహర్షులు ఈ దివ్యదేశంలో తపస్సు చేస్తుండగా, ఆ తపస్సుకు భంగం కలిగించడానికి పాతాళకేతు అనే రాక్షసుడు ప్రయత్నింపగా, వీరందరూ భగవంతుణ్ణి వేడుకోగా, ఆ దేవ దేవుడు కుశధ్వజుడు అనేటటువంటి రాజుద్వారా ఆ రాక్షసుణ్ణి సంహరించి, మునులను రక్షించాడు అని ఇంకో స్థలపురాణం.

**3)** దుర్వాసమహర్షి యొక్క శాపం చేత సమస్తమైన ఐశ్వర్యాలంతటిని కూడా పోగొట్టుకున్నటువంటి దేవేంద్రుడు ఈ దివ్యదేశానికివచ్చి స్వామినిగూర్చి తపస్సుచేసి ఆ భగవంతుని యొక్క అనుగ్రహవిశేషంతో తను పోగొట్టుకున్న ఐశ్వర్యాన్ని తిరిగి పొందడం జరిగినది. ఇవన్నియూ కూడా పాద్మ పురాణంలో మనకు కనిపిస్తాయి.

తిరువణ్ణామలైకి సమీపంలో అత్యాశ్చర్యమైనటువంటి స్వరూపంలో చిత్రవిచిత్ర వర్ణశోభితుడైనటువంటి త్రివిక్రమావ తార స్వరూపుడైనటువంటి ఈ గోపాలుణ్ణి దర్శిస్తే సమస్తమైనటు వంటి మంగళములను, సంతానం లేనటువంటి వారు సంతానమును, వివాహం కానటువంటి వారు వివాహాన్ని పొందితరిస్తారు.

**విక్రమ్య యేన విజితాని జగంతి భూమ్నా**
**విశ్వస్య యం పరమకారణమామనంతి।**
**విశ్రావణయన్ ప్రణయినాం వివిధాన్ పుమర్థాన్**
**గోప్తా స మే భవతు గోపపురాధిరాజః॥**

*ఓమ్ త్రివిక్రమాయ నమః*





# పరమయోగిని శ్రీతరిగొండ వెంగమాంబ అష్టాంగ యోగం

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152



'యోగం' అంటే కలయిక, ఐక్యం. రెండుగా విడి విడిగా ఉన్న వస్తువులు కలిసి ఒక్కటిగా భాసించడమే యోగం. ప్రధానంగా 'పరమాత్మ- జీవాత్మ'లను రెండింటిని లయింపజేయడమే యోగంయొక్క పరమావధి. దాన్ని తెలియజేసేది 'యోగశాస్త్రం'. ఈ రెండింటిని గూర్చి భారతీయ తత్త్వశాస్త్రం నిరంతరం మథిస్తూనే ఉంది.

'జీవాత్మ' ఎవరో కాదు. అనంతమైన చైతన్యవంత మైన శాశ్వతమైన పరమాత్మనుంచి విడివడిన జీవాత్మ తాను, ఆ విషయాన్ని మరచిపోయి, ఇంద్రియ వ్యామోహంతో, అనేక దుశ్చర్యలకు పాల్పడుతూ ఉంది. ఆ పాప ఫలితంగా జీవాత్మ మాయకులోనై మళ్లీ మళ్లీ పుడుతూ గిడుతూ ఎడ తెరపిలేకుండా బాధలకు గురి అవుతున్నది. కాని, ఈ చావు పుట్టుకల నుంచి ఎప్పుడెప్పుడా విముక్తిని పొందేది అంటూ వాపోతూఉంటుంది ఈ జీవాత్మ అయిన మానవుడు.

తద్వారా తన ఇంద్రియాలకు ఏ మాత్రం లోబడ కుండా తనలోనే ఏదో ఆధ్యాత్మిక శక్తి అంతర్గతంగా పని చేస్తున్నదని గమనించిన మానవుడు, దానికి, 'యోగశక్తి' అని పేరు పెట్టుకొన్నాడు. ఆ ఆధ్యాత్మిక శక్తి ద్వారా తాను తరించడానికి, కళ్లుమూసుకొని తనలోనే తాను తదేకంగా పయనించడం ప్రారంభించాడు. తద్వారా ముక్తిని పొందా లని ఆరాటపడుతున్నాడు. ఆ ప్రయత్నం కేవలం వ్యక్తి గతం. వైయక్తికం అయిన ఆ మార్గంలో సిద్ధిని పొందదా నికి జీవాత్మకు ఎన్ని జన్మలైనా కావచ్చు. అలా యోగసిద్ధులై మహనీయులైన సప్తర్షులు, వ్యాసవాల్మీకాది మహర్షులు.. ఎందరెందరో చక్రవర్తులు సనాతన ధర్మంలో దర్శన మిస్తారు.

## 'మహాయోగశాస్త్రమే' భగవద్గీత

ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగ వానుడు అర్జునునికి 'శ్రీభగవద్గీత'ను ఉపదేశిస్తూ మహాయోగశాస్త్రంగా పేర్కొ న్నాడు. ఇదే మొదలు కాదు. ఈ యోగ శాస్త్రాన్ని చాలపూర్వమే సూర్యునికి ఉప దేశించాను. ఆయన కొడుకు మనువుకు చెప్పాడు. అతను ఇక్ష్వాకుకు బోధించాడు. అతని నుండి క్రమంగా ఎందరో రాజర్షులకు అందింపబడి నందువల్ల ఇది 'రాజయోగం'గా ప్రచారమై, ఆ తర్వాత మరుగున పడి పోయింది. మళ్లీ దీన్ని నీకు ఉపదేశిం చానని శ్రీకృష్ణుడన్నాడు.

ఒకప్పుడు కపిలమహర్షి, పుత్ర వ్యామోహంతో భ్రమలకు లోనైన తన



తల్లి 'దేవహూతి'కి ఈ యోగశాస్త్రాన్ని ఉపదేశించి జరాజన్మమరణాలనుంచి ఆమెకు ముక్తిని కలిగించాడు.

అలాగే పుత్రవాత్సల్యంతో పామరంగా సతమతమవుతున్న తన తల్లి అనసూయామాతకు, సాక్షాత్తు దత్తాత్రేయస్వామి తత్త్వోపదేశంతో యోగాన్ని ఉపదేశించి, ఆమెను జ్ఞానవైరాగ్య సంపన్నురాలిగాచేసి, తాను తపస్సుకు సహ్యాద్రికి వెళ్లాడు.

ఈ యోగాన్ని అభ్యసించడంవల్ల మొదట ఆ వ్యక్తికి భౌతికమైన శరీరఆరోగ్యం, దేహపటుత్వం, ఆ తర్వాత ప్రశాంత చిత్తం సిద్ధిస్తాయి. ఆ తర్వాత తర్వాత పరాకాష్ఠగా పరమాత్మదర్శనం కలుగుతుంది. చిట్ట చివరకు శాశ్వతమైన ఆతత్త్వంతో లయింపజేస్తుంది.

## మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ-రాజయోగం

ఇలా అనూచానంగా పరంపరానుగతంగా కొనసాగుతున్న యోగవిద్యను గూర్చి సిద్ధయోగిని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 'శ్రీవేంకటాచల మాహాత్మ్యం', 'రాజయోగసారం' రెండుపద్యకావ్యాల్లోను, 'అష్టాంగ యోగసారం'- ద్విపదకావ్యంలోను సులభ శైలిలో వివరించింది.

ఈయమ జన్మతః పరమభక్తురాలు. కాని, చిన్నతనంలోనే అలవడిన వైరాగ్యస్థితిలో వెంగమాంబకు రూప దాల్చిన యోగమూర్తి అయిన గురువు రూపావతారం సుబ్రహ్మణ్యయోగి ఆశ్రయం దొరికింది. ఆ గురువుగారిచ్చిన మంత్రదీక్ష-హస్తమస్తక సంయోగంవల్ల సిద్ధించిన యోగతత్త్వంతో తరిగొండ వెంగమాంబ పరమయోగినిగా విరాజిల్లింది. తిరుమల చేరుకొన్న ఆమహాయోగిని, తుంబురు తీర్థంవంటి తీర్థాల్లో, కొండల్లో కోనల్లో తీవ్రమైన తపస్సాధన చేసి సిద్ధయోగినిగా రూపుదాల్చింది.

గురువుగారి అనుగ్రహంవల్లా, సాధనవల్లా తనకు సిద్ధించిన యోగ విద్యను తెలుగువారికి అందించి కొంతలో కొంతవరకైనావారికి యోగవిద్య పరిచయం చేయాలన్న ధ్యేయంతో అత్యంత సులభంగా శ్రీవెంగమాంబ అలరించిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది.

## పరమాత్మ-జీవాత్మ

పరబ్రహ్మ 'పరం' అనీ, 'అపరం' అనీ రెండువిధాలు. వీటిలో పరం అనే అక్షరం... శాశ్వతం. రెండవది అపరం అనేది క్షరం.... అనగా నశించేది. అక్షరుడే పరమాత్మ! క్షరుడే జీవాత్మ! ఆ పరమాత్మఅంశతో పుట్టినవాడే ఈ జీవాత్మ. అవిద్య అనే మాయవల్ల అనేక జన్మలను, దేహాలను పొందుతూ వ్యామోహ శోకసముద్రాల్లో మునిగితేలుతుంటాడు.

అహంకార మమకారాలతో ఎన్నో పాపాలనుచేస్తూ మళ్లీపుడుతూ చస్తూఉంటాడు. మరి ఇలాంటి జీవునికి విముక్తి ఎట్లా? అంటే పరమయోగిని వెంగమాంబ ఇలాదారి చూపింది.

## యోగాభ్యాసానికి ఎనిమిదిమెట్లు

సద్గురువుగారి ద్వారా మాత్రమే యోగాన్ని గూర్చి తెలుసుకొని ఉపదేశం పొందాలి. 1)యమం 2)నియమం 3)ఆసనం 4)ప్రాణాయామం 5)ప్రత్యాహారం 6)ధారణ 7)ధ్యానం 8)సమాధి- అనే ఎనిమిదిమెట్లను ఒకదాని తర్వాత మెట్లను ఒకదాని తర్వాత మరొకదానిని అభ్యాసంచేస్తూ తరించాలి. ఆహారనిద్రాలతోపాటు ఇంద్రియ నిగ్రహంతో శాంతంగాఉండడమే 'యమం'. దృఢమైన గురుభక్తితో ఏకాంతంగా వైరాగ్యంగా ఉండడం 'నియమం'. సుఖంగా స్థిరాసనంలో, స్పృహలేకుండా కూర్చోని మనస్సుని ఆత్మలో నిల పడమే 'ఆసనం'. వాయువును గురువు చెప్పినట్లుగా పీల్చడం, విడవడంవంటిదే 'ప్రాణాయామం'. ప్రాణాయామం ద్వారా మనోవికారాలులేకుండా మనస్సునుపట్టి ఉంచడమే 'ప్రత్యాహారం'. తనలోపలా, బయటా తేజోరూపంతో వెలుగుతున్న పరమాత్మను మనస్సులో స్థిరంగాఉంచడమే 'ధారణ'. తనలోని ఆత్మే సర్వేసర్వత్ర వ్యాపించిఉందన్న స్పృహను కలిగి ఉండడమే 'ధ్యానం'. చిట్టచివరకు నీళ్లలో కరిగిన చక్కెరలాగా పరమాత్మలో జీవాత్మను లీనం చెయ్యడమే 'సమాధి'.

యోగాభాస్యానికి ఈ ఎనిమిది మెట్లనే గాక, మాతృశ్రీ తరిగొండవెంగమాంబ సమాధియోగంలో, షట్చక్రాలు, అజపా గాయత్రి, లయయోగ పద్ధతి, హఠయోగ పద్ధతి; ధౌతికర్మ, వస్తికర్మ, నేతి, త్రాటక, నౌళికర్మ, కపాలబాతివంటి ఆరుకర్మల్ని; సూర్య భేదన, కుంభకం, ఉజ్ఝాకుంభకంవంటి ఎనిమిదిరకాల కుంభకాలను; సాంఖ్య యోగం, తారకయోగం, అమనస్కయోగం (శాంభవీముద్ర), మంత్రలయాదియోగాల అనుభవం, రాజయోగిలక్షణాలు, రాజయోగి ఆత్మయజ్ఞం... ఇలాంటి యోగాభ్యాస విశేషా లను ఎన్నో తెలియజేస్తూ, వీటన్నింటిని సద్గురువుదగ్గర సచ్ఛిష్యునిగాఉంటూ ఉపదేశం పొందవలసినవేనంటూ తరిగొండ వెంగమాంబ స్పష్టంగాతెలియజేశారు.

ఇంతటి సంక్లిష్టమైన యోగాభ్యాసాన్ని కేవలం గురువుగారి అనుగ్రహంతో పొందిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 1730లో చిత్తూరుజిల్లా తరిగొండలో జన్మించింది. తదుపరి తిరుమలను చేరుకొని సుమారు 90 ఏండ్ల వయస్సు 1817లో శ్రీవరాహస్వామివారి ఆలయానికి ఎదురుగా వరాహస్వామి అతిథి గృహం వెనుకభాగంలో యోగసమాధిలో ప్రవే శించి, నేటికీ తిరుమల శ్రీవారిఆలయంలో



ప్రతిరోజురాత్రి చివరగాజరిగే 'శ్రీవారిముత్యాలహారతి'లో అంటే ఏకాంతసేవలో వెంగమాంబ యోగ శరీరంలో బృందావనంనుంచి ఆలయానికి వెళ్తుంటుందని ప్రతీతి! అంతేకాదు, ఆ పరమయోగిని తిరుమల పర్వతసానువుల్లో యోగశరీరంతో సంచరిస్తుంటుందని ఆమెను సుమారు 70 ఏండ్ల క్రిందట దర్శించిన సద్గురు మళయాళస్వామివంటి మహనీయులు పేర్కొన్నారు.

'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నట్లు సిద్ధయోగిని అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అందించిన అష్టాంగయోగంలో కొద్దిగ సులువైన ప్రాణాయామాది ఎనిమిదినియమాలు ఆచరిస్తూ జిజ్ఞాసువులు ఆ మార్గంలో అభ్యాసంచేసినట్లైతే, శరీరపటుత్వం, ఆరోగ్యం, మనశ్శాంతి వర్చస్సు కలుగుతాయి. ఆ ప్రయత్నంలో దీక్షగా అభ్యాసంచేస్తూ ముందుకుసాగితే చాలు.

మానవునిశరీరం భగవంతుని అద్భుతమైన సృష్టి! జీవునికి తరించడానికి భగవత్ప్రసాదమైన ఈ దేహమే ప్రధానసాధనం. అలాంటి మానవునిశరీరాన్ని యోగులైన మహర్షులు ఇలా వివరించారు. ఈ శరీరం షట్చక్రయుతం అనీ, ఆసనలో "మూలధారచక్రం"లో గణేశుడు ఉంటాడని, దానికి రెండు అంగుళాలపై "స్వాధిష్ఠానచక్రం"లో బ్రహ్మదేవుడు ఉంటాడనీ, దానికి ఆరు అంగుళాలపైన బొడ్డు స్థానంలో "మణిపూరకం" అనే చక్రంలో విష్ణువు ఉంటాడనీ, ఆ పైన పదిఅంగుళాల దూరంలో హృదయంలో "అనాహతచక్రం"లో రుద్రుడు వెలుగొందుతుంటాడనీ, దానికి పైన కంఠభాగాన "విశుద్ధ చక్రం"లో సదాశివుడు ప్రధానదైవంగా ఉంటాడనీ, ఆ పైన భ్రూమధ్యభాగంలో ఉన్న "ఆజ్ఞాచక్రం"లో "పరమాత్మ" లేదా పరబ్రహ్మ ప్రకాశిస్తుంటాడని అంటారు. వీటి అన్నింటికీ పైభాగాన శిరస్సు నడిమి భాగం "సహస్రారచక్రం"లో వేయి దళాలపద్మంలో సద్గురుపాదపద్మాలు వెలుగొందుతుంటాయని, వీటిని అన్నింటిని యోగసాధకులు నిత్యము దర్శిస్తుంటారని విజ్ఞులు పేర్కొంటున్న పరమసత్యమైన అనుభవపూర్వకమైన మాట!

అలాగే ఈ ఏడుకొండలవాడి క్షేత్రం కూడా షట్చక్రయుతమైన మహిమాన్వితమైన దివ్యక్షేత్రం! ఒక్కొక్కకొండను ఒక్కొక్కచక్రంగా ఆరు కొండలను అధిరోహిస్తే, చివరగా ఏడవకొండలో వేయిదళాలపద్మంగా సహస్రారచక్రంలోభాసిస్తున్న ఆనందనిలయుణ్ణి దర్శించవచ్చు.



అంతేకాదు, యోగతత్త్వశాస్త్రవిధులు చెప్పేమంత్రం లాంటిమాట ఏమంటే "నిరంతరం సహస్రారచక్రం"లాగా భాసిస్తున్నఏడుకొండలపైన ఇప్పటికీ ఎప్పటికీ యోగ శరీరంతో సంచరిస్తూన్న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిర్దేశించిన యోగపథంలో అడుగులువేస్తూ నడవడానికి ప్రయత్నించుదాం. ఆ అడుగడుగుదండాలవాని అండ దండలతో రెండుచేతులా ఆనందాలను జవరుకుందాం. నోరారజుర్రుకొందాం!!

ఓం నమో వేంకటేశాయ

# శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అప్పలాయగుంట

– శ్రీమతి కె. విజయలక్ష్మి, 70131 85538

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారితో ప్రత్యక్షంగా ముడిపడిన క్షేత్రంగా చెప్పబడుతూ ఉన్న అప్పలాయ గుంటలో శ్రీవేంకటేశ్వరస్వామి అభయహస్తంతో శ్రీప్రసన్నవేంక టేశ్వరస్వామిగా కొలువుదీరి భక్తులకోర్కెలనుతీర్చే కొండంత దేవుడుగా పేరుపొంది, ఆరాధనలందుకొంటూ ఉన్నాడు.

పూర్వం అప్పులయ్య అనే భక్తుడు తిరుమలక్షేత్రానికి వెళ్తూ కొంతసేపు ఈ ప్రాంతంలో విశ్రమించాడు. తిరిగి ప్రయాణమై వెళ్తూ తనతోపాటు తెచ్చుకొన్న ధనసంచిని అక్కడే మరిచిపోయి బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళిన అనంతరం గుర్తుకు వచ్చి భయాందోళనలకు లోనైన అప్పులయ్య తన ధనం లభిస్తే కరువుతో ఉన్న ఈ ప్రాంతంలో చెరువును త్రవ్విస్తానని వేంకటేశ్వరస్వామికి మ్రొక్కుకొన్నాడు. తిరిగి వెళ్ళి తాను విశ్రమించిన ప్రాంతానికి చేరుకోగా, తన డబ్బుసంచి అక్కడే ఉండటంతో మొక్కుప్రకారం ఈ ప్రాంతంలో ఒక చెరువును



త్రవ్వించాడు. అప్పులయ్య త్రవ్వించిన చెరువు కనుక దానికి అప్పులయ్యకుంట, అప్పులయ్యగుంట అనే పేర్లు ఏర్పడి, ఈ క్షేత్రానికి కూడా అదే పేరు వచ్చింది. కాలక్రమంలో ప్రజల వాడుకలో ఈ పేర్లు మార్పు చెంది 'అప్పలాయగుంట' అయి నట్లు ఒక ఐతిహ్యం. దీనికి తోడు పూర్వం ఈ ప్రాంతంలో కరువుఏర్పడి తాగేందుకు నీరుకూడా లేని పరిస్థితి ఏర్పడింది. దీనితో చెరువును త్రవ్వించాలని మొదలుపెట్టారు. చెరువును త్రవ్వే పనివారికి ఏరోజుకారోజు అప్పులేకుండా కూలి చెల్లించే వారు. అంటే అప్పులేకుండా చెరువును త్రవ్వించడం వల్ల ఆ చెరువుకు అప్పలాయకుంట అనే పేరు ఏర్పడి ఈ ప్రాంతం కూడా అదే పేరుతో పిలువబడింది. చివరకు అది అప్పలాయ గుంటగా మారినట్లు ఇంకొక ఐతిహ్యం.

అప్పలాయగుంటలో శ్రీవేంకటేశ్వరస్వామివారు కొలువుదీరడం వెనుక ఆసక్తికరమైన స్థలపురాణగాథ ప్రచారంలో ఉంది. అప్పలాయగుంట సమీపంలో ఉన్న కొండ లకు యోగులకొండ అని పేరు. పూర్వం ఈ కొండలో ఉన్న గుహలలో అనేకమంది మహర్షులు తపస్సు చేసినట్లు కథనం. అటువంటి కొండపైకి సిద్ధులయ్య అనే సాధువు చేరాడు. వివిధప్రాంతాలలో పర్యటిస్తూ చివరకు ఇక్కడకు చేరి తన తపస్సుకు అనువైన ప్రాంతంగా గుర్తించి... శ్రీవేంకటేశ్వర స్వామిని పూజిస్తూ తపస్సు చేయడం ప్రారంభించాడు. అతని తపస్సుకు మెచ్చి శ్రీవేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై అభయమిస్తూ ఏదైనా వరం కోరుకోమన్నాడు.

అందుకు "స్వామీ! మీ దర్శనంతో నా జన్మధన్యమైంది. ఈనాడు అభయహస్తంతో నాకు దర్శనమిచ్చిన ప్రాంతంలో మీరు కొలువుదీరి ఈ ప్రాంతవాసులను రక్షిస్తూ ఉండండి" అని సిద్ధులయ్య వరం కోరాడు. శ్రీవేంకటేశ్వరుడు వరం ప్రసాదించాడు. వరం ప్రకారం అప్పలాయగుంటలో శ్రీవేంక టేశ్వరస్వామి అభయహస్తంతో కొలువుదీరినట్లు స్థలపురాణం తెలుపుతోంది.

జూన్ 7 నుండి 15 వరకు అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...



అప్పలాయగుంటలో శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయం తూర్పు అభిముఖంగా ఉంది. ప్రధాన ఆలయానికి ఎదురుగా శ్రీప్రసన్నఆంజనేయస్వామివారి ఆలయం ఉంది. శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయానికి ముందువైపున ఇటీవలి కాలంలో నిర్మింపబడిన పుష్కరిణి ఉంది. ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం రాజగోపురం దర్శనమిస్తుంది. మూడు అంతస్తులతో పైభాగంలో ఐదుకలశాలను కలిగి ఉన్న ఈ రాజగోపుర మార్గంగుండా ఆలయప్రాంగణంలోకి ప్రవేశిస్తూనే ప్రధాన ఆలయం దర్శనమిస్తుంది. ప్రధానాలయానికి ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడాళ్వారు మండపం ఉన్నాయి. ప్రధానాలయం ముఖ మండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. ముఖమండపంలో ఉత్తరంవైపున ఉన్న వేదికపైన శ్రీవిష్వక్సేనులు, శ్రీరామానుజాచార్యులు, వైష్ణవ ఆళ్వారులు కొలువుదీరి దర్శనమిస్తారు. ముఖమండపంనుంచి అంతరాలయానికి ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా జయ, విజయులు కొలువు దీరి నిత్యం స్వామివారిని సేవిస్తూ దర్శనమిస్తారు. అంతరాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులు కొలువుదీరి ఉన్నారు.

ఇక ప్రధానగర్భాలయంలో శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామివారు సుమారు ఏడుఅడుగుల ఎత్తును కలిగి, చతుర్భు జాలతో దివ్యమనోహర రూపంతో భక్తులపై ప్రసన్న దృక్కులను ప్రసరింపజేస్తూ దర్శనమిస్తారు. స్వామివారు శంఖు, చక్ర, అభయ, కటి హస్తాలతో కొలువుదీరి ఉన్నారు. మామూలుగా శ్రీవేంకటేశ్వరస్వామివారు ఎడమచేతిని కటిపై ఉంచుకొని, కుడిచేతిని వరదముద్రను కలిగి ఉంటారు. కానీ ఈ క్షేత్రంలో **వరదముద్ర** బదులు **అభయముద్ర**ను కలిగి ఉండటం విశేషం. స్వామివారు అభయహస్తంతో ఉండటంవల్ల భక్తులకు అభయమిచ్చి వారి కోరికలను, కష్టాలను, బాధలను తొలగిస్తా రని భక్తుల విశ్వాసం. ప్రధానంగా శనివారంనాడు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శిస్తే, కోరిన కోరికలన్నీ శీఘ్రంగా నెర వేరుతాయని భక్తుల నమ్మకం.

ఆలయప్రాంగణంలో నైఋతిలో తూర్పు అభిముఖంగా ఉన్న ఆలయంలో స్వామివారి దేవేరి శ్రీపద్మావతీఅమ్మవారు కొలువుదీరి పూజలందుకొంటూ ఉంది. గర్భాలయంలోని అమ్మవారు పద్మంపై ఆసీనురాలై చతుర్భుజాలతో రెండు చేతులలో పద్మాలను, మరో రెండు చేతులలో అభయ, వరద ముద్రలను ధరించి కొలువుదీరి భక్తులపై కరుణాకటాక్షాలను ప్రసరింపజేస్తూ దర్శనమిస్తుంది. ఆలయప్రాంగణంలో వాయువ్యంలో ఉన్న ఆలయంలో శ్రీగోదాదేవి అమ్మవారు కొలువుదీరి పూజలందుకొంటూ ఉంది.

## 2025, జూలై నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | మరీచిమహర్షి వర్షతిరునక్షత్రం |
| 05 | పెరియాళ్వార్ శాత్తుమొఱ |
| 06 | శయనైకాదశి, తొలిఏకాదశి, చాతుర్మాస్య ప్రారంభం |
| 07 | శ్రీనాథమునుల వర్షతిరునక్షత్రం |
| 10 | గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమ, ఆషాఢపూర్ణిమ |
| 12 | శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ |
| 16 | తిరుమల శ్రీవారి ఆణివరఆస్థానం |
| 25 | చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం |
| 28 | నాగచతుర్థి, ఆండాళ్ తిరువాడిప్పూరం శాత్తుమొఱ |
| 29 | గరుడపంచమి |
| 30 | కల్కిజయంతి, కశ్యపమహర్షివర్షతిరునక్షత్రం |

చారిత్రకంగా పరిశీలిస్తే- అప్పలాయగుంట ఆలయం సుమారు వెయ్యిసంవత్సరాల నుంచి పూజలందుకొంటూ ఉన్నట్లు చెప్పబడుతోంది. తిరుమల, నారాయణవనాలలో ఆలయాలను నిర్మింపజేసిన ఆకాశరాజు వంశపాలకులే ఈ ఆలయాన్ని నిర్మింపచేశారు. తరువాతికాలంలో వారి వంశస్థులు, కార్వేటినగరాన్ని పరిపాలించిన రాజులలో 1750 ప్రాంతంలో వెంకటపెరుమాళ్రాజు ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయడంతో పాటు దానధర్మాలు చేశాడు. కార్వేటినగర ఆస్థానంలో కవిగా ఉన్న **సారంగపాణి** (1750-1820) కీర్తనలు రచించాడు. 1988వ సంవత్సరంలో ఆలయ నిర్వహణ బాధ్యతలను తిరుమల తిరుపతి దేవస్థానాల వారు చేపట్టారు. ఇటీవలి కాలంలో ఆలయ ప్రధాన ప్రవేశద్వారంపైన రాజగోపురాన్ని నిర్మించారు.

ప్రతిరోజూ పూజలు జరిగే అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో బ్రహ్మోత్సవాలు పదిరోజులపాటు *(ఈ సంవత్సరం జూన్ నెల 7వ తేదీ నుంచి 15 వరకు)* అంగరంగవైభవంగా జరుగుతాయి. సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, అనంతరం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో *పెద్దశేష, చిన్నశేష, హంస, సింహ, ముత్యపుపందిరి, కల్పవృక్ష, సర్వభూపాల, పల్లకి, గరుడ, హనుమంత, గజ, సూర్యప్రభ, చంద్రప్రభ, అశ్వవాహన* సేవలతోపాటు **రథోత్సవాలు** కన్నుల పండుగగా జరుగుతాయి. ధనుర్మాసం, వైకుంఠఏకాదశిలతో పాటు వివిధసమయాల్లో వివిధ ఉత్సవాలను నిర్వహిస్తారు.

అప్పలాయగుంటలో స్వామివారిని భక్తులు తిరుపతి నుంచి వెళ్ళి దర్శించుకొని తిరిగి తిరుపతికి చేరుకుంటారు. తిరుపతి నుంచి 18, తిరుచానూరు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అప్పలాయగుంటకు తిరుపతి నుంచి విరివిగా బస్సు సౌకర్యాలు ఉన్నాయి. తిరుపతి శ్రీనివాసం, విష్ణునివాసం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానాలు, పర్యాటకశాఖవారు నడిపే ప్యాకేజిటూర్లో వెళ్ళి కూడా ఈ క్షేత్రాన్ని దర్శించుకోవచ్చు.

శ్రీవేంకటేశ్వరుడు అభయహస్తంతో కొలువుదీరిన అప్పలాయగుంట దర్శించి భక్తులు తరించవచ్చు.

*ఓం నమో వేంకటేశాయ*

## గ్రంథసమీక్ష

# శ్రీ లక్ష్మీనృసింహస్తోత్ర వైజయంతి

**రచయిత:** మధురకవి ఆచార్య శ్రీవత్స; **సైజు**-1/8 డెమ్మీ; **పుటలు**- 448; **వెల**- రూ.342/-; **ప్రతులకు**- **1) వి.జి.ఎస్. బుక్‌లింక్స్,** 5-6-59/3, రెండవ అంతస్తు, తమ్మిన కృష్ణ వీధి, సాయిరాం థియేటర్ వెనుక, విజయవాడ-520 001. ఫోన్- 2510202, 2512222; **2) శ్రీమతి పి.రమాదేవి,** 5-98, వేపమానువీధి, తిరుచానూరు పోస్టు- 517503, సెల్- 99890 33696.

దశావతారాలలో నృసింహావతారం విలక్షణమైన అవతారం. శ్రీలక్ష్మీనృసింహస్వామిని సేవిస్తే సకలార్థసిద్ధితోపాటు అరిష్ట నివృత్తి కలుగుతుందని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. శ్రీలక్ష్మీ నృసింహస్వామిని వేదాలు, పురాణాలు, ఆగమాలు స్తుతిస్తున్నాయి. వివిధ దేవతలు, నారదాది మహర్షులు శ్రీనృసింహస్వామివారిని స్తుతించారు. వాటన్నిటిని సేకరించి ఒక సమాహారంగా తయారుచేసిన గ్రంథమే ఈ **శ్రీలక్ష్మీనృసింహస్తోత్ర వైజయంతి.** వీటితోపాటు పశ్చిమ గోదావరి జిల్లా గూటాల గ్రామ శ్రీలక్ష్మీ నృసింహస్వామి సుప్రభాతం, స్తుతి, ప్రపత్తి, మంగళాశాసనాలను తెలుగులోచక్కటి వివరణలు సమకూర్చారు. అలాగే శ్రీలక్ష్మీ నృసింహస్తుతి పేరున 27 సీసపద్యాలను లఘువివరణతోపాటు స్వయంగా వ్రాసి అందించారు. ఇంకా ఇందులో శంకర భగవత్పాదుల నృసింహకరావలంబస్తోత్రం, ప్రహ్లాదకృత నృసింహ స్తుతి, శ్రీలక్ష్మీనృసింహ నక్షత్రమాలస్తోత్రం, పంచరత్నాలు, లక్ష్మీనృసింహ అష్టోత్తరశతనామస్తోత్రం, శతనామావళి, సహస్రనామస్తోత్రం, సహస్రనామావళి; గాయత్రిరామాయణం. లలితా రహస్యస్తోత్రం, సహస్రనామం, హనుమాన్‌చాలిసా, తులసీ స్తోత్రాలు ఇత్యాదులతో పాటు అన్నమాచార్య సంకీర్తనలను కూడా ఈ గ్రంథంలో సమకూర్చారు మధురకవిగా, **ఆచార్య శ్రీవత్స**గా ఖ్యాతిగాంచిన **శ్రీకోగంటి వేంకట అప్పలాచార్యులుగారు.** ఒక్క మాటలో చెప్పాలంటే ఈ గ్రంథం సకల ప్రధాన దేవతాస్తోత్ర సర్వస్వం. నృసింహస్వామి విభూతికి విశేషపరిచాయిక, ఆధ్యాత్మిక సాధకవేదికను దర్శింపజేసే యవనిక. ఈ గ్రంథం నృసింహస్వామి ఉపాసకులకు, భక్తులకు అపూర్వ చింతామణి వంటిది.

*- డా॥ నొస్సం నరసింహాచార్య*

ఉపనిషద్వాక్యం

# శిష్యుడు కానివానికి ఇవ్వరాదు

**'అశిష్యాయ న దేయమ్' (అథర్వవేదం)**

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

విద్యకానీ, మంత్రంకానీ శిష్యునకే ప్రదానం చేయాలి. శిష్యలక్షణాలు లేనివానికి విద్యల నివ్వరాదు. కొన్ని మంత్రాల విషయంలోనైతే "సరియైన అధికారం లేనివారికి విద్యనిస్తే, ఆ ఇచ్చినవాడు పాపాత్ముడౌతాడు" అనే హెచ్చరికలు కనిపిస్తాయి. ఉదాత్తలక్షణం కలిగిన విద్యకు సరియైన అధికారి కావాలి. భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడు చివరిగా **'ఇదం తే నా తపస్కాయ నా భక్తాయ కదాచన'** అని పేర్కొన్నాడు. 'తపస్వి కానివానికి, భక్తుడు కానివానికి' దీనిని బోధించరాదు.



విద్యకు ప్రధానార్హత **శ్రద్ధ.** అటు తర్వాత **ఏకాగ్రత, సాధన.** గురువాక్యం పట్ల, గ్రహించే విద్యపట్ల సత్యభావం, దృఢమైన విశ్వాసం 'శ్రద్ధ' అనిపించుకుంటాయి. **'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'** అని గీతావాక్యం.

వేదాంతవిద్య కూడా **'అథాతో బ్రహ్మజిజ్ఞాసా'** అనే సూత్రము ద్వారా "వివేకం, వైరాగ్యం, శమము (మనోనిగ్రహం), దమము (ఇంద్రియ నిగ్రహం), తితీక్ష (సహనం), శ్రద్ధ, సమాధానము (ఏకాగ్రత), ముముక్షుత్వం" ఉన్నవాడే ఆత్మవిద్యకు అర్హుడు అని చెబుతున్నది. శ్రద్ధలేనివాడు సంశయంతో ఉంటాడు. అతడికి ఆ విద్యపై గౌరవం కలగదు. గౌరవంలేని విద్య రాణించదు. అందుకే **'అజ్ఞశ్చ అశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి'- 'మూర్ఖుడు, శ్రద్ధలేనివాడు, సందేహం కలవాడు తత్త్వాన్ని తెలుసుకోలేక నశిస్తాడు'** అని శ్రీకృష్ణుడు గీతలో తెలియపరచాడు.

కొందరికి విద్యపట్ల, మంత్రంపట్ల కుతూహలం ఉంటుంది. అందుకే విద్యార్థిని కనీసం ఒక సంవత్సరకాలం పరీక్షించమని శాస్త్రబోధ. ధనం ఉన్నంత మాత్రాన, దానిని గురువుకు ఇచ్చినంత మాత్రాన విద్య వచ్చి తీరుతుందని భ్రమించడం వృథా. అలాగే తన చెంత సంపదను సమర్పించడమే శిష్యుని అర్హత క్రింద గురువు కూడా భ్రమించరాదు. గురుదక్షిణ కూడా శక్తివంచన లేని శ్రద్ధకే సంకేతం.

శిష్యలక్షణాలలో **సహనం, శ్రద్ధ, ఆలస్యరహితం (బద్ధకం లేకపోవుట), అతినిద్రను జయించుట, బుద్ధికుశలత, గురువుపట్ల భక్తి...** ఇవి ప్రధానం. ఉద్రేకప్రవృత్తి కలిగినవానికి విద్య లభించడం కష్టం. విద్య కావాలనే తపన, వినయం శిష్యుడికి ప్రధానార్హతలు.

మంత్రవిషయంలోనైతే మరిన్ని ఉత్తమలక్షణాలు అవసరం. అది స్థూలదృష్టికి గోచరించే అంశం కాదు కనుక, కేవల విశ్వాస ప్రధానమైనది. సాధనని ఎక్కడా కుంటుపరచకుండా సాగాలి. కనుక సాధనకు తీవ్రమైన శ్రద్ధ ఇక్కడ అవసరం. గురువుపై, మంత్రంపై అకుంఠితమైన సత్యనిష్ఠ, దృఢనిశ్చయ బుద్ధి ఉండాలి. దానికితోడు మనోనిగ్రహం, శీలసంపదవంటివి అవసరం. అవి లేనినాడు మంత్రాధిదేవతల అనుగ్రహం దొరకడం కష్టం. కనుక ఇన్ని లక్షణాలు కలిగినవానికి మాత్రమే మంత్రోపదేశం చేయాలని పై వేదవాక్యం చెబుతోంది.

అటువంటి శిష్యునకు విద్య లభించినప్పుడే అది అతడికీ, లోకానికీ ఉపకారం. విద్యవల్ల సంపాదించే ధనాదులపై కంటే, విద్యను సంపూర్ణంగా నేర్చుకొనడంపైనే శ్రద్ధను కనబరచాలి.

భౌతికవిద్యలలో కన్నా, 'జ్యోతిష, వైద్య, వేద, యోగ, మంత్ర శాస్త్రాలలో' ఇంకా ఎక్కువ నిలకడ అవసరం.

పరిపూర్ణంగా విద్యను పొందని పక్షంలో, తరువాతి తరాలలో ఈ అరకొర విద్యావేత్తయే పరమ పండితునిగా, గొప్ప ప్రమాణంగా నిలిచిపోయే ప్రమాదముంది. అందుకే శ్రుతి మాత 'ఉత్తమశిష్యునికే' విద్యనిమ్మని బోధించింది.

*॥ ఓమ్ తత్సత్ ॥*

# ఉత్తమ పాలకుడు

- డా॥ అయాచితం నటేశ్వరశర్మ

ప్రాచీనకావ్యాలు, శాస్త్రగ్రంథాలు మానవాళికి దారి చూపే కరదీపికలు. వాటిలోని కథలలో, వర్ణనలలో, పాత్ర చిత్రణలో ఎన్నో ధర్మాలు, నీతులు తేటతెల్లమవుతాయి. ఈ ప్రపంచాన్ని ఎందరో పాలిస్తున్నారు. ప్రజలను పాలించడం అంత సామాన్య విషయం కాదు. ప్రజలమెప్పును సంపాదించడం కూడా అంత తేలికైన విషయమూ కాదు. పాలించే వారికి ఎన్నో అర్హతలుండాలి. సామర్థ్యం ఉండాలి. గాంభీర్యంతో పాటు అణకువ ఉండాలి. ఎన్నో ఉదాత్తభావాలు కలవారే **ఉత్తమపాలకులు** అవుతారు.

రఘువంశమహాకావ్యంలో కాళిదాసు దిలీపమహారాజును వర్ణిస్తూ అతడు ఉత్తమ ప్రజాపాలకుడని కీర్తించాడు. పాలకడలిలోనుంచి పుట్టిన చంద్రుడిలాగా ఆ రాజు సకల కళలతో వెలుగొందాడని అన్నాడు. వైవస్వతమహారాజు పూర్వ చక్రవర్తుల్లో ఎంతో పేరుగాంచినవాడని, అతడి వంశంలో దిలీపుడు సర్వసమర్థుడైన చక్రవర్తిగా ప్రజాపాలన చేశాడని వివరించాడు.

ఈ భూమండల భారాన్ని మేరుపర్వతం ఎలా మోస్తున్నదో అలాగే దిలీపుడు తన సర్వోన్నతప్రజ్ఞతో భూమిని పాలించాడని అన్నాడు. కొందరు పాలకులకు ఆకారపుష్టి ఉంటుందేకాని, ప్రజ్ఞాపాటవాలు ఉండవు. ప్రజ్ఞ ఉన్నా శాస్త్రజ్ఞానం అసలే ఉండదు. అందువల్ల వారు ఎక్కడో ఒకచోట విఫలమవుతారు. దిలీపుడిలో ఆకారానికి తగిన ప్రజ్ఞ, ప్రజ్ఞకు తగిన శాస్త్రజ్ఞానం, శాస్త్రజ్ఞానానికి తగిన ఆచరణ ఉందని, అందుకే అతడు ఏ పని తలపెట్టినా విజయం సాధిస్తాడని అన్నాడు.



ఆయనలోని ఉత్తమగుణగణాలను చూసిన వారందరూ అతడంటే ఎంతో ఇష్టపడేవారు. రాజు అంటే ఇలా ఉండాలని భావించేవారు. దిలీపుడు ప్రజల కోసమే పన్నులు వేసేవాడు. ప్రజలు చెల్లించిన పన్నులకు పదింతలుగా వారికోసం వ్యయం చేసేవాడు. అతడు ప్రజల ఉపయోగార్థం ఏ పనిని ప్రారంభించినా, ముందుగానే చక్కగా ఆలోచించి చేసేవాడు. అందువల్ల ఆయనచేసే ప్రతి పనీ విజయవంతం అయ్యేది.

దిలీపుడు అనుభవించదలచుకుంటే ఇంద్రభోగాలు ఉన్నాయి. కానీ, వాటిపై ఏ మాత్రం ఆసక్తిచూపకుండా నిరాడంబరంగా జీవించేవాడు. ఎంత జ్ఞానండున్నా దాన్ని పైకి ప్రకటించకుండా ఎంతో మౌనంగా ఉండేవాడు. అపారశక్తి ఉన్నా సహనాన్ని ఆభరణంగా ధరించి ఉండేవాడు. ఎంత త్యాగం చేసినా ఒక్కమాట కూడా పొగడ్తగా చెప్పేవాడు కాదు. అతడిలోని ఒక్కొక్క గుణం మరొక్క గుణాన్ని పుట్టిస్తున్నదా అన్నట్లు ఉండేది. ప్రజలకు వినయాన్ని, భక్తి శ్రద్ధలనూ నిరంతరం నేర్పే ఆ రాజును చూసి ప్రజలందరూ తమ తండ్రిగా భావించేవారు. అతడి పాలనలో **అర్థం**(ధన సంపాదన), **కామం**(కోరిక), ధర్మానికి కట్టుబడి ఉండేవి. అతని పాలనలో దొంగతనాలు ఉండేవి కావు. ఆ రాజు గొప్పతనం ఏమిటంటే తాను ద్వేషించేవారిలో ఉత్తమగుణాలు ఉన్నట్లయితే, అలాంటి వారిని శత్రువని చూడకుండా గౌరవించేవాడు. తనకు సన్నిహితుడై ఉన్నవాడు ఏదైనా తప్పుచేస్తే అతణ్ణి తనవాడని కూడా చూడకుండా తగిన రీతిలో శిక్షించేవాడు. దిలీపుడి అనంతరం రఘువు, శ్రీరామచంద్రుడు మొదలైన రాజులంతా ప్రజలను కన్నబిడ్డల్లాగా కాపాడుతూ పాలన కొనసాగించారు. అశేషకీర్తిని మూటగట్టుకున్నారు. ఉత్తమపాలకులుగా చరిత్రలో నిలిచిపోయారు.

"ఓమ్ తత్సత్"

జూన్ 11న ఏరువాకపూర్ణిమ సందర్భంగా..

# సాగుయాగం... వైభవప్రాభవం

- శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

ఏరువాక సాగితేనే మనిషి కష్టం తీరుతుంది. దుక్కి దున్నడం మొదలైతేనే కదా సేద్యం! దీనికి మేలిమి ముహూర్తం పున్నమి. భారతీయ సంప్రదాయరీతిన చూస్తే- దుక్కిటెడ్లను, వాటితోపాటు వ్యవసాయ ఉపకరణాలనూ పూలు, పసుపూ కుంకుమలతో అలంకరించడం పద్ధతి. వాటికి ధూపదీప నైవేద్యాలనూ అందించిన తర్వాతే పని ఆరంభం. రైతు సంవత్సరంలో తొలిప్రక్రియ అదే. ముందటిఅరక, క్షేత్రకర్షణ అనేవి మారు పేర్లు. భూమిపూజ, పశుప్రాణులకు స్నానం, ఊరిబయటకు వెళ్లాక తోరాల అలంకరణ, ఎద్దుల మెడలో నారలు కట్టడం- ఇవన్నీ ఇందులో భాగాలు. ఇదంతా పండుగ, సందడి, రైతుజీవన వనాల సంతోషకరయాత్ర!

నవధాన్యాల పేర్లు విన్నారు కదూ! **బియ్యం, గోధుమ, కందులు, పెసలు, శెనగలు, బొబ్బర్లు, నువ్వులు, మినుములు, ఉలవలు.** మరింత విశేషం ఏమిటంటే- ఆధ్యాత్మిక కోణాన, శాస్త్రపరంగా కూడా **చంద్ర, సూర్య, కుజ, బుధ, గురు, శుక్ర, శని, రాహు, కేతుగ్రహాలకు** ఇవి సంకేత అంశాలు. అధీన ధాన్యాలన్న మాట. పోషకాలు ఔషధగుణరూపాలు సైతం ఇవే. అంతేకాక, శుభకార్యాలు, దైవసంబంధక్రియల్లోనూ వీటికే సమధిక ప్రాధాన్యం. ఇంతటి ధాన్యసంపదను గంపలో పెట్టుకుని, ములుగర్రను చేతపట్టుకుని కదిలివెళ్తారు కర్షకులంతా. ఇదంతా వారి పర్వదిన ఉత్సవం, ఉత్సాహం, ఉత్తేజసంభరితం.

ఇదే జూన్ 11వతేదీన పున్నమిశోభ. అందునా హిందూసంప్రదాయాన్ని అనుసరించి, తిథులరీత్యాజ్యేష్ఠపౌర్ణమికి ఎనలేని ప్రాధాన్యం. నదులు, సముద్ర జలాల్లో పుణ్యస్నానాలను ఇందుకే ఆచరిస్తారు. ప్రధానంగా గ్రహాధిపతి చంద్రుడు సస్యంతోపాటు ఓషధులకీ రేడు. నిర్ణీత నక్షత్రాలకి చేరువ అయిన తరుణం శుభఫలితాలను ప్రసాదిస్తుందని రైతులోక ప్రగాఢ విశ్వాసం. అందువల్లనే ఈ పున్నమిన పొలాన్ని దున్ని సేద్యం సాగించే పని. భూమాతకు వందనాలందించి, కాడెద్దులదరిన ప్రత్యేకపూజలు నిర్వర్తిస్తారు ముందుగా.

ఎద్దుకు పర్యాయం **'వృషభం'**. శ్రేష్ఠతకు సూచకం. అంతటి వృషభపూజ ఏరువాకపున్నమినాడు ఏర్పాటవుతుంది. నిజానికి పశుపోషణ, ఆదరణ అనేవి వ్యవసాయ ఉపభాగాలు. పెంచిపోషించడం ద్వారానే ఎడ్లకు జీవనాధార కల్పన. ఆరు కాలములు కష్టించి శ్రమకోర్చి పండించే రైతుకు ఆ సాగుపనిలో తోడుగా ఉంటుంది దుక్కిటెద్దు. దుక్కిదున్ని, విత్తనం విత్తి, మార్పిడి తదుపరి పంటను ధాన్యంగా ఇంటికి తెచ్చుకునేదాకా రైతుకే ఎంతెంతో బాధ్యత. ఆ రైతులు భూమిని నమ్ముకుంటే, రైతుల్నే ఎంతగానో నమ్ముతుంది మూగప్రాణి. పవిత్రమైన పూర్ణిమన క్రియను ఆరంభించడం అంటే- అది మహోత్సవమే.

ఇప్పటికీ ఆ దృశ్యాలు మన కళ్లముందు కదలాడుతూనే ఉంటాయి. పలురంగుల వస్త్రాలతో ఎడ్లకు అలంకారాలు, మేళతాళాలతో ఊరేగింపులు, పొలంపని ఆరంభతరుణాన ఉద్వేగపూరిత క్షణాలు. పనిచేసే బసవనికే పత్రి, పుష్పం అన్నీ. గాదుల్లో ధాన్యం నిండితేనే, సావిళ్లలో భాగ్యం పండినట్లు! ఆ మాటకొస్తే ఏ పనినైనా యజ్ఞసమంగా భావించింది వేదం. అథర్వవేదమైతే ఏరువాకను ఉత్సవంగా వర్ణించింది. నాగలితో నేలను దున్నేటప్పుడు, విత్తనాలు చల్లేటప్పుడు క్షేత్రపాలన వెల్లివిరుస్తుందనీ విపులీకరించింది.

క్షేత్రపాలకుడిని మంత్రసహితంగా స్తుతిస్తుంది రైతు హృదయం. వ్యవసాయక్షేత్రం పరిరక్షణను సదా సర్వదా కోరుతూనే ఉంటుంది. ఆదరించి మేలు గలిగించే ఎవరైనా క్షేత్రపాలకులే! విధివిధానాలతో ఉత్పాదన సాధించడమే వ్యవసాయ పరమార్థం.

ఏరువాకపూర్ణిమ వర్ణన గుహ్యసూత్రాల్లో గోచరిస్తుంది. కర్తల్లో ఒకరైన పరాశరుడు 'కృషి' పేరిట వ్యవసాయశాస్త్రరచన చేసిన పండితోత్తముడు. వేదాలమీద తనకు సాధికారత, అపారజ్ఞానతృష్ణ. మరొకరు బోధాయనుడు. కృషిసిద్ధాంత ప్రతిపాదకుడు.

ఏరువాక గురించిన విలక్షణ ప్రస్తావన 'విష్ణుపురాణం'లో దర్శనమిస్తుంది. మహాపురాణంగా సుప్రసిద్ధం. పావనవేదసాహితీ విభాగం. ఇందులోనే భరతవర్ష విశదీకరణ ఉంది. వేలాది అంశాలు వ్యాసప్రభను తేటతెల్లం చేస్తుంటాయి. ఆత్మ, బుద్ధి, మనసు, ఆకాశం, వాయువు, తేజస్సులతో పాటు జలం, భూమి గురించిన విపులీకరణలు ఇందులో ఎన్నెన్నో. ఈ పురాణభాగం ప్రకారం- ఏరువాక అనేది సీతాయజ్ఞంగా

ప్రశస్తం. నాగలికి అర్థ తాత్పర్యాల్లో సీతాపదం ఒకటి. కర్షక మంగళప్రదంగా పండుగను దీనిలో అభివర్ణించారు. ఆ కాలంలో చక్రవర్తి ఏరువాక ఉత్సవప్రారంభసూచకంగా బంగరు నాగలిని రైతులకు అందించాడన్నది విస్తార కథనం.

హాలుడు రచించిన 'గాథా సప్తశతి' కావ్యలోకంలో విఖ్యాతం. తెలుగు సంస్కృతీసంప్రదాయాల వైభవ ప్రాభవం ఇందులో కానవస్తుంది. జనజీవనం, మరీ ముఖ్యంగా పల్లె వాసుల రోజువారీ పనుల అక్షర దృశ్యీకరణలు దీనిలో ఎన్నెన్నో. దీని అనుసారంగా– పల్లెరైతు నమ్ముకునేది భూమినే. అదే తన ఆశ, శ్వాస. ఆ విశ్వాసం, ఆశయాలకు అనుగుణంగా పంట పండినప్పుడు కలిగే ఆనందం ఆకాశమంత! అది శరత్కాల వెన్నెల రాత్రి. దంచి ఉంచిన కొత్త బియ్యపు పిండితో అంతా ఆరబోసినట్లుంది వాతావరణం సమస్తమూ. అక్కడే మహదానందంతో గొంతెత్తి పాడుతున్న వ్యవసాయదారుని హృదయోల్లాసం ఈ గాథల్లో ప్రస్ఫుటమవుతుంది. పల్లెటూరి భాగ్య సౌభాగ్యాలన్నీ ఇందులోనే.

పొలం పనివేళ రైతు కాళ్లకు అంటుకునే మట్టి, దాన్ని తడిపే నీరు, అప్పటి ఆ అనుభూతి అక్షరాలకు అందనిది.



స్వచ్ఛమైన గాలి వీస్తుంటుంది. పచ్చదనం కళ్లముందర కాన వస్తుంటుంది. ప్రకృతి పొంగి పులకిస్తుంటుంది. వీటన్నింటినీ దృశ్యబద్ధం చేస్తుంది ఏరువాక పూర్ణిమదీప్తి. ఏటా వచ్చే తిథుల్లో జ్యేష్ఠపున్నమిది ఆసాంతమూ ప్రత్యేకతే. రైతులందరి సంతృప్తీ సంతోషాలను శ్రీకృష్ణదేవరాయ పాలనాకాలమూ మనముందు ఉంచుతుంది. పంట పొలాలరీతిని, పశుసంపదవిస్తృతిని కళ్లకు కట్టించిన సందర్భాలెన్నో.

'వచ్చింది వచ్చింది ఏరువాకమ్మ, ఆనందాన్ని వెంట తెచ్చిందమ్మ/ నల్లమేఘాల్లో నాట్యాలు, కొండ గుట్టల మీద కళ కళలూ తళతళలూ' అంటున్నపుడు పున్నమి వెన్నెల అంతటా పరచుకున్నట్లే ఉంటుంది. మనందరికీ సుపరిచిత గీతికా మరొకటుంది. 'ఏరువాకమ్మకు ఏం కావాలీ? పూలపూల మాలలే కావాలి/ ఇంకా ఇంకా ఏం కావాలీ ఏది రావాలీ?/ ఎరుపు తెలుపుల మబ్బుటెండని చూడాలి/ ఏమని మొక్కాలీ, ఏమేమి కోరాలీ, టెంకాయ వడ పప్పు తెచ్చిపెట్టాలి, చిన్నా పెద్దా కలిసి పాటపాడాలి, మనసు నిలిపి నేల తల్లి పాదాలకు మొక్కాలి.' ఏరువాక సాగి అందరూ మురవాలన్నదే ఈ ఉత్సవ అంతరార్థం. కొత్త కొత్త పంటలను కోరుకోవాలన్నదే సారాంశం.

తొలకరి వానకు తడుస్తుంది నేల. దుక్కుకు సంసిద్ధంగా ఉంటుంది. సరిగ్గా అప్పుడే నాగలికి తోరణాలు కట్టి, అదే సమయాన కాడెద్దులకు నిండారా పొంగళ్లుపెట్టి పులకిస్తుంది రైతు మది. తలపాగ చుట్టుకుని, ములుకోల చేతపట్టుకుని కదిలి వెళతాడు చేనులోపలికి. గట్టునే నిలబడి దైవానికి దండం పెట్టుకుని, చాళ్లు తోలతాడు ధాటిగా. తాను కోరుకునేదీ, ప్రకృతి ప్రసాదించేదీ ఎడతెగని సిరులైన పాడి పంటలనే! కారు పున్నమి, కృషిక పున్నమి, ఏరొక పండుగ.... ఇలా ఏ పేరుతో పిలిచినా పలుకుతుంది ధాత్రి.

ఎండలు తగ్గి వానలు పడుతుంటే, జలవనరులు మిల మిలలాడుతుంటే, చక్కని ముహూర్తాన మొదలవుతుందీ సాగు యాగం. హలంపట్టి పొలం దున్నడానికి శ్రీకారం పలుకు తుంది. ఎడ్లను కట్టి దున్నేందుకు సిద్ధపరచిన నాగలితోనే మంగళధ్వానాలు వినిపిస్తాయి. ఏరువాక పున్నమే ప్రతి ఒక్కరి వాడుక, వేడుక. ఆ కృషికి లభించే ఫలితానికి ఎదురే ఉండదిక!

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

అప్పుడే తెలతెలవారుతున్నది. శుభకరమైన స్వప్నాలు వచ్చినప్పుడు తక్షణమే లేచి, స్నానము, భగవన్నామస్మరణ చేయవలెనని పెద్దలు చెబుతారు. ఆచార్యులు వెంటనే లేచారు. పరివారం కూడా ఆయనను చూచి నిద్ర మేల్కొన్నది. తమకు వచ్చిన కలను వివరిస్తే అందరూ విని ఆనందించారు. అందరూ పాదయాత్రగా తిరుమలసాగరం వద్దకు చేరుకున్నారు. శ్రీ నంబి నారాయణ పెరుమాళ్, శ్రీపార్థసారథి పెరుమాళ్, శ్రీనరసింహ పెరుమాళ్ దర్శనం చేసుకుని సెలవు తీసుకున్న తర్వాత, బరువెక్కిన హృదయంతో, రాజభవనానికి నడిచి, విష్ణువర్ధన మహారాజును కలుసుకుని, రామానుజాచార్యులు తమ దివ్య స్వప్నాన్ని, యాదవాద్రికి (తిరునారాయణపురం అని కూడా అంటారు) వెళ్ళవలెననే కోరికను ఆయనకు తెలియజేశారు.

యాదవాద్రికి ఎలా వెళ్లాలో ఎవరికీ తెలియదు; కఠినమైన, దట్టమైన అడవిమార్గాన్ని సుగమం చేయడానికి ఆచార్యులకు సహాయంగా రాజు తన సైనికులను నియమించాడు. అనంతరం స్థానికుడైన తొండనూరు నంబితో కలిసి ఆచార్యులు సపరివారంగా యాదవాద్రిలోని వేదపుష్కరిణి అనే ప్రాంతానికి చేరుకున్నారు. అది బహుధాన్యనామ సంవత్సరం, పుష్యమాసం.

ఆచార్యులు ఇంకా శ్వేతావస్త్రధారణలోనే ఉన్నారని, తొండనూరుపై ఉపన్యాసం ముగించి, రామానుజులు కాషాయ వస్త్రం ధరించిన చోట ఆగుదామని శ్రీకరస్వామి చెబుతారు. ఆ ప్రకారమే శ్రీకరస్వామి తన ఉపన్యాసాన్ని మేల్కోటేలో పునః ప్రారంభిస్తానని చెప్పి ముగించారు.

శ్రీకరస్వామి భగవద్రామానుజులు స్వహస్తాలతో నిర్మించిన తిరుమలసాగర సరస్సును దర్శించుకోవచ్చని సూచించారు. స్వర్గంనుండి వచ్చిన పర్యాటకులతో పరివారమంతా తిరుమల సాగరానికి బయలుదేరారు.

నారదమహర్షి మిరియాల పొంగలి, పానకం రుచిని ఎంతగానో ప్రశంసించాడు. దివ్యపర్యాటకులు తరువాత మేల్కోటేలో వారిని మళ్ళీ కలుస్తామని చెప్పారు. అప్పుడు శ్రీకరస్వామి తన పరివారాన్ని మేల్కోటేకు తీసుకువెళతాడు. ఇంతలో గంధర్వాదులు అదృశ్యులై తొండనూరులోని మూడు దేవాలయాలకూ ఏకాంతదర్శనం కోసం వెళతారు. తర్వాత తమ పుష్పక విమానంలో మేల్కోటే చేరుకుంటారు.

## తిరునారాయణపురం, ముఖ్యతీర్థాల సందర్శనం

మన వైకుంఠ సందర్శకులు తొండనూర్‌లోని మూడు దేవాలయాలను సందర్శించిన తర్వాత ఇప్పుడు శ్రీకరస్వామి నేతృత్వంలోని **'రామానుజ'** అను యాత్ర యాత్రికుల కంటే ముందుగా తమ పుష్పకవిమానంలో మేల్కోటే లేదా తిరునారాయణపురం చేరుకుంటారు. వారు స్వామిసన్నిధికి అందరు యాత్రికుల మాదిరిగానే ప్రవేశించి దర్శనంచేసుకోవాలని, అందరితోపాటు శ్రీకరస్వామి చెప్పే స్థలపురాణం, మేల్కొటే మాహాత్మ్యం వినాలని కోరుకుంటారు.

నారదమహర్షి ఉదయం పూజల తరువాత ఆలయం మూసివేస్తారని, సాయంత్రం మాత్రమే తెరుస్తారని చెప్పి,

సమయం వృథాచేసే బదులు మేల్కోటేలో అనేక ఇతర సందర్శనీయ స్థలాలు ఉన్నాయని చెబుతాడు. నారదుడు గంధర్వులందరికీ మార్గదర్శిగా, మేల్కోటేలో అష్టతీర్థాలు (ఎనిమిది తీర్థాలు) ఉన్నాయని చెబుతూ: 'మొదట మనం ధనుష్కోటిని సందర్శిద్దాం, ఇదొక సుందర ప్రదేశం. "ధనుష్కోటి" ఒక చిన్న కొండపై జలపాతంలాగా ఉంటుంది. పురాణ ప్రమాణం ప్రకారం, సీతామాత స్నానం చేయాలనుకున్నప్పుడు, రామచంద్రమూర్తి నీటికోసం కొండపై మూడుబాణాలు వెయ్యగా, బాణాలు కొట్టిన ప్రదేశం నుండి చిన్న నీటి ప్రవాహాలు ఉద్భవించి, ఆ మూడు ప్రవాహాలు కలిసి ఒక చిన్న సరస్సుగా రూపొందాయి. ఈ సంఘటనకు గుర్తుగా ఆ సరస్సు దగ్గర సీత, లక్ష్మణ సహిత రామచంద్రస్వామి శిల్పాలున్నాయి'.

నారదుడు, తోటి దివ్యసందర్శకులు తమ తలలపై ఆ పవిత్రతీర్థాన్ని చల్లుకుంటారు. ఒక తుంటరి గంధర్వుడు నీటి వనరు మూలాన్ని చూడడానికి కొండను ఎక్కే ప్రయత్నం చెయ్యగా నారదుడు "ఋషి మూలం, నదీమూలం అన్వేషించే ప్రయత్నం చెయ్యవద్దని" గంధర్వుడిని వారిస్తాడు.

ఆ ప్రదేశం నుండి వారు మేల్కోటే పట్టణాన్ని చూస్తారు. ఎత్తునుండి ఎంత అద్భుతమైన దృశ్యం; అంతటా పచ్చదనం. అలా వాళ్ళు అన్ని తీర్థాలను ఒక్కొక్కటిగా సందర్శించడానికి బయలుదేరుతారు.

**యాదవతీర్థం:** 'యాదవేంద్రు'డనే రాజు యాదవతీర్థం ఒడ్డున యజ్ఞం చేసి మోక్షాన్ని పొందాడు. ఈ తీర్థంపక్కనే యాదవీనది ప్రవహిస్తుందని చెబుతారు. మన స్వర్గలోక యాత్రికులు తీర్థంలోకి ప్రవేశించి పవిత్రజలాన్ని తలలపై చల్లుకుంటారు.

**పలాశతీర్థం:** తరువాత వారు పలాశతీర్థానికి చేరుకుంటారు. ఒడ్డున పలాశవృక్షాలు ఉన్నందున తీర్థానికి ఆ పేరు వచ్చింది. విశ్వామిత్రుడు వశిష్ఠమహర్షి కుమారులను శపించగా వారు దుఃఖించి, శాపవిమోచన కోరినప్పుడు, పలాశతీర్థంలో స్నానం చేయవలసిందని చెప్పారని జానపదగాథలు చెబుతున్నాయి.

**దర్భతీర్థం:** మన యాత్రికులు అక్కడి నుంచి దర్భతీర్థానికి తరలివెళ్లారు. ఈ తీర్థం ఒడ్డున దర్భగడ్డి పెరిగి ఉన్నది. హిందూసంప్రదాయంలో దర్భకు పరమపవిత్ర స్థానం ఉన్నది. కర్మకాండలన్నీ దర్భతో మాత్రమే నిర్వహించటం జరుగుతుంది. దర్భ మానవులకు– దేవతలకు మధ్యవాహకమని విశ్వాసం.

మానవులు తమ జీవిత చరమ సమయంలో దర్భతీర్థం ఒడ్డున మొలిచిన దర్భను ఉపయోగిస్తే, సత్వరమే మోక్షాన్ని పొందుతారని నమ్మకం. శాండిల్య మహర్షి ఈ దర్భతీర్థం తీరంలో శ్రీమన్నారాయణుడిని పూజించే పాంచరాత్ర విధానంపై ఉపన్యసించారని కూడా చెబుతారు.

**పద్మతీర్థం:** తరువాత మన యాత్రికులు పద్మతీర్థాన్ని దర్శించుకున్నారు. శ్రీమన్నారాయణుని ఆరాధనకు సనత్కుమార ఋషి ఈ తీర్థంలో వికసించిన తామరపువ్వులను ఉపయోగించారని, ఈ తీర్థంలో కమలాలు వికసించినందున దీనికి పద్మతీర్థం అని పేరు వచ్చిందని చెబుతారు. పద్మతీర్థం యొక్క పూలతామరపూసలను ధరిస్తే మోక్షం లభిస్తుందని నమ్మకం.

**మైత్రేయతీర్థం:** ఆపైన పరివారం మైత్రేయతీర్థానికి వెళుతుంది. ఇక్కడే పరాశరమహర్షి మైత్రేయికి విష్ణుపురాణాన్ని బోధించాడని నమ్ముతారు. ఆ మహాసాధ్వి జ్ఞాపకార్థం దీనికి మైత్రేయ తీర్థం అని పేరు వచ్చింది.

**నారాయణతీర్థం:** మైత్రేయతీర్థంనుండి, నారదుడు, గంధర్వులు నారాయణతీర్థానికి వెళతారు. నారాయణతీర్థం ఒడ్డున ఒక పుణ్యాత్ముడైన బ్రహ్మచారి తపస్సు చేసి శ్రీమన్నారాయణుని సాక్షాత్కారాన్ని, మోక్షాన్ని పొందాడని పురాణం. అందుకే నారాయణతీర్థం దగ్గర దహన సంస్కారాలు జరిపితే ఆ జీవి మోక్షాన్ని పొంది నేరుగా వైకుంఠానికి చేరుకుంటారని నమ్ముతారు.

**వేదపుష్కరిణి:** ఇప్పుడు మన స్వర్గసందర్శకులు తిరునారాయణపురం అంటే మేల్కోటేలోని అతి ముఖ్యమైన ప్రదేశాన్ని సందర్శిస్తారు. ప్రతి శ్రీవైష్ణవుడికి ఇది ఒక చారిత్రక ప్రదేశం అని చెప్పవచ్చు. యతులు కావాలని కోరుకునేవారు, సొంత గురువు లేనివారు ఈ స్థలాన్ని ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. మన యాత్రికులు వేదపుష్కరిణిని సందర్శిస్తున్నారు. శ్రీమన్నారాయణుడు దశావతారమే కాకుండా ఎన్నో అవతారాలలో ప్రకటమైనాడు. దశావతారం గురించి అందరికీ తెలుసు కానీ శ్రీరంగంలోని శ్రీనివాసుడు వంటి అర్చావతారాలు కూడా ఉన్నాయి.

*(ఇంకా ఉంది)*

మానవుడు ఋషిమూలం, నదీమూలాలను అన్వేషించే ప్రయత్నం చేయకూడదు

జూన్ 21 న
అంతర్జాతీయ యోగాదినోత్సవ
సందర్భంగా...

# మహాభాగ్యం-యోగాభ్యాసం

- శ్రీమతి గంగవరం శ్రీదేవి, 99089 00098

పతంజలిమహర్షి యావత్ప్రపంచానికి ఇచ్చిన వర దానం **'యోగశాస్త్రం'**. మానవప్రజ్ఞతో అందుకోవడానికి చేసే అద్భుతచాలనం యోగా! మనశరీరాల అద్భుత అను సంధానంతో, సంయమనంతో, సంయోగంతో జనించే నూతనో త్తేజ శక్తి విస్ఫోటనం యోగా! స్థూల సూక్ష్మ శరీరాల శుద్ధి ప్రక్రియలతో, శారీరక మానసిక బౌద్ధిక ఆధ్యాత్మిక శక్తుల సమీకృతతో తేజోమయ ఆత్మదర్శిని ఆత్మానందప్రదాయిని యోగా!

పరబ్రహ్మ స్వరూపమైన శ్రీమన్మహావిష్ణువుకు ఛత్రమై, ఆసనమై, తల్పమై అపురూపంగా సేవలందించే ఆదిశేషుడు **'పతంజలి'** మహర్షిగా జన్మించాడని పురాణగాథలూ పేర్కొం టున్నాయి.

**యోగేన చిత్తస్య పదేన వాచాం మలం శరీరస్య చ వైద్యకేన।**
**యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం పతంజలిం ప్రాంజలిరానతోఽస్మి॥**

పతంజలి మహర్షి "యోగదర్శనము"1-2లో **"యోగ శ్చిత్తవృత్తి నిరోధః"** అన్న సుప్రసిద్ధ నిర్వచనంతో **"ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రాస్మృతిః"** ("యోగదర్శనం" 1-6) అనే ఈ ఐదు చిత్తవృత్తులు అభ్యాస వైరాగ్యసాధనల ద్వారా మనసులో లయత్వం ప్రాప్తించి, మనసు యొక్క స్వరూపంలో స్థిరమైనప్పుడు **"యోగము"** సిద్ధిస్తుందని అన్నాడు.

ఐక్యరాజసమితిలో 193 దేశాల ప్రతినిధుల సభలో 2014 సెప్టెంబరు రోజున భారతప్రధాని **'అంతర్జాతీయ యోగా దినోత్సవా'**నికి ప్రతిపాదన చేశారు. దీనిని 2015 జూన్ 21 తేదీన మొదటి **'అంతర్జాతీయ యోగాదినోత్సవం'**గా ఎంతో గొప్పగా జరుపుకున్నారు. అప్పటి నుండి జూన్ 21 అంతర్జాతీయ యోగాదినోత్సవముగా ప్రతిసంవత్సరం జరుగు తోంది.

**"యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణా ధ్యాన సమాధయః అష్టాంగాని॥"** అని పతంజలి యోగ సూత్రాలు. **యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన** మరియు **సమాధి** అన్నవి యోగము యొక్క ఎనిమిది అంగములు. వీటితో యోగమార్గసాధకుడు ధార్మికుడై, ఉన్నత మానవీయవిలువలతో కూడినవాడై, ప్రశాంతచిత్తుడై, సమాజహితాభిలాషియై, పరమసత్యాన్ని తెలుసుకునే దిశగా జీవితాన్ని మలచుకొంటాడు. ప్రధానంగా ఈ అష్టాంగ యోగములోని ఆసనప్రాణాయామముల ద్వారా మనిషి స్థూల శరీరంతోపాటు సూక్ష్మశరీరం కూడ ప్రభావితమౌతుంది.

భారతీయసంస్కృతి శారీరక మానసిక ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యతను ఇచ్చింది. ఆరోగ్యశాస్త్రాలను సూత్రాలను అందించింది. **"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం"** అన్నది శాస్త్ర



వచనం. గొప్ప పండితులు, మహామేధావులు, జ్ఞానులు, వైరాగ్య సంపన్నులు అయిన మహాత్ములు కూడ శరీరారోగ్యం పట్ల తూష్ణీభావంతో ఉండిపోకుండా, సాక్షాత్తు ఆ పరమాత్మనే ఆరాధించి, ధ్యానించి, తపస్సుచేసి ఆరోగ్యంకోసం వేడు కున్నారు.

సమస్తయోగసాధనాల పరమావధి, పరమప్రయోజనం, మానవజీవితపరమోత్కృష్ట లక్ష్యం భగవదారాధన! భగవద్భా వన! భగవత్సాక్షాత్కారం! పదకవితా పితామహుడు, మహా భక్తుడు అయిన అన్నమయ్య 'తానే తానే ఇందరి గురుడు' అన్న సంకీర్తనతో శ్రీవేంకటేశ్వరస్వామిని **జ్ఞానయోగి, కర్మయోగి, బ్రహ్మయోగి, 'అభ్యాసయోగి'** అంటూ యోగంలోని అద్వితీయ భూమికలను ఆవిష్కరిస్తూ 'సంసారయోగం' గృపజేయువాడిగా పరిపూర్ణయోగదర్శనం చేయిస్తాడు.

తనరగ కపిలుడై దత్తాత్రేయుడై
ఘనమైన మహిమ శ్రీవేంకటరాయడై



## వైకుంఠపాళి

## :: 113 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఏ | రు | 2 వా | క | పూ | ర్ణి | మ | | 3 ఆ | మ | 4 ని |
| క | | సు | | | | | | | | ర్జ |
| చ | | 5 దే | వాం | 6 త | కు | డు | | | | ల |
| క్ర | | వు | | క్ష | | | | | 7 యో | |
| పు | | డు | | 8 కు | రు | డు | | 9 రా | గి | |
| ర | | | | డు | | | 10 భ్రాం | | నీ | |
| 11 ము | స | 12 ల | ము | | 13 మ | 14 హ | తి | | | 15 మే |
| | | క్ష్మ | | | | ను | | 16 పా | | ఘ |
| 17 రా | వ | ణు | డు | | | మం | | 18 క | ద్రు | వ |
| ట్న | | డు | | | | తు | | ద్వి | | ర్ణ |
| 19 ము | ని | | 20 ప | ద్మ | జు | డు | | ట్టు | | డు |

వొనరగ సంసారయోగము గృపసేయు
అనిమిష గతుల అభ్యాసయోగి।

భగవద్భావ బంధురమైన అభ్యాసయోగాన్ని సిద్ధింప జేసుకునే సమస్తశక్తులనూ ప్రసాదించి సంసారబంధాలను సంసారయోగంగా మలచుకునే యోగాభ్యాసగరిమ అను గ్రహించమని ఆ శ్రీవేంకటరాయుడిని మనసారా ప్రార్థిద్దాం! వేడుకుందాం!!

ఓమ్ నమో వేంకటేశాయ



**విద్య వినయాన్నిస్తుంది!**

**అది ఎవ్వరూ దోచుకోలేని అపార ధనాగారం!**

**విద్యవల్ల కీర్తి, సంపద, ఆనందం లభిస్తాయి!**

**విద్య గురువులకు గురువు!**

**అన్యప్రదేశాల్లో విద్యబంధువులా సహాయం చేస్తుంది!**

**పాలకుల వల్ల గౌరవం లభించేలా చేస్తుంది.**





# కల్యాణ వేంకటేశ్వరుని ఆజ్ఞ

- శ్రీ బి.భాస్కర రావు, 99486 13594

**నా** పేరు బలభద్రపాత్రుని భాస్కరరావు. హైదారాబాద్ వాస్తవ్యుడైన శ్రీనివాసభక్తుణ్ణి. అది అక్టోబర్ 27వ తేదీ, ఆదివారం రాత్రి. నారాయణవనంలో విరాజమానులైన కల్యాణ వేంకటేశ్వరస్వామి నా కలలో కనిపించి "నువ్వు నా కీర్తనలను వింటూ మురిసిపోతూ తన్మయం చెందుతూ ఉన్నావు. నేను స్థిర నివాసమున్న తిరుపతిలోనే ఉన్నది నువ్వు ఎంతో అభిమానించే చిన్నమదేవి. నువ్వు ఆమెను మానసపుత్రికగా స్వీకరించి, పితృ స్థానంలో ఉండి ఆమె ఉన్నతికి, ప్రగతికి బాటలు వెయ్యి. పుట్టింటివారిచ్చే మంగళకరమైన వస్తువులనుఇవ్వు" అని సెలవిచ్చారు. నిద్రలేచిన నాకు కలిగిన అలౌకిక అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలవు. ఆ మర్నాడే శ్రీమతి చిన్నమదేవి "నా కచేరి రాజమండ్రిలో నవంబర్ 3వ తేదీన ఉంది" అని పాంప్లెట్‌తో పాటు, వాట్సాప్ మెసేజ్ పంపింది.. వెంటనే నాకు ఆ కల గుర్తొచ్చి "స్వామీ కలలో అదేశించావు. వెంటనే నెరవేర్చడానికి అవకాశం కూడా ఇచ్చావు, ధన్యుణ్ణి" అనుకున్నాను. తరువాత రాజమండ్రికివెళ్లి కచేరీ జరిగేటప్పుడు మధ్యలో దొరికిన సమయంలో పసుపు, కుంకుమ, చలిమిడి శ్రీమతి చిన్నమదేవికిచ్చి, ఆశీర్వదించి మనసులో "స్వామీ మీ ఆదేశానుసారం పుట్టింటి వారిచ్చే కడుపుచలవ చలిమిడి, పసుపుకుంకుమలు ఇచ్చాను. తన పురోభివృద్ధికి నా శాయ శక్తులా కృషిచేస్తాను" అనుకుని నమస్కరించుకున్నాను.

ఆగష్టు 31న మధ్యాహ్నం 3 గంటలకి నిద్రలేచి యూట్యూబ్‌లో, ఎల్లేపెద్ది వేణుగోపాల్ గారు రచించిన "మంగళములివే మాతల్లికి ...." పాటను విన్నాను. ఈ పాటని శ్రీమతి చిన్నమదేవి స్వరపరచి గానం చేశారు. ఆమె కుమారులు చి॥ ప్రసన్నవెంకటేష్ మృదంగంపైన, చి॥ధీరజ్ వయొలిన్ పైన వాద్యసహకారం అందించారు. సాధారణంగా అన్నమయ్య పాటలంటే చెవి కోసుకునే నాకు ఆమె స్వరరచన, కంఠం మంత్రముగ్ధుణ్ణి చేసింది. మరో 2 రోజుల తరువాత యూట్యూబ్‌లో ఎల్లేపెద్ది వేణుగోపాల్ విరచిత "పలుకరే మంగళము పట్టాభిరామునకు.." పాట విన్నాను. దీన్ని కూడా చిన్నమదేవే స్వరపరచిగానం చేశారు. తరవాత నేను పరకామణి సేవకివెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు తిరుపతిలో శ్రీమతి చిన్నమదేవిని శ్రీవేంకటేశ్వరసంగీతనృత్యకళాశాలలో కలిసి, హైదారాబాద్ తిరిగి వచ్చాను. తరువాత ఆమె శ్రీభువనచంద్రచే ఆంధ్రీకరించబడి, తానే స్వరపరచి పాడిన 5 తిరుప్పావై పాశురాలు కూడా అక్టోబర్ 27న వాట్సాప్‌లో పంపించారు. అవివిని ముగ్ధుడినైనాను. ముఖ్యంగా "అంతరంగ కైంకర్యము స్వీకరించవా స్వామి స్వీకరించవా...." అన్న పాశురం విని తన్మయత్వం చెందాను. ఆనందాశ్రువులు నిండిన కళ్ళతో శ్రీమతి చిన్నమదేవికి గద్గదస్వరంతో ఫోన్‌చేసి అభినందించాను.

విచిత్రమేమిటంటే నాకు పైన చెప్పిన కల వచ్చింది కూడా అదే రోజునే. అంతా శ్రీనివాసుడి లీల! ఈమె గురువులు 1)తండ్రి కీ.శే.బ్రహ్మదేశంగోపాలకృష్ణయ్య 2)బ్రహ్మశ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్, తి.తి.దే. ఆస్థానవిద్వాంసులు 3)డా॥ చల్లా ప్రభావతి, రిటైర్డుప్రిన్సిపాల్ శ్రీవేంకటేశ్వరసంగీతనృత్యకళాశాల. ఆ గురువుల ఋణం ఈ శిష్యురాలు అద్భుతంగా తన గాన కైంకర్యంతో తీర్చుకుంటోంది అనటంలో అతిశయోక్తి లేదు.

ఓమ్ నమో వేంకటేశాయ



బాలనీతి

# విశ్వాసం గొప్పదనం

– శ్రీ సురేష్ కుమార్ రెడ్డి,
99858 31828

'గురురేవ పరోధర్మో గురురేవ పరాగతిః' – 'గురువే పరమధర్మం. గురువే పరాగతి.. ఎవరికి దేవుడిపై, గురువుపై సమానమైన భక్తి ఉంటుందో అతను పరబ్రహ్మను పొందగలడు' అనే సూక్తిని బలపరిచే కథ ఇది.

ధ్వజదత్తుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను దారిద్ర్యంతో బాధపడుతూ నైమిశారణ్యంలోని పుష్కరమహాముని దగ్గరికి వెళ్లి సాష్టాంగపడ్డాడు. ఆ బ్రాహ్మణునికి ముని 'హనుమత్ మంత్రాన్ని' ఉపదేశించాడు. ధ్వజదత్తుడు రాత్రింబవళ్లు ఆ మంత్రజపం చేశాడు. గురువుపై విశ్వాసంలేక మంత్రసిద్ధి కాలేదు. కొన్నాళ్లకు వ్యాధిపీడితుడైన గాలుడనే వేటగాడు ధ్వజదత్తుణ్ణి కలుసుకున్నాడు. తన బాధలు ఆయనతో చెప్పుకొన్నాడు. అప్పుడు ధ్వజదత్తుడు 'దైవం లేదు. మంత్రం లేదు. పుష్కరుడినుంచి మాత్రం మంత్రం స్వీకరించకు' అన్నాడు. గాలుడు ఉత్సుకతతో పుష్కరమహర్షి దగ్గరికి వెళ్లి పరిచర్య చేశాడు. అతనిపై సందేహంతో మహర్షి ధ్యానించగా హనుమంతుడు ప్రత్యక్షమయ్యాడు. 'గురుభక్తి ఉంటే సరి. ఉపదేశించవచ్చు' అని ఆజ్ఞ ఇచ్చాడు ఆంజనేయుడు.

మంత్రోపదేశానికి ముందు గాలుడిని పుణ్యతీర్థంలో స్నానంచేసి రమ్మన్నాడు పుష్కరముని. అప్పుడు గాలుడు 'మీ పాదజలమే పుణ్యతీర్థం' అన్నాడు. గురువు హనుమంతుణ్ణి ధ్యానించి తన పాదజలాన్ని అతనిపై చల్లి ద్వాదశాక్షర మంత్రోపదేశం చేశాడు. గురుసమీపంలోనే గాలుడు 108 సార్లు జపం చేయగానే సిద్ధి కల్గింది. భూత భవిష్యత్తులను దర్శించగలిగాడు. గాలుడు ఇంటికి వెళుతూ ధ్వజదత్తుణ్ణి చూశాడు. కానీ, అతను గురునింద చేస్తాడన్న భయంతో మరోదారి ఎంచుకున్నాడు. అది గమనించిన ధ్వజదత్తుడు గాలుడికి అడ్డువచ్చి, అతనిలో అపూర్వతేజస్సు చూసి అబ్బురపడ్డాడు. వెంటనే పుష్కరుడి దగ్గరికి వెళ్లి 'గాలుడికి ఎలా సిద్ధి కలిగింది? నాకు ఎందుకు కాలేదు?' అని నిలదీశాడు. అప్పుడు పుష్కరుడు 'నీకు దైవంపైనే గాని గురువుపట్ల నమ్మకం లేనందుకు' అన్నాడు. ధ్వజదత్తుడు పశ్చాత్తాపంతో పుణ్యనదీ తీరానికి వెళ్లి గురువు, దైవంపై సమాన విశ్వాసాన్ని దృఢతరం చేసి 108 సార్లు జపం చేయగానే అతనికి సిద్ధి కలిగింది. ఆంజనేయుడు ఉష్ట్రవాహనారూఢుడై సువర్చలా సమేతంగా దర్శనమిచ్చాడు. ధ్వజదత్తుడికి అపార సంపదలతోపాటు మోక్షాన్ని కూడా ప్రసాదించాడు.



*నీతి: గురువును మించిన దైవం లేదు.*

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-36

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య
నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

| (धा) | (व-प्र.ए) | | (अर्थः) |
|---|---|---|---|
| पठ् | - पठति | = | చదువుచున్నాడు |
| लिख् | - लिखति | = | వ్రాయుచున్నాడు |
| मार् | - मारयति | = | చంపుచున్నాడు |
| तोष् | - तोषयति | = | సంతోషపెట్టుచున్నాడు |
| रक्ष् | - रक्षति | = | కాపాడుచున్నాడు |
| त्रास् | - त्रासयति | = | భయపెట్టుచున్నాడు |
| पोष् | - पोषयति | = | పోషించుచున్నాడు |
| हास् | - हासयति | = | నవ్వించుచున్నాడు |
| शिक्ष् | - शिक्षयति | = | నేర్పుచున్నాడు |
| धाव् | - धावति | = | పరిగిడుచున్నాడు, తోముచున్నాడు, ఉతుకుచున్నాడు |
| क्षाळ् | - क्षाळयति | = | కడుగుచున్నాడు |
| ताड् | - ताडयति | = | కొట్టుచున్నాడు |
| नाद् | - नादयति | = | మ్రోగించుచున్నాడు |
| तोल् | - तोलयति | = | తూచుచున్నాడు |
| वञ्च् | - वञ्चयते | = | మోసపుచ్చుచున్నాడు |
| पात् | - पातयति | = | పడవేయుచున్నాడు |
| धार् | - धारयति | = | బాకీయుంటున్నాడు |
| चोर् | - चोरयति | = | దొంగలించుచున్నాడు |
| भूष् | - भूषयति | = | పొగడుచున్నాడు, సొమ్ములు పెట్టుచున్నాడు |
| मुण्ड् | - मुण्डयति | = | క్షవరం చేయుచున్నాడు |
| द्राव् | - द्रावयति | = | కరగించుచున్నాడు |
| पाय् | - पाययति | = | త్రాగించుచున్నాడు |
| शाय् | - शाययति | = | పండబెట్టుచున్నాడు |
| पाच् | - पाचयति | = | వండించుచున్నాడు |
| पाठ् | - पाठयति | = | చదివించుచున్నాడు |
| लेख् | - लेखयति | = | వ్రాయించుచున్నాడు |
| शोष् | - शोषयति | = | ఎండించుచున్నాడు |
| दूष् | - दूषयति | = | దూషించుచున్నాడు |
| पूर् | - पूरयति | = | నింపుచున్నాడు |
| पीड् | - पीडयति | = | బాధించుచున్నాడు |
| दण्ड् | - दण्डयति | = | శిక్షించుచున్నాడు |
| मण्ड् | - मण्डयति | = | అలంకరించుచున్నాడు |
| गम् | - गमयति | = | పంపుచున్నాడు |
| चोद् | - चोदयति | = | తోలుచున్నాడు, పురికొల్పుచున్నాడు |
| पाल् | - पालयति | = | పాలించుచున్నాడు |
| चार् | - चारयति | = | నడిపించుచున్నాడు. |

१. ते सर्वेपि रामायणं पठन्ति।
వారందరూ రామాయణం చదువుతున్నారు.

२. यूयं किं लिखथ?
మీరు ఏమి వ్రాస్తున్నారు?

३. एकः वानरः अस्मान् त्रासयति।
ఒక కోతి మనల్ని భయపెట్టుచున్నది.

४. अरे युष्मद्गृहे मार्जालं के पोषयन्ति?
అరే! మీ ఇంటిలోని పిల్లిని ఎవరు పోషించుచున్నారు?

५. अस्माकं मार्जालः प्रतिनित्यम् एकं मूषकं मारयति।
మా పిల్లి ప్రతిరోజు ఒక ఎలుకను చంపుచున్నది.

६. पात्राणि सम्यक् धाव।
పాత్రలను చక్కగా తోము.

७. देव एव सर्वान् रक्षति।
దేవుడే అందరినీ రక్షించును.

८. अद्य प्रातः त्वं मुखं प्रक्षाळयः किम्? नो चेत् जनकः त्वां ताडयिष्यति।
నీవీ ఉదయము ముఖము కడుగుకొంటివా? లేనిచో నాన్నగారు నిన్ను కొట్టెదరు.

९. घण्टां मा नादय।
గంటను మ్రోగించకుము.

१०. वैश्यः घृतं तोलयति
వైశ్యుడు నెయ్యిని తూచుచున్నాడు.

११. एकः चोरः मां वञ्चयित्वा मम वस्त्राणि अचोरयत्।
ఒక దొంగ నన్ను మోసగించి నా యొక్క వస్త్రములను దొంగలించెను.

१२. अहं रामाय दश धारयामि।
నేను రాముని కొరకు పది బాకీ ఉన్నాను.

१३. किमर्थं बालकम् अधः अपातयः?
ఎందుకు బాలుని క్రిందకు త్రోసివేశావు?

१४. रामः जनकं सर्वदा तोषयति।
రాముడు తండ్రిని ఎల్లప్పుడు సంతోషపరుస్తాడు.

01) నన్ను నవ్వించవద్దు.
मां मा हासय।

02) తల్లి తమ్మునికి పాలను త్రాగించుచున్నది.
अम्बा अनुजां क्षीरं पाययति।

03) తరువాత పరుండబెట్ట గలదు.
अनन्तरं शाययिष्यति।

04) ఈ వేళ ఏమేమి వండించెదవు.
अद्य किं किं पाचयसि।

05) నేను పిల్లలను చదివించుచున్నాను.
अहं बालकान् पाठयामि।

06) మొదట వ్రాయింపుము.
प्रथमं लेखय।

07) మేము నిన్ను దూషించుట లేదు.
वयं त्वां न दूषयामः।

08) కానీ భూషించుచున్నాము.
परं भूषयामः।

09) మమ్మల్ని మీరెందుకు శిక్షించెదరు?
अस्मान् यूयं किमर्थं दण्डयन्ति?

10) ఈ చెంబునందు నీటిని పోయుము.
अस्मिन् द्रोण्यां जलं स्थापय।

11) ఆ వృద్ధుని పాలించుము.
तं वृद्धं पालय।

12) ఆ ఎద్దును అడవికి తోలుము.
तं वृषभं वनाय चोदय।

13) అక్కడ గడ్డిని మేపుము.
तत्र तृणं खादय।

14) వానికి క్షవరం చేయవద్దు.
तं मा मुण्डय।

15) కాలమును గడుపుడు.
कालं यापयत।

16) నా పాదమును ఒత్తుము.
मम पादं मर्दय।

17) ఆ పిల్లవానిని దండించుము.
तं बालकं दण्डय।

జూన్ 26 శ్రీ పెరియాళ్వార్ల ఉత్సవారంభ సందర్భంగా...

# పెరియాళ్వార్ వైభవం

– శ్రీమతి కె. లావణ్య,
90528 36164



**గురుముఖ మనధీత్య ప్రాహ వేదా నశేషాన్
నరపతిపరిక్లప్తం శుల్క మాదాతుకామః ।
శ్వశుర మమర వంద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి ॥**

భారతీయ భక్తివాఙ్మయ నందనోద్యానవనంలో భగవదంశ సంభూతులుగా అవతరించినవారు – ఆళ్వార్లు. భగవంతుని గుణసాగరంలో మునిగి, అందులోని లోతును కనిపెట్టినవారు కాబట్టి వీరు 'ఆళ్వార్' పదవాచ్యులయ్యారు.

భూలోకవాసులకు కీర్తన భక్తిద్వారా మోక్షాన్ని అనుగ్రహింప తలచి, తన ఆయుధాలను నిత్యసూరుల ఆళ్వారుల రూపంలో అవతరింపచేసి, తన కల్యాణగుణాలను, లీలలను వర్ణిస్తూ నాలుగువేల పాశురాలుగా వారిచే గానం చేయించారు శ్రీమన్నారాయణుడు.

## పెరియాళ్వార్ల అవతారం

పాండ్యదేశంలో 'శ్రీవిల్లిపుత్తూర్' అనే గ్రామంలో జ్యేష్ఠమాసం, స్వాతీనక్షత్రంలో గరుడాంశలో వీరు జన్మించారు. ముకుందార్యుడు, పద్మైయమ్మన్ అనే పుణ్యదంపతులు వటపత్రశాయిని పలురీతులుగా ప్రార్థించగా, వటపత్రశాయి అనుగ్రహంతో వారికోరిక ఫలించింది.

జ్యేష్ఠమాస– శుక్లపక్ష ఏకాదశి– భానువారంనాడు ఒక పండంటి బాబు ఉదయించాడు. పుట్టినప్పటినుండి సదా విష్ణువునే మనసులో ధ్యానించడంవల్ల ఆ పుణ్యదంపతులు ఆ శిశువుకు 'విష్ణుచిత్తుడ' అని నామకరణము చేశారు.

## పెరియాళ్వార్ల ఇతరనామాలు

గురుపరంపరాప్రభావం, దివ్యసూరిచరితం మొదలగు గ్రంథాలను పరిశీలిస్తే పెరియాళ్వార్లకు విష్ణుచిత్తయోగి, భట్టనాథముని, భట్టముని, స్వాతియోగి, గరుడాంశయోగి, శుల్కముని, కనకశుల్కముని, పరతత్త్వస్థాపకయోగి, గోదా జనకముని, విష్ణుమతస్థాపనాచార్యుడు, ధన్విపురయోగి మొదలగు పేర్లున్నాయి.

## పుష్పకైంకర్యం

వీరు పవిత్రభావంతో తమ ఊరిలో వెలసిన వటపత్రశాయిస్వామికి నిత్యం తులసిమాలాకైంకర్యం, పుష్పమాలల సమర్పణ చేసేవారు.

## రచించిన ప్రబంధములు

**1) తిరుప్పల్లాండు** – ఇది 12 పాశురాల ప్రబంధం. గరుడగమనుడైన భగవంతుణ్ణి గురించి మంగళాశాసన పూర్వకంగా గానం చేయబడిన మధురగీతాలు. భక్తులైనవారు తమ జీవితాన్ని భగవత్సేవయందే గడపడం శ్రేయస్కరమనే దివ్యసందేశాన్ని పెరియాళ్వారులు ఈ ప్రబంధంద్వారా లోకానికి చాటిచెప్పారు. నాలాయిరదివ్యప్రబంధంలో 'తిరుప్పల్లాండు'కు

విశిష్టస్థానముంది. శ్రీవైష్ణవుల నిత్యానుసంధానంలో తిరుప్పల్లాండు తప్పనిసరి కూడా!

**2)పెరియాళ్వార్ తిరుమొళి**– ఇందు 461 పాశురాలున్నాయి. బాలకృష్ణునియొక్క మధురలీలలు మనోహరంగా వర్ణించి ఉన్నాయి. ప్రత్యేకించి ఇందులో పెరియాళ్వారు ప్రదర్శించిన వాత్సల్యభావం అద్భుతంగా, మనోజ్ఞంగా కనిపిస్తుంది.

## పెరియాళ్వార్ పేరుకు కారణం

పంద్రెండు ఆళ్వారులలో వీరికే పెరియాళ్వార్ అనే పేరు ఏర్పడటానికి గల కారణాన్ని పరిశీలిస్తే, వీరు వరుస క్రమంలోను మొదటివారు కాదు. మిగిలిన ఆళ్వారులకన్న ఎక్కువ పాశురాలను కీర్తించినవారుకూడా కాదు. జ్ఞానాధికులా అంటే ఏ గురువువద్ద విద్యాభ్యాసం చేసినవారు కాదు.





ఈ సందర్భంలో వీరినే పెరియాళ్వార్ అనడానికి కారణం–

1) భగవంతునికి మంగళాశాసనం చేసిన ఆళ్వారు కనుక,

2) తాను పెంచి పెద్దచేసిన, 'గోదామహాలక్ష్మి'ని స్వామికి సమర్పించి, స్వామికి మామగారి స్థానాన్ని పొందారు కనుక వీరికి పెరియాళ్వార్ అనే పేరు సార్థకమైంది.

వాత్సల్య రంజిత భక్తిభావం హృదయంలో కొలువుండటం చేత భగవంతునికి మంగళాశాసనం చేసే తలంపు కలిగింది.

### తిరుపతిలో గజవాహనసేవ

**వీరి అవతార తిరునక్షత్రంనాడు తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిఉన్న పెరియాళ్వారులకు గజవాహనసేవ చేయుట జరుగుతుంది. పెరియాళ్వారు గజవాహనంలో గరుత్మంతునిపై ఊరేగే స్వామికి అభిముఖంగా స్వామినిసేవిస్తూ, మంగళాశాసనం కీర్తిస్తూ ఊరేగుతారు. ఈ దృశ్యం ఆనాడు పాండ్యరాజసభలో పరతత్త్వనిర్ణయవిజయంలో జరిగిన గజారోహణ సందర్భాన్ని కళ్లకు కట్టినట్లు దర్శనభాగ్యాన్ని కలుగజేస్తుంది.**

చిత్ర కథ

# బాలగోపాల లీల

కథ- శ్రీమతి జె.పద్మినీ ప్రియదర్శిని
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్








నీతి- దైవమహిమ ఎన్ని పాపాలనైనా పటాపంచలు చేస్తుంది.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## ఆశ విడిచిపెట్టాలి

చదువులందు, రాజ్యపదవులందును, పాడి
మొదవులందు, స్త్రీలపెదవులందు
ఆశ లుడుగునట్టిఅయ్యలు ముక్తులు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** పదవి= ఉద్యోగం; పాడిమొదవులు= పాలిచ్చే ఆవులు; ఆశలు+ఉడుగునట్టి= కోరికలు విడుచునట్టి; ముక్తులు= విడుదల పొందిన వారు.

**భావం:** చదువులపట్ల, అధికారికమయిన పదవులపట్ల, పాడియావులపట్ల, స్త్రీలపట్ల ఆశలుడిగినవారే ముక్తులు. వీరు మాత్రమే ఈ లోకపుబంధనాల నుండి విడివడినవారు.

**వివరణ:** చదివితే పాండిత్యంతోపాటు గర్వం పెరుగుతుంది. దానివలన సామాన్యులను, ఇతర పండితులను అవమానించడం జరుగుతుంది. రాజ్యపదవి లభిస్తానే ప్రజలపై, క్రింది ఉద్యోగులపై అధికారం చూపించడం జరుగుతుంది. పాడిఆవులు ఒకసంపద. అది ఉంటే సంపన్నుడననేగర్వం కలుగుతుంది. తన భార్య పట్ల మాత్రమే కోరిక ఉండాలి. ఇతర స్త్రీలపట్ల మోహం ఉండగూడదు.

వీటిని ఇంకా ఇంకా సాధించాలని ఆశపడే వారికి సుఖంగానీ, మనశ్శాంతిగానీ ఉండవు. కాబట్టి దేనిమీదనయినా ఇంకా చాలా కావాలి అనే ఆశ విడిచిపెట్టాలి.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## రుచిపాకము నాలుకగా కెఱుంగునే

ఎడ్డెమనుష్యుఁ డే మెఱుఁగు నెన్ని దినంబులు గూడి యుండినన్
దొడ్డ గుణాఢ్యునందుఁ గల తోరపు వర్తన లెల్లఁ బ్రజ్ఞ నే
ర్పడ్డ వివేకిరీతి రుచిపాకము నాలుకగా కెఱుంగునే
తెడ్డది కూరలోఁ గలయఁ ద్రిమ్మరుచుండిన నైన భాస్కరా !



**తాత్పర్యం**

భాస్కరా! మూర్ఖుడు సద్గుణవంతునితో ఎంతకాలం కూడి ఉన్నా అతని సత్ప్రవర్తనలు ప్రజ్ఞావంతుడైన వివేకి వలె తెలుసుకోలేడు. రుచిగల వంటను నాలుకతప్ప కూరలో ఎంతసేపు తిరిగేదైనా గరిటె మాత్రం తెలుసుకోజాలదు. –వ్యాఖ్యాత: డా॥తిరుమల శ్రీనివాసాచార్య

## ఏప్రిల్ నెల క్విజ్-33 సమాధానాలు

| | |
|---|---|
| 01) త్రిజటుడు | 11) ఆదిశేషుడు |
| 02) జమదగ్నిమహర్షి | 12) తిరుచెందూర్ |
| 03) ఆహ్వానించువాడు | 13) శంకరాచార్యులు |
| 04) ఈశ్వరుడు | 14) కంచర్లగోపన్న |
| 05) గోవు | 15) అన్నమయ్య |
| 06) కంపరాయలు | 16) శంఖచూడుడు |
| 07) తలంబ్రాలు | 17) రామానుజాచార్యులు |
| 08) చంద్రుడు | 18) రామేశ్వరము |
| 09) ఫల్గుణీతీర్థం | 19) జయంతుడు |
| 10) మానవజన్మ | 20) లంక |

సరైన సమాధానాలు వ్రాసినవారు-

01) కె.అభయ్‌కృష్ణ, హైదరాబాద్
02) బి.వి.జి.ఎస్.కె.యశ్వంత్, మాచర్ల
03) కె.భార్గవ్, హైదరాబాద్
04) కె.హర్షిత్ కుమార్, సిరిసిల్ల
05) సి.తేజశ్వి, విశాఖపట్నం
06) పి.చైత్ర, హనుమకొండ
07) కె.పూజిత, విజయవాడ
08) టి.సుప్రియ, విజయవాడ
09) సి.హెచ్.ఫణి, విజయవాడ
10) ఎన్.గౌతంమహేష్, కాకరపర్రు
11) ఎ.వెంకటసాయిధన్వి, మచిలీపట్నం

# బాలవినోదం

సంఖ్యలను
కలిపి రంగులు
వేయండి



చిత్రాన్ని
చూసి
రంగులు
వేయండి





'యోగాచార్యుని' దగ్గరకు
వెళ్లే మార్గం కనుక్కోండి





భారతీయ సంగీతవాయిద్య
పరికరాలు కాని
వాటిని పేర్కొనండి

**జవాబులు**

1) వయొలిన్ 2) గిటార్ 3) డ్రమ్స్

# క్విజ్ 35

01) శ్రీనివాసస్వామిని అర్చించడానికి వచ్చిన అర్చకుని పేరు? జ)..................
02) 15వ శతాబ్దం రాయలకాలంలో శ్రీనివాసమంగాపురం ఎవరికి నిలయంగా ఉండేది? జ)..................
03) శేషాద్రికి తోకభాగం? జ)..................
04) లక్ష్మితో కూడిన శ్రీమన్నారాయణుని అర్చిస్తే ఏమి ప్రాప్తిస్తుంది? జ)..................
05) తిరుమల ఆలయంలో 'బలిబేరం'గా పిలువబడే స్వామి? జ)..................
06) పురీరథోత్సవానికిగల పేరు? జ)..................
07) జగన్నాథుని రథానికిగల పేర్లు? జ)..................
08) సుభద్రరథం ఎత్తు? జ)..................
09) జగన్నాథస్వామికి ఎన్ని రకాల వంటకాలు నివేదిస్తారు? జ)..................
10) ఉత్కళరాజ్యాన్ని పాలించిన రాజుపేరు? జ)..................
11) నమ్మాళ్వార్లు ఎవరి అంశంలో జన్మించారు? జ)..................
12) నమ్మాళ్వార్లను మేల్కొలుపుటకు మధురకవులు ఏమి చేశారు? జ)..................
13) తిరుక్కోవలూర్‌స్వామివారి విమానం? జ)..................
14) శ్రీవేంకటేశ్వరుడు అభయహస్తంతో వెలిసిన క్షేత్రం? జ)..................
15) ఎద్దుకు పర్యాయం? జ)..................
16) 'ఏరువాక' గురించి ఏ పురాణంలో దర్శనమిస్తుంది? జ)..................
17) ధ్వజదత్తుడు ఏ మునిని ఆశ్రయించాడు? జ)..................
18) చదివితే పాండిత్యంతో పాటు ఏమి పెరుగుతుంది? జ)..................
19) నారదుడు 'ఋషిమూలం, నదీమూలం' అన్వేషించవద్దని ఎవరిని అన్నాడు? జ)..................
20) తిరుక్కోవలూర్ క్షేత్ర రక్షకురాలు ఎవరు? జ)..................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-06-2025.**
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .................. వయస్సు: ..................
పాఠశాల: .................. తరగతి: ..................
పేరు: ..................
చిరునామా: ..................
..................
..................
.................. పిన్‌కోడ్: ..................
ఫోన్ సంఖ్య: ..................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

జూన్, 2025

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** వ్యక్తిగత గౌరవం, స్థాయి పెరగడం, ఇతరులపై సరైన అవగాహన దృక్పథం కలిగి వారి అభిమానం పొందటం, ఉన్నత విద్యా విషయాలలోనూ ముందంజ వేస్తారు.



**వృషభం–** ఇతరులతో స్నేహపూర్వకమైన ధోరణి అవసరం, తలనొప్పి మరియు కంటి సమస్యలతో వైద్యుని సంప్రదిస్తారు, మిశ్రమ ఫలితాలుంటాయి.



**మిథునం–** స్నేహితులు, బంధువులు, తోబుట్టువులతో కలిసి పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దూర ప్రయాణాలు చేస్తారు. మీ మనస్సు ఆహ్లాదకరమైన ప్రదేశంలో ఎక్కువగా ఉండాలని కోరుకుంటుంది.



**కర్కాటకం–** వృత్తి వ్యాపారాలలో కొత్తసవాళ్లను ఎదుర్కొంటారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పారితోషికాలు లభిస్తాయి. కుటుంబ వ్యవహారాలలో ఆశించిన ఫలితాలు, న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉంది.



**సింహం–** ఆకస్మిక ధనలాభాలు మంచి ఫలితాలను ఇస్తుంది. వృత్తిపరమైన రంగంలో పేరు ప్రఖ్యాతులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ఊహించని సహకారాన్ని పొందుతారు.



**కన్య–** స్థానచలన సూచనలుగలవు, అధికారుల అండదండలు ఉంటాయి. కుటుంబం సుఖ సంతోషాలతో ఉంటుంది. సంతానం ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడతారు. వారిని మరిన్ని విజయాలు వరిస్తాయి.



**తుల–** ఊపిరితిత్తులు, ఛాతీ సమస్యలు, అధిక రక్తపోటు వలన ఇబ్బందులు. భూ స్థిరాస్తులు మార్పు చేయడం వలన లాభపడతారు.



**వృశ్చికం–** ఉద్యోగ వృత్తి విషయాల్లో ముందంజ, సమాజ గౌరవం కల్గుతుంది. అధికారం వరిస్తుంది. మీ సలహాకోసం ప్రజలు వేచి చూస్తారు. మీరు సంప్రదాయ పరిరక్షకులుగా కీర్తింపబడతారు.



**ధనుస్సు–** ఉన్నత విద్యావకాశాలు వస్తాయి. మీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాంకేతికపరమైన సంస్థలను నెలకొల్పి ఆదాయమార్గాలకోసం అన్వేషిస్తారు. కొంతమేరకు వనరులవృద్ధి, ఆదాయవృద్ధి కల్గుతుంది.



**మకరం–** ఇతరులను అధిగమించి, పోటీపరీక్షలలో రాణించి విజయాన్ని వరిస్తారు. ఈ రాశిలోని ప్రతివారు ఈ మాసంలో ఏదో ఒక విధంగా రాణించి లాభపడతారు. సంపద కూడా పెరుగుతుంది. సంతోషంగా మరియు ఆరోగ్యంగా ఉంటారు.



**కుంభం–** దూరప్రాంతాలకు వెళ్ళడం, విదేశీ మారకద్రవ్యాన్ని పొందగల్గుతారు. స్థానచలనం అవకాశముంది.



**మీనం–** ఆర్థికస్థితి పెరుగుతుంది. శత్రువులు మీకు హాని చేయలేరు. ధైర్యంగా ముందుకు దూసుకుపోతారు. సోదరవర్గం నుంచి సహకారం అందుతుంది. వృత్తి వ్యాపారాలకు సంబంధించిన ప్రయత్నాలు సానుకూల ఫలితాలను ఇచ్చి ఇతరులకు ఆకర్షణగా నిలుస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)



## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................... తేది :..................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 113



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)జ్యేష్ఠశుద్ధ పూర్ణిమనాడు ఈ పండుగ జరుగుతుంది(7); 3)వసంతఋతువు(3); 5)రావణుని కుమారుడు(5); 8)తపతియగు సూర్యకన్యయందు పుట్టిన పుత్రుడు. ఇతని వంశంలో పుట్టారు కనుక కౌరవులన్నారు(3); 9)ఒక లోహము(2); 11)యాదవ కులంలో ఇది పుట్టడం వల్ల ఒకరికొకరు కొట్టుకుని మరణించారు(4); 13)నారదుని వీణ(3); 17)లంకాధిపతి(4); 18)నాగమాత(3); 19)కశ్యపుని భార్య(2) 20)బ్రహ్మ(4)

**నిలువు** 1)ఈ నగరంలో పాండవులు బ్రాహ్మణ వేషధారులై భిక్షాటన చేశారు(7); 2)వసుదేవుని కుమారుడు కనుక .... ఇలా అన్నారు(5); 4)జ్యేష్ఠశుక్ల ఏకాదశి(3); 6)పరీక్షితును కాటేసి చంపిన పాము(4); 7)జ్యేష్ఠబహుళ ఏకాదశి(3); 10)నివ్వెర పాటు(2); 12)రామానుజుడు(4); 14)సుందరాకాండకు నాయకుడు(5); 15)ఘటోత్కచుని కుమారుడు(5); 16)ఇంద్రుడు(4); 17)దీనిపై గాంధీజీ నూలు వణికాడు(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., P.G. Dip. in Ephigraphy, Dip. in Yoga on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



30-04-2025న విశాఖపట్నం సింహాచల శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామివారికి 'అక్షయతృతీయ' రోజు జరిగిన చందనోత్సవంలో తి.తి.దే. తరపున పట్టువస్త్రాలను సమర్పిస్తున్న తి.తి.దే. ఛైర్మెన్ శ్రీ బి.ఆర్.నాయుడు గారు.



06-04-2025న తెలంగాణరాష్ట్రం, భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాములకల్యాణానికి తి.తి.దే. తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న తి.తి.దే. ఛైర్మెన్ శ్రీ బి.ఆర్.నాయుడుగారు.



11-04-2025న ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారికి వజ్రాలు పొదిగిన స్వర్ణకిరీటాలను తి.తి.దే. ఛైర్మెన్ శ్రీ బి.ఆర్.నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., గార్లకు దాత పెన్నా సిమెంట్ అధినేత శ్రీ ప్రతాప్‌రెడ్డి అందజేస్తున్న దృశ్యం.



06-04-2025న తిరుమల శ్రీవారిదర్శనానంతరం సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నాకు స్వామి క్యాలెండరును అందిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్. గార్లు.



19-04-2025న తిరుమల మొదటి ఘాట్‌రోడ్డు ఆఖరిమెట్టు వద్ద 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛతిరుమల'లో భాగంగా తి.తి.దే. సిబ్బందితో 'స్వచ్ఛాంధ్రప్రతిజ్ఞ' చేయిస్తున్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్. గారు.



20-04-2025న తిరుమల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదకేంద్రంలో భక్తులకు అన్నప్రసాదాలను వడ్డిస్తున్న తి.తి.దే. ఛైర్మెన్ శ్రీ బి.ఆర్.నాయుడుగారు.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-05-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.



అప్పలాయగుంట
శ్రీదేవి భూదేవి సమేత
శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
(07-06-2025 నుండి 15-06-2025 వరకు)